www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

277
ఉప్పల్‌లో పరుగుల ఉప్పెన 11

20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి

277 పరుగులు సాధించిన సన్‌రైజర్స్

ఐపీఎల్ చరిత్రలో రికార్డు స్కోరు

31 పరుగులతో ముంబైపై విజయం



గురువారం | 28-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 343
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా. 6.58 తదుపరి చవితి; నక్షత్రం: స్వాతి రా. 6.39 తదుపరి విశాఖ; వర్జ్యం: రా.12.42-2.26; దుర్ముహూర్తం: ఉ.10.19-11.18, మ.3.11-3.59; అమృతఘడియలు: ఉ.8.58-10.44; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.17; సూర్యాస్తమయం: 6.25 | హైదరాబాద్ సిటీ *
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫోన్ ట్యాపింగ్‌లో
మరో డీసీపీ



గత ప్రభుత్వ పెద్దలకు సమీప బంధువు!!

నాన్-క్యాడర్ అయినా.. కీలక పోస్టింగ్‌లు

తాజాగా గుర్తించిన పంజాగుట్ట పోలీసులు

ట్యాపింగ్‌లో 15 మంది ఎస్ఐబీ అధికారుల పాత్ర

వారికీ నేడోరేపో నోటీసులు.. స్పెషల్ టీమ్‌ల స్వకార్యాలు.. రూ.కోట్ల ఆర్జన

రికార్డింగ్ వినిపించి బెదిరింపులు, దాడులు.. ఏపీలోనూ ఫోన్ ట్యాపింగ్‌లు

మహబూబ్‌నగర్‌లో పోలీస్‌స్టేషన్ పక్కనే ట్యాపింగ్ కేంద్రం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గెలుపు కోసం కామారెడ్డిలో వార్‌రూం!

హైదరాబాద్ /సిటీ, కామారెడ్డి, మేళ్ల చెర్వు, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఇప్పుడు శివారు కమిషనరేట్‌నూ తాకింది.! ఇప్పటికే హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీగా పనిచేసిన రాధాకిషన్‌రావు పేరు వెలుగులోకి రాగా.. తాజాగా శివారు కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ మాదిరి విభాగానికి(ఎస్‌వోటీ) ఇన్‌చార్జిగా వ్యవహరించిన డీసీపీ పాత్రను దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాన్-క్యాడర్ అధికారే అయినా.. ఆయన ఆ కమిషనరేట్‌లో రియల్ ఎస్టేట్ పరంగా అత్యంత కీలకమైన దాదాపు అన్ని జోన్లకు డీసీపీగా పనిచేసినట్లు సమాచారం. సదరు అధికారి తన టీమ్‌తో కలిసి రూ.కోట్లలో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు పంజాగుట్ట పోలీసులు అనుమానిస్తున్నారు. రియల్ ఎస్టేట్ పరంగా కీలకమైన జోన్లు కావడంతో.. ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు భూదందాలు, సెటిల్‌మెంట్లు చేసి, విధేయతను చాటుకున్నారని సమాచారం. సదరు డీసీపీ గత ప్రభుత్వ పెద్దలకు సమీప బంధువు కావడంతో.. సీపీ స్థాయి అధికారి కూడా ఆయన చర్యలను పెద్దగా పట్టించుకునేవారు కాదని భావిస్తున్నారు. ఆ డీసీపీ సూచనల మేరకు ఎస్ఐబీ నుంచి ప్రణీత్‌రావు.. కన్‌స్ట్రక్షన్, ఫార్మా కంపెనీలు, సెలబ్రిటీలు, బడా వ్యాపారుల ఫోన్లను ట్యాప్ చేసినట్లు పంజాగుట్ట పోలీసులు ప్రాథమిక ఆధారాలను

ట్యాపింగ్ నిందితుల కస్టడీపై నేడు తీర్పు

మిగతా 13వ పేజీలో...

మా ఫోన్లూ ట్యాప్ అయ్యాయి..!

ఎన్నికలప్పుడు మురళీ ఫోన్ ట్యాప్ చేశారు: మంత్రి సురేఖ

హైకోర్టు జడ్జిల ఫోన్లూ ట్యాప్ చేశారు : రఘునందన్‌రావు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఏ1, కేటీఆర్ ఏ2

మధు యాష్కీగౌడ్ ఆరోపణ 13

కేసీఆర్, కేటీఆర్‌కు జైలు తప్పదు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



హైకోర్టు భవనానికి శంకుస్థాపన చేసిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్. చిత్రంలో హైకోర్టు సీజే అరాధే

కోర్టుల్లో మౌలిక వసతులు కల్పించాలి

అప్పుడే జడ్జిల పనిసామర్థ్యం పెరుగుతుంది

మహిళా లాయర్లకు ఇబ్బందులుండొద్దు

గతంలో మరుగుదొడ్లు కూడా ఉండేవి కాదు

ఇప్పటికీ కొన్ని జిల్లా కోర్టుల్లో ఇదే దుస్థితి

రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా కొత్త హైకోర్టు

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ వ్యాఖ్యలు

నూతన హైకోర్టు నిర్మాణానికి శంకుస్థాపన

తరతరాలు నిలిచేలా కొత్త హైకోర్టు భవనం

రాష్ట్ర హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో మౌలిక వసతులు కల్పించాలని, అప్పుడే న్యాయవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటుందని, జడ్జిల పని సామర్థ్యం రెట్టింపు అవుతుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. తాను జిల్లా కోర్టులకు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా పనిచేసిన సమయంలో కొన్ని జిల్లా కోర్టుల్లో సరైన మౌలిక వసతులు ఉండేవి కావని, మహిళా న్యాయవాదులకే కాదు.. మహిళా జడ్జిలకూ వాష్‌రూంలు, మరుగుదొడ్లు ఉండేవి కావని చెప్పారు. ఉదయం కోర్టుకు వస్తే సాయంత్రం ఇంటికి

మిగతా 14వ పేజీలో...

భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా
కిరణ్‌కుమార్‌రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సన్నిహితుడికి టికెట్

నిజామాబాద్‌కు జీవన్‌రెడ్డి, మెదక్‌కు నీలం మధు

ఆదిలాబాద్ నుంచి ఆత్రం సుగుణకు చాన్స్

నాలుగు స్థానాలకు అభ్యర్థుల ఖరారు

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో నిర్ణయం

ఖమ్మం, వరంగల్, కరీంనగర్,

హైదరాబాద్ స్థానాలు ఇంకా పెండింగ్‌లోనే



జీవన్‌రెడ్డి | నీలం మధు

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణలోని మరో నాలుగు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. పెండింగ్‌లో ఉన్న ఎనిమిది స్థానాలకుగాను నాలుగు స్థానాలు భువనగిరి, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్‌లకు అభ్యర్థులను ఖరారు చేసింది. నిజామాబాద్ టికెట్‌ను పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డికి కేటాయించగా, తీవ్ర పోటీ నెలకొన్న భువనగిరి నుంచి సీఎం రేవంత్‌రెడ్డి సన్నిహితుడైన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఆదిలాబాద్ (ఎస్టీ)కు ఆత్రం సుగుణ, మెదక్‌కు నీలం మధును అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను బుధవారం రాత్రి ఏఐసీసీ విడుదల చేసింది. పోటీ తీవ్రంగా ఉన్న ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్

మిగతా 12వ పేజీలో...

నేడు ఎమ్మెల్సీ ఉప ఎన్నిక

ఉమ్మడి పాలమూరులో 10 కేంద్రాల ఏర్పాటు 12

క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రాలకే ఓటర్లు

మొత్తం 1,439 మంది ప్రజా ప్రతినిధులకు ఓటు హక్కు

ఎక్స్-అఫీషియో హోదాలో ఓటేయనున్న సీఎం రేవంత్

ఏప్రిల్ 2న కౌంటింగ్

కేజ్రీవాల్‌కు నిరాశే



మధ్యంతర బెయిల్‌కు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి ఆదేశం

తదుపరి విచారణ ఏప్రిల్ 3కి వాయిదా

నేటితో ముగియనున్న ఈడీ కస్టడీ

మరో 5-7 రోజుల కస్టడీ కోరే అవకాశం

మద్యం కేసు డబ్బులు ఎక్కడున్నాయో

కేజ్రీవాల్ నేడు కోర్టులో వెల్లడిస్తారు: సునీత

కేజ్రీ అరెస్టుపై అమెరికా వ్యాఖ్యలు.. ఆ దేశ రాయబారికి భారత్ సమన్లు

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసేందుకు న్యాయస్థానం నిరాకరించింది. తన అరెస్టును, ఈడీ కస్టడీకి పంపుతూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేజ్రీవాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ స్వర్ణ కాంత శర్మ విచారణ జరిపారు. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. ఇరువురి మధ్య వాడీవేడిగా

మిగతా 2వ పేజీలో...

సాధారణ ఖైదీలా కవిత!

తొలి రోజు ముగ్గురు మహిళా ఖైదీలతో కలిపి సెల్ కేటాయింపు

జైలు భోజనమే అందజేత

ఎలాంటి వీఐపీ సౌకర్యాలూ లేవు 3

లేఅవుట్లు, భవన నిర్మాణాలకు
అనుమతులు షురూ

2 నెలల తర్వాత సమావేశమైన బిల్డింగ్ కమిటీ

శివబాలకృష్ణను ఏసీబీ అరెస్టు చేసిన తర్వాత

కీలక పత్రాల పరిశీలన కోసమే ఈ జాప్యం

ఒక్క హెచ్ఎండీఏ పరిధిలోనే పెండింగ్‌లో

రెండు వేలకు పైగా ఫైళ్లు! 13

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ 3

బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో ఘటన

ఆరుగురు మావోయిస్టుల మృతి

మృతుల్లో డిప్యూటీ కమాండర్ నగేశ్, సోనీ

జంట.. తుపాకులు, కిట్ బ్యాగులు స్వాధీనం

ఆరుగురు మృతులపై కలిపి 14 లక్షల రివార్డు

మృతుల సంఖ్య పెరిగే అవకాశం: పోలీసులు

30న బీజాపూర్ బంద్‌కు మావోయిస్టుల పిలుపు



డబ్బు దుప్పటి..!

ఫొటోలో నోట్లు మీదేసుకొని పడుకున్న వ్యక్తి పేరు బెంజిమిన్ బసుమత్రీ. అసోంలోని ఉదాల్‌గిరి జిల్లా ఆయన స్వస్థలం. బెంజిమిన్ రాజకీయ నేత. బోడోల్యాండ్ కోసం పోరాడుతున్న యూపీపీఎల్ పార్టీలో పనిచేశారు. అయితే, విలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కమిటీ(వీసీడీసీ) చైర్మన్‌గా ఉన్న సమయంలో ఆయన అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో పార్టీ ఆయన్ను జనవరి 10న సస్పెండ్ చేసింది. బసుమత్రీపై వచ్చిన అవినీతి ఆరోపణలకు బలాన్నిచ్చేలా ఉన్న ఈ ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్!



జోగుల నరేశ్‌కుమార్ | కర్లపాటి వంశీ

కేసీఆర్ హయాంలోని చెక్కుల్లో వందలకొద్దీ గల్లంతు

ఇంటి పేరు పొడి అక్షరంతో లబ్ధిదారులకు చెక్కులు

ఇదే అదనుగా రెచ్చిపోయిన అక్రమార్కులు

నకిలీ వ్యక్తులతో చెక్కులు డ్రా చేయించిన వైనం 14

19 చెక్కుల ద్వారా రూ.10.5 లక్షలు స్వాహా

అప్పటి మంత్రి హరీశ్ ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్,

అసెంబ్లీలో ఓ అటెండర్ సహా ఐదుగురి అరెస్టు

ఎన్నికల కోడ్ టైంలో ఆఫీసు నుంచి 300 చెక్కుల చోరీ

కృష్ణానగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని అక్రమాలు

ఎన్నికల ఫలితాలొచ్చాక మిగతా చెక్కుల కాల్చివేత

రన్‌వేపై రెండు విమానాలు ఢీ

కోల్‌కతా విమానాశ్రయంలో ఘటన


విరిగిపడ్డ విమానం రెక్క

కోల్‌కతా, మార్చి 27: రన్‌వేపైకి వచ్చేందుకు సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్న ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం రెక్కను ఇండిగో ఎయిర్‌క్రాఫ్ట్ ఢీకొంది. ఈ ఘటన కోల్‌కతా విమానాశ్రయంలో బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. దర్భంగాకు బయలుదేరిన ఇండిగో (6ఈ 6152) పైలట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇరు విమానాల రెక్కలు ఢీకొన్నట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) గుర్తించింది. ఈ ఘటనలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం రెక్క నుంచి ఓ భాగం రన్‌వేపై పడిపోయింది. ఇండిగోకు చెందిన ఇద్దరు పైలట్లను విధుల నుంచి తాత్కాలికంగా తప్పించినట్లు డీజీసీఏ ప్రకటించింది. ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. ప్రమాదం సమయంలో ఇండిగో విమానంలో 125 మంది ఉన్నట్లు డీజీసీఏ తెలిపింది.

సుప్రియ, దిలీప్ ఘోష్‌కు ఈసీ నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీల నాయకులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేతలపై కేంద్ర ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. నటి కంగనా రనౌత్‌ను కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనతే, పశ్చిమ బెంగాల్ సీఎం మమతపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత దిలీప్ ఘోష్‌కు బుధవారం ఈసీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోపు వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. వివరణ ఇవ్వని పక్షంలో తప్పుగా చేసినట్లుగా పరిగణించి ఎన్నికల నియామవళి ప్రకారం చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పింది. అయితే, కంగన గురించి తాను పోస్ట్ చేయలేదని సుప్రియ ఇప్పటికే ప్రకటించగా, దిలీప్ ఘోష్ తన వ్యాఖ్యలపై క్షమాపణ కోరారు.

30న భారతరత్న అవార్డుల ప్రదానం

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని అడ్వాణీ భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఈ నెల 30న భారతరత్నను స్వీకరించనున్నారు. రాష్ట్రపతిభవన్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. మాజీ ప్రధానులు పీవీ నరసింహారావు, చరణ్ సింగ్, ప్రముఖ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్, బిహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్ మరణానంతరం ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. వీరి తరఫున వారి కుటుంబసభ్యులు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా భారతరత్న అందుకోనున్నారు. పీవీ తరఫున ఆయన కుమారుడు ప్రభాకర్‌రావు పురస్కారాన్ని తీసుకోనుండగా, చరణ్‌సింగ్ తరఫున ఆయన మనుమడు ఆర్‌ఎల్‌డీ అధినేత జయంత్ చౌదరీ అవార్డును స్వీకరించనున్నారు.

ఆప్ ఏకైక లోక్‌సభ ఎంపీ సుశీల్ బీజేపీలోకి


న్యూఢిల్లీ, మార్చి 27: లోక్‌సభలో ఆప్‌కు ఉన్న ఏకైక ఎంపీ సుశీల్‌కుమార్ రింకూ బీజేపీలో చేరారు. పంజాబ్‌లోని జలంధర్ పశ్చిమ ఎంపీ అయిన ఆయన జలంధర్ పశ్చిమ ఎమ్మెల్యే శీతల్ అంగురాల్‌తో కలిసి బుధవారం ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో కాషాయ కండువా కప్పుకున్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆయన బీజేపీ నుంచి పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ అభివృద్ధి కోసం, ముఖ్యంగా జలంధర్ అభివృద్ధి కోసమే తాను బీజేపీలో చేరినట్లు సుశీల్ చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను ఆప్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆయన ఆరోపించారు.

కేరళ సీఎం కుమార్తెపై మనీ లాండరింగ్ కేసు

న్యూఢిల్లీ, మార్చి 27: కేరళ సీఎం పినరయి విజయన్ కూతురు వీణా విజయన్, ఆమె ఐటీ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మనీ లాండరింగ్ కేసు (పీఎంఎల్‌ఏ) నమోదు చేసింది. ఎటువంటి సేవలు అందించనప్పటికీ కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ కంపెనీ (సీఎంఆర్‌ఎల్) వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్‌కు అక్రమ చెల్లింపులు జరిపిందని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు (ఎస్ఎఫ్ఐఓ) చేసిన ఫిర్యాదు మేరకు ఈడీ ఈ కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలోనే విచారణకు సంబంధించి వీణా విజయన్‌తో పాటు మరి కొందరికి త్వరలోనే సమన్లు జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది.

ఎన్‌ఐఏ కొత్త బాస్ సదానంద్ వసంత్ దాతే

26/11 దాడుల్లో వీరోచిత పోరాటం



న్యూఢిల్లీ, మార్చి 27: కేంద్ర దర్యాప్తు సంస్థ నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ(ఎన్ఐఏ) డైరెక్టర్ జనరల్‌గా బుధవారం సదానంద్ వసంత్ దాతే నియమితులయ్యారు. ఆయన మహారాష్ట్ర క్యాడర్‌కి చెందిన 1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) చీఫ్‌గా ఉన్నారు. భారత్‌ను తీవ్రంగా కుదిపేసిన 26/11 దాడుల్లో ముష్కరులతో వీరోచితంగా పోరాడిన అధికారుల్లో దాతే ఒకరు. నాడు ముంబై సెంట్రల్ రీజియన్ అదనపు కమిషనర్‌గా ఉన్న దాతేకు.. నగరంలో టెర్రరిస్టులు ప్రవేశించారని సమాచారం అందింది. వెంటనే ఆయన తన బృందంతో రంగంలో దిగారు. ఛత్రపతి శివాజీ టెర్మినల్‌కు సమీపంలో ఉన్న కామా ఆస్పత్రిని ముష్కరులు అజ్మల్, అతని సహచరుడు అబు ఇస్మాయిల్ తమ అదుపులోకి తీసుకున్నారని తెలిసి దాతే బృందం వారిని ఎలాగైనా పట్టుకోవాలని నిశ్చయించుకొంది. ఆ క్రమంలో... శత్రువు గ్రేనేడ్లతో దాడి చేస్తున్నా సరే దాతే ధైర్యంగా కాల్పులు జరిపారు. గ్రేనేడ్ల ధాటికి శరీరమంతా గాయాలయ్యై, నెత్తురోడుతున్నా తాను మాత్రం బెదరలేదు. ఓపక్క ఇతర అధికారులకు సమాచారాన్ని చేరవేస్తూ... మరోపక్క ముష్కరులను కాల్పుల ద్వారా నిలువరిస్తూ గంటకు పైగా పోరాడి చివరకు తీవ్ర రక్తస్రావం కారణంగా స్పృహ కోల్పోయారు. అనంతరం అజ్మల్ కసబ్ సజీవంగా పోలీసులకు చిక్కిన సంగతి తెలిసిందే. దాతే అసమాన తెగువకు గానూ రాష్ట్రపతి పోలీసు సేవా పతకం దక్కింది.

దేశంలో నిరుద్యోగ తాండవం!

నిరుద్యోగుల్లో 83% యువతే.. ఐఎల్‌వో నివేదిక వెల్లడి

- నిరుద్యోగుల్లో విద్యావంతులైన యువత 2000లో 54.2%
- 2022 నాటికి 65.7%కి చేరిక
- 'నిరుద్యోగ బాంబు'పై దేశం: ఖర్గే



న్యూఢిల్లీ, మార్చి 27: భారత్‌లో నిరుద్యోగం తాండవిస్తోందని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్‌వో), మానవాభివృద్ధి సంస్థ(ఐహెచ్‌డీ) సంయుక్త అధ్యయనంలో వెల్లడైంది. 'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పలు కీలక విషయాలను వెల్లడించింది. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ మంగళవారం విడుదల చేశారు. ఈ నివేదిక ముఖ్యంగా చదువుకున్న యువత ఉద్యోగాలు లేక ఈసురోమంటున్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83%మంది యువతేనని ఆ అధ్యయనం పేర్కొంది. అంతేకాక మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000నాటికి 54.2% ఉండగా 2022నాటికి 65.7శాతానికి పెరిగింది. ఈ పరిస్థితి భారత్‌వంటి అభివృద్ధి చెందుతున్న దేశానికి తీవ్ర ఇబ్బందేనని నివేదిక స్పష్టంచేసింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ విద్యావంతుల్లో మహిళలు 76.7% ఉంటే పురుషులు 62.2% మంది ఉన్నారు.

అన్నింటిల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు

నివేదిక విడుదల సందర్భంగా నిరుద్యోగ సమస్యపై సీఈఏ అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ నియామకాలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. "ప్రతి సామాజిక, ఆర్థిక సమస్యల విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలనే ఆలోచన సరికాదు. ప్రపంచంలో వాణిజ్య రంగం విస్తరిస్తోంది. కాబట్టి వారూ నిరుద్యోగాన్ని తగ్గించేందుకు ముందుకు రావాలి. నియామకాలు పెంచుకోవాలి" అన్నారు.

మోదీ దాచాలన్నా దాగదు: కాంగ్రెస్

'భారత నిరుద్యోగ నివేదిక-2024'లో పేర్కొన్న విషయాలపై కాంగ్రెస్ సహా అన్ని విపక్షాలు ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించాయి. "దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని మేం ఎప్పటి నుంచో చెబుతున్నాం. అయినా మోదీ ఈ విషయాన్ని దాచేందుకు, దారిమళ్లించేందుకు ప్రయత్నించారు. సమస్యే లేదన్నట్టు నటించారు. కానీ దాగలేదు. పార్లమెంటు ఎన్నికల్లో దీనినే మేం ప్రధాన అంశంగా యువతలోకి తీసుకువెళ్తాం" అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. నిరుద్యోగ సమస్యను ప్రధాని వక్రీకరించడంతోపాటు అసలు సమస్యే లేదన్నట్టుగా పరధ్యానంలో కాలం వెళ్లదీశారని తెలిపారు. మోదీ ఉదాసీన వైఖరి కారణంగా ఈ దేశం రగులుతున్న నిరుద్యోగం అనే 'బాంబు'పై కూర్చుందని పేర్కొన్నారు. "గత పదేళ్లలో 20కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రధాని అలా చేయకపోగా 12కోట్ల మంది ఉద్యోగాలను తీసేసి రోడ్డున పడేశారు. కాబట్టి ఓటు వేసే ముందే ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలి"అని ఖర్గే పిలుపునిచ్చారు. నిరుద్యోగాన్ని తగ్గించడంలో ప్రభుత్వాలే అన్నీ చేయలేవంటూ అనంత నాగేశ్వరన్.. మోదీ ప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 2012తో పోల్చుకుంటే మోదీ హయాంలో నిరుద్యోగం 3రెట్లు పెరిగిందన్నారు. అందుకే తాను ప్రస్తుత ఎన్నికల్లో 'యువ న్యాయ్' అనే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిపారు. కాగా "గత పదేళ్లలో దేశ లేబర్ మార్కెట్‌లో కొనసాగిన 'అన్యాయ కాల'ాన్ని ఈ నివేదిక బహిర్గతం చేసింది"అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. నిరుద్యోగ సమస్యను మోదీ సర్కారు దాచి పెట్టిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా విమర్శించారు.

ఇవీ నివేదిక వివరాలు

- చదువుకున్న నిరుద్యోగులు 2000లో 54.2% ఉండగా 2022నాటికి 65.7శాతానికి చేరారు.
- విద్యావంతులైన నిరుద్యోగుల్లో ప్రస్తుతం మహిళలు 76.7% ఉండగా పురుషులు 62.2% ఉన్నారు.
- 2000-19 మధ్య యువతకు ఉద్యోగావకాశాలు పెరిగాయి. అలాగే, అర్హత తగిన ఉపాధి పొందని వారి సంఖ్య కూడా పెరిగింది.
- కరోనా కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు భారీగా తగ్గి నిరుద్యోగుల సంఖ్య పెరిగింది.
- 2000లో ఉద్యోగాలు పొందిన యువతలో సగం మంది స్వయం ఉపాధిని పొందిన వారే. వీరిలో 13% మంది రెగ్యులర్, 37% మంది తాత్కాలిక ఉద్యోగాలు దక్కించుకున్నారు.
- వచ్చే పదేళ్ల కాలంలో భారత్‌లో 70-80 లక్షల యువ శక్తి అందుబాటులోకి రానుంది.

కనీస వేతనం రోజుకు రూ.400

కాంగ్రెస్ మరో ఎన్నికల హామీ

అధికారంలోకి రాగానే జాతీయ స్థాయిలో కనీస వేతనంపై కీలక నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. కనీస వేతనాన్ని రోజుకు రూ.400 చేస్తామని తాజాగా మరో హామీ ఇచ్చింది. ఇదే వేతనాన్ని ఉపాధి హామీ కూలీలకు కూడా వర్తింపజేయనున్నట్టు తెలిపింది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. గత పదేళ్ల మోదీ హయాంలో 1శాతం కన్నా తక్కువే వేతనాలు సవరించారని తెలిపారు. కానీ, 2009-14 మధ్య యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత రంగంలోని వారికి 8.6% చొప్పున, వ్యవసాయేతర రంగంలోని వారికి 6.9% చొప్పున వేతనాలు పెంచినట్టు వివరించారు. వ్యవసాయరంగంపై ఆధారపడిన వారి సంఖ్య 2016లో 41% ఉండగా ఇప్పుడు అది 47శాతానికి పెరిగిందని, వీరికి తమ నిర్ణయంతో మేలు జరుగుతుందని ఖర్గే పేర్కొన్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	41.6	18.7
ఆదిలాబాద్	39.8	24.8
నిజామాబాద్	39.4	25.8
ఖమ్మం	38.0	24.0
రామగుండం	37.4	24.5
హైదరాబాద్	37.6	24.2

రొమ్ము క్యాన్సర్ గుట్టు రట్టు

లండన్, మార్చి 27: ఈస్ట్రోజెన్ రిసెప్టార్ పాజిటివ్ (ఈఆర్+) క్యాన్సర్.. ఏటా ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే రొమ్ము క్యాన్సర్లలో 80% ఈ రకానివే. దీని బారిన పడిన మహిళల్లో.. ఈస్ట్రోజన్ కారణంగా క్యాన్సర్ కణాలు వేగంగా పెరిగిపోతుంటాయి. కాబట్టి దాన్ని నియంత్రించేందుకు 'ఈస్ట్రోజన్ బ్లాకర్స్' ఇవ్వడం ద్వారా హార్మోన్ థెరపీ చేస్తుంటారు. సర్జరీ, ఈస్ట్రోజన్ బ్లాకర్స్ చికిత్స వల్ల తగ్గిన క్యాన్సర్.. మళ్లీ కొన్నాళ్ల తర్వాత కొందరిలో తిరగబెడుతుంటుంది. అలా ఎందుకు జరుగుతోందో తెలుసుకునేందుకు లండన్‌లోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ రిసెర్చ్' పరిశోధకులు పరిశోధన చేశారు. హార్మోన్ థెరపీ సమయంలో క్యాన్సర్ కణాల్లో కొన్ని హైబర్నేషన్ (దీర్ఘనిద్ర)లోకి జారుకుంటున్నట్టు.. చికిత్స ఆపేసిన కొన్నాళ్లకు మళ్లీ ఆ కణాలు క్రియాశీలం కావడంతో క్యాన్సర్ తిరగబెడుతున్నట్టు వారి పరిశోధనలో తేలింది. క్యాన్సర్ కణాలను చంపడానికి చేసే ఈ చికిత్సే కొన్ని కణాలను దీర్ఘనిద్రలోకి పంపుతోందని వారు గుర్తించారు. ఈ ప్రక్రియలో 'జీ9ఏ' అనే ఎంజైమ్ కీలకపాత్ర పోషిస్తోందని.. దాన్ని నియంత్రిస్తే క్యాన్సర్ కణాలు దీర్ఘనిద్రలోకి వెళ్లకుండా ఆపొచ్చని, అప్పటికే స్లీపింగ్ మోడ్‌లోకి వెళ్లిన కణాలు కూడా హార్మోన్ చికిత్స కారణంగా చనిపోతాయని వారు వెల్లడించారు. ఇందుకు సమర్థ చికిత్స విధానాన్ని అభివృద్ధి చేయాల్సి ఉంది.

ఓవైపు తీవ్ర క్షుద్బాధ.. మరోవైపు ఆహార వృథా

- 2022లో ప్రపంచవ్యాప్తంగా ఆహార వృథా 105 కోట్ల మెట్రిక్ టన్నులు
- ఆకలి బాధితులు 78.3 కోట్ల మంది

నైరోబీ (కెన్యా), మార్చి 27: ప్రపంచవ్యాప్తంగా ఓవైపు కోట్లాది మంది తిండిలేక క్షుద్బాధను అనుభవిస్తుంటే.. మరోవైపు టన్నుల కొద్ది ఆహారం వృథా అవుతోందని తాజా నివేదిక స్పష్టం చేసింది. 2022 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తయిన ఆహారంలో దాదాపు 19% వృథా అయినట్టు ఐక్యరాజ్యసమితి (యూఎన్) తాజా నివేదిక పేర్కొంది. ఇది దాదాపుగా 105 కోట్ల మెట్రిక్ టన్నులకు సమానమని తెలిపింది. ఈ మేరకు బుధవారం ప్రచురితమైన యూఎన్ పర్యావరణ కార్యక్రమానికి చెందిన ఆహార వృథా సూచీ నివేదిక స్పష్టం చేసింది. 2030 నాటికి ఆహార వృథాను సగానికి తగ్గించడానికి దేశాలు చేస్తున్న కృషికి సంబంధించిన పురోగతిని ఇది ట్రాక్ చేస్తోంది. 2021లో వెలువడిన నివేదిక ప్రకారం.. 2019లో ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయిన ఆహారంలో 17% వృథా అయినట్టు అంచనా వేశారు. ఇది 93.1 కోట్ల టన్నులకు సమానం. కాగా ప్రతి వ్యక్తి ఏడాదికి దాదాపు 79 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నట్టుగా పరిశోధకులు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా ఇది రోజుకు కనీసం వంద కోట్ల భోజనాల వృథాకు సమానమని పేర్కొన్నారు. ఈ వృథాలో ఎక్కువగా అంటే 60% గృహాల నుంచే ఉంటోంది. ఆహార సర్వీసులు లేదా రెస్టారెంట్ల నుంచి వృథా దాదాపు 28% ఉండగా.. రిటైలర్ల వృథా దాదాపు 12% ఉంది. ప్రపంచవ్యాప్తంగా 78.3 కోట్ల మంది తీవ్రమైన క్షుద్బాధను ఎదుర్కొంటున్న నేపథ్యంతో ఆహార వృథా పెరిగిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం అవుతోంది.

డబ్బుల్లేక పోటీ చేయట్లేదు

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడటానికి అవసరమైన డబ్బులు లేకపోవటం వల్లనే తాను ఎన్నికల బరిలో నిల్చోలేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఏపీ నుంచి గానీ, తమిళనాడు నుంచి గానీ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయమని తనకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అవకాశం ఇచ్చారని.. కానీ, తాను సున్నితంగా తిరస్కరించారన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన 'టైమ్స్‌నౌ సదస్సు-2024'లో నిర్మల మాట్లాడుతూ ఈ వివరాలను తెలియజేశారు. 'వారం పది రోజులు ఆలోచించాక నడ్డాతో మాట్లాడాను. పోటీ పడటానికి తగినన్ని డబ్బులు లేవు. అంతేగాక, ఏపీనా? తమిళనాడా? అనేది కూడా తేల్చుకోలేకపోయా. దీంతోపాటు ఎన్నికల్లో పోటీ పడితే.. ఏ కులం? ఏ మతం? అనేవి కూడా లెక్కలేస్తారు. ఇదంతా చూసే నేను పోటీ పడలేనని చెప్పా. పార్టీ అధిష్ఠానం నా వాదనకు అంగీకరించింది. ఇందుకు వారికి కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. దేశ ఆర్థికమంత్రి వద్ద డబ్బులు లేకపోవటం ఏమిటని సదస్సుకు హాజరైన వారు సరదాగా ప్రశ్నించగా.. తన వేతనం, తాను దాచుకున్న డబ్బులు మాత్రమే తనవి కానీ, భారత ప్రభుత్వ సొమ్ము (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియా) తనది కాదని నిర్మల జవాబిచ్చారు. తాను లోక్‌సభ ఎన్నికల్లో పోటీ పడకపోయినా, తమ పార్టీకి చెందిన పలువురు అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నానని గుర్తు చేశారు. నిర్మలా సీతారామన్ ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఉన్నారు.

అఘాడీలో మహా చిచ్చు!

- ఉద్ధవ్ సేన తీరుపై కాంగ్రెస్, పవార్ గుర్రు
- 17 ఎంపీ స్థానాలకు ఏకపక్షంగా అభ్యర్థుల ప్రకటనపై ఆగ్రహం


ఫైల్

ముంబై, మార్చి 27: మహారాష్ట్రలోని మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)లో లుకలుకలు తీవ్రమయ్యాయి. ముంబైలోని ఐదు లోక్‌సభ స్థానాలు సహా 17 ఎంపీ సీట్లకు శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) ఏకపక్షంగా అభ్యర్థులను ప్రకటించడంపై కాంగ్రెస్, ఎన్‌సీపీ (శరద్ పవార్) తీవ్ర ఆగ్రహంతో ఉన్నాయి. వీటిలో ముంబై సౌత్ సెంట్రల్, వాయవ్య ముంబై, సాంగ్లీ, భివండీ స్థానాలపై కాంగ్రెస్ గట్టిగా పట్టుబడుతుండగా.. భివండీ సీటు కోసం పవార్ ఎన్‌సీపీ కూడా డిమాండ్ చేస్తోంది. రాష్ట్రంలో 48 లోక్‌సభ స్థానాలుండగా వీటిలో 22 స్థానాల్లో పోటీచేస్తానని ఉద్ధవ్ సేన ఇదివరకే ప్రకటించింది. కాంగ్రెస్ 16, పవార్ ఎన్‌సీపీ 10, స్వాభిమానీ షేత్కారీ సంఘటన్‌కు ఒకటి ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించారు. పోటీచేసే స్థానాలపై ఓపక్క చర్చలు జరుగుతుండగానే ఉద్ధవ్ సేన 17మంది అభ్యర్థులతో మంగళవారం తొలి జాబితా ప్రకటించింది. దీనిపై ముంబై కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సంజయ్ నిరుపమ్ మండిపడ్డారు. ముంబైలోని ఐదు స్థానాల్లో పోటీచేయడం ద్వారా కాంగ్రెస్‌ను కాళ్లబేరానికి తీసుకురావాలని ఆ పార్టీ ప్రయత్నిస్తోందని.. పొత్తు ధర్మాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను కాపాడుకోవాలంటే తక్షణమే దానితో తెగతెంపులు చేసుకోవాలని బుధవారం అధిష్ఠానాన్ని డిమాండ్‌చేశారు. వాయవ్య ముంబై నుంచి పోటీచేయాలని ఆయన భావిస్తున్నారు. ఇక్కడ ఉద్ధవ్ సేన అమోల్ కీర్తికర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఈ సీటు వ్యవహారంలో వారం వేచిచూస్తానని.. తర్వాత తన నిర్ణయం తీసుకుంటానని నిరుపమ్ అన్నారు. ఆయన బీజేపీ కూటమిలో చేరతారని ప్రచారం జరుగుతోంది. అయితే వాయవ్య ముంబైని వదులుకోవడానికి కాంగ్రెస్ సుముఖంగానే ఉంది. కానీ సాంగ్లీ, ముంబై సౌత్ సెంట్రల్ సీట్లను ఇచ్చేందుకు ససేమిరా అంటోంది. సాంగ్లీలో మాజీ సీఎం వసంతదాదా పాటిల్ మనవడు విశాల్ పాటిల్‌ను, సౌత్ సెంట్రల్‌లో ముంబై పీసీసీ అధ్యక్షురాలు వర్షా గైక్వాడ్‌ను బరిలోకి దించాలని ఆ పార్టీ భావిస్తుండగానే.. ఉద్ధవ్ సేన తన అభ్యర్థులను ప్రకటించడాన్ని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు సహించలేకపోతున్నారు. ఈ రెండు సీట్లలో పాలక మహాయుతి కూటమి (బీజేపీ-షిండే శివసేన-అజిత్ పవార్ ఎన్‌సీపీ)తో తలపడే సత్తా ఉద్ధవ్ సేనకులేదని.. అవసరమైతే ఈ రెండుచోట్ల స్నేహపూర్వక పోటీలకు దిగాలని భావిస్తున్నారు. కాగా అఘాడీలో చిచ్చుకు కాంగ్రెసే కారణమని రాజకీయవర్గాలంటున్నాయి. కొల్హాపూర్ స్థానంలో కొల్హాపూర్ రాజవంశానికి చెందిన షాహూ మహరాజ్ ఛత్రపతిని అఘాడీ తన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించింది. షాహూను తన ఎన్నికల గుర్తుపై పోటీచేయించాలని ఉద్ధవ్‌సేన భావించింది. అయితే కాంగ్రెస్ తన హస్తం గుర్తుపై పోటీచేసేందుకు ఆయన్ను ఒప్పించింది. తమతో స్నేహం నెరపుతూనే దొంగదెబ్బతీయడానికి కాంగ్రెస్ తెరచాటు ప్రయత్నాలు చేయడంపై ఉద్ధవ్‌సేన గుర్రుగా ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్, పవార్ ఎన్‌సీపీకి కలిపి 34% ఓట్లుండగా.. ఉద్ధవ్‌సేన కలిస్తే 40%పైనే ఓట్లు వచ్చే అవకాశముంది. వాస్తవానికి ఈ 3పార్టీలు ఒకదాని బలం పై మరొకటి ఆధారపడి ఉన్నాయి. ముంబైలో సీట్లు గెలవాలంటే ఉద్ధవ్‌సేనకు కాంగ్రెస్ మద్దతు, మరాఠ్వాడా ప్రాంతంలో పాలక కూటమిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్‌కు ఉద్ధవ్‌సేన, పవార్ ఎన్‌సీపీల సహకారం కావాలి.

ఎంవీఏతో పొత్తు లేదు

మహా అఘాడీకి బాబాసాహెబ్ అంబేడ్కర్ మనవడు, వంచిత్ బహుజన్ అఘాడీ (వీబీఏ)అధినేత ప్రకాశ్ అంబేడ్కర్ గట్టి షాకిచ్చారు. దానితో పొత్తు పెట్టుకునే ప్రసక్తేలేదన్నారు. వారసత్వ రాజకీయాలను ప్రోత్సహించేందుకు వీబీఏను వాడుకోవాలని ఎంవీఏ చూస్తోందని విమర్శించారు. మొదటి, రెండు దశల్లో పోలింగ్ జరిగే 13 స్థానాల్లో 8 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అకోలా నుంచి ఆయనే బరిలోకి దిగుతున్నారు. వీటిలో ఇప్పటికే కాంగ్రెస్, ఉద్ధవ్ సేన తమ తమ అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం. ఆయన నిర్ణయం దురదృష్టకరమని మహారాష్ట్ర సీఎల్పీ నేత బాలాసాహెబ్ తోరట్ వ్యాఖ్యానించారు.

కేజ్రీవాల్‌కు నిరాశే

(మొదటి పేజీ తరువాయి)


పటియాలా హౌస్ కోర్టు ఆవరణలో ఆప్ లీగల్ సెల్ సభ్యుల ఆందోళన

వాదనలు జరిగాయి. తొలుత ఈడీ తరఫున ఎస్వీ రాజు వాదిస్తూ, తమకు మంగళవారమే కేజ్రీవాల్ పిటిషన్ కాపీ అందిందని, దాన్ని పరిశీలించి బదులిచ్చేందుకు మూడువారాల సమయం కావాలని కోరారు. దీనికి అభిషేక్ మను సింఘ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణలో జాప్యం చేయటానికే పిటిషన్‌పై బదులిచ్చేందుకు ఈడీ మరింత సమయం కోరుతోందని ఆరోపించారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి ఈడీకి సరైన ప్రాతిపదికే లేదని, మూడు వారాల గడువు ఇస్తే ఈలోపు మళ్లీ ఏదో ఒక స్క్రిప్టు సిద్ధం చేస్తారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఒక ముఖ్యమంత్రిని ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నిస్తూ.. 'దేశంలో కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్ ఆద్మీ పార్టీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతున్నది. మద్యం కేసులో అప్రూవర్లుగా మారిన వారిని నమ్మడానికి వీల్లేదు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఈడీ దగ్గర ఎటువంటి సాక్ష్యాలు లేవు. రాజకీయ కారణాలతోనే అరెస్టు చేశారు. అందుకే.. దీన్నో తప్పుడు కేసుగా పరిగణించి కేజ్రీవాల్‌ను విడుదల చేయాలి. గురువారంతో కేజ్రీవాల్ రిమాండ్ గడువు ముగుస్తుంది. ఈలోపే హైకోర్టు మధ్యంతర బెయిల్ ఇవ్వాలి' అని హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. 'మధ్యంతర బెయిల్ కోరుతూ దరఖాస్తు చేసే స్వేచ్ఛ బాధితుడికి ఉంటుంది. అదే సమయంలో దానిపై సమాధానం చెప్పడానికి ఈడీకి అవకాశం ఇవ్వడం తప్పనిసరి' అని స్పష్టం చేశారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ సాయంత్రం తీర్పును వెల్లడించారు. ఏప్రిల్ 2వ తేదీలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించారు. తదుపరి విచారణను ఏప్రిల్ 3కి వాయిదా వేశారు.

నేటితో ముగియనున్న ఈడీ కస్టడీ

కేజ్రీవాల్ ఈడీ కస్టడీ గురువారంతో ముగియనుంది. శుక్రవారం మధ్యాహ్నం ఆయనను ఈడీ రౌస్ అవెన్యూ కోర్టు ఎదుట హాజరు పరచనుంది. మరో 5-7 రోజుల కస్టడీని ఈడీ కోరే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, కేజ్రీవాల్ మధుమేహంతో బాధపడుతున్నారని.. ఆయన రక్తంలో షుగర్ లెవల్స్ తరచూ హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయని ఆమ్‌ఆద్మీపార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. కేజ్రీవాల్ బ్లడ్ షుగర్ లెవల్స్ ఒకదశలో 46 ఎంజీకి పడిపోయాయని వైద్యులు చెప్పినట్లు ఆప్ వర్గాలు బుధవారం వెల్లడించాయి.

అమెరికా వ్యాఖ్యలపై భారత్ సమన్లు

"కేజ్రీవాల్‌కి సంబంధించి నిష్పాక్షిక, పారదర్శక, నిర్ణీత కాలవ్యవధితో కూడిన న్యాయవిచారణ జరుగుతుందని భావిస్తున్నాం" అంటూ మంగళవారం అమెరికా విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఢిల్లీలోని అమెరికా దౌత్యవేత్తకు కేంద్రప్రభుత్వం సమన్లు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీ సౌత్ బ్లాక్‌లోని విదేశాంగశాఖ కార్యాలయానికి అమెరికా రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ గ్లోరియా బెర్బేనా వచ్చారు. ఈ సందర్భంగా, అమెరికా వ్యాఖ్యలపై భారత అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం విదేశాంగశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ఇతర దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించడం దౌత్య సంబంధాల్లో ఎంతో కీలకం. దీనిని పాటించకపోతే దేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతినే ప్రమాదముంది. కేజ్రీవాల్ అరెస్టు, విచారణపై మీ(అమెరికా) జోక్యం సరికాదు" అని ప్రకటనలో అందులో పేర్కొంది.

డబ్బు ఎక్కడుందో కోర్టులో చెబుతారు: సునీత

కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో వాదనలు జరుగుతున్న సమయంలో ఆయన సతీమణి సునీత సంచలన ప్రకటన చేశారు. ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి గురువారం కోర్టులో కేజ్రీవాల్ అన్ని నిజాలు బయటపెడతారని, డబ్బు ఎక్కడుందో చెబుతారని, ఈ మేరకు కోర్టుకు ఆధారాలు కూడా సమర్పిస్తారని చెప్పారు. ఈ మేరకు ఒక వీడియోను సునీత విడుదల చేశారు. 'ఈ కేసుకు సంబంధించి గురువారం కోర్టులో అన్ని నిజాలు బయటపెడతానని కేజ్రీవాల్ నాతో చెప్పారు' అని సునీత పేర్కొన్నారు.

జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పీఏ ఎత్తివేత!

- పరిశీలిస్తామన్న కేంద్ర మంత్రి అమిత్‌షా
- సెప్టెంబరుకన్నా ముందే అసెంబ్లీ ఎన్నికలు

న్యూఢిల్లీ, మార్చి 27: కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఏఎఫ్ఎస్‌పీఏ) ఉపసంహరించుకునే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించనున్నట్టు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఈ ప్రాంతం నుంచి సైన్యాన్ని వెనక్కి తీసుకుని శాంతిభద్రతలకు సంబంధించిన బాధ్యతలను జమ్మూకశ్మీర్ పోలీసులకే అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టుగా మంగళవారం ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. ఏఎఫ్ఎస్‌పీఏను ఉపసంహరించుకోవాలని జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లోని పలు సంస్థలు, వ్యక్తులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పీఏను ఉపసంహరించుకునే అంశాన్ని పరిశీలించనున్నట్టు షా పేర్కొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇంతకు ముందు జమ్మూకశ్మీర్ పోలీసులపై నమ్మకం ఉండేది కాదని, కానీ ఇప్పుడు వాళ్లు ఆపరేషన్లకు నాయకత్వం వహిస్తున్నారని షా చెప్పారు. కల్లోలిత ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించే సైన్యం అవసరం అనుకుంటే సోదాలు, అరెస్టులు చేయడానికేకాకుండా కాల్పులు జరపడానికి కూడా ఏఎఫ్ఎస్‌పీఏ విస్తృత అధికారాలను కల్పిస్తోంది. జమ్మూకశ్మీర్‌లో ఏఎఫ్ఎస్‌పీఏ అమల్లో ఉన్నప్పటికీ ఈశాన్యరాష్ట్రాల్లోని 70 శాతం ప్రాంతాల్లో దీన్ని తొలగించినట్టు ఇంతకు ముందు షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. జమ్మూకశ్మీర్‌లో సెప్టెంబరు కన్నా ముందే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని అమిత్‌షా పేర్కొన్నారు. సెప్టెంబరుకన్నా ముందే జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఇంతకు ముందే సుప్రీంకోర్టు ఆదేశించింది. జమ్మూకశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం ప్రధాని నరేంద్ర మోదీ హామీ అన్న షా దాన్ని నెరవేర్చనున్నట్టు చెప్పారు.

30 వేల కోట్లతో కంచె!

మయన్మార్ సరిహద్దులో నిర్మాణం

మయన్మార్ సరిహద్దులో 1,610 కిలోమీటర్ల మేర కంచె ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.30 వేల కోట్లు వెచ్చించనుంది. ఈశాన్య ప్రాంతంలో స్మగ్లింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు జాతీయ భద్రతా కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇరుదేశాల మధ్య వీసా రహిత రాకపోకల విధానానికి ముగింపు పలికేందుకు మయన్మార్ సరిహద్దులో కంచె నిర్మిస్తామని ప్రభుత్వం ఈ ఏడాది మొదట్లో ప్రకటించింది. కంచెకు సమాంతరంగా 1,700 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు కూడా సీనియర్ అధికారుల కమిటీ అంగీకారం తెలిపిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

జైలులో సాధారణ ఖైదీలా కవిత!

- మొదటి రోజు ముగ్గురు మహిళా ఖైదీలతో కలిపి సెల్ కేటాయింపు
- సాధారణ జైలు భోజనమే అందజేత
- ఎలాంటి వీఐపీ సౌకర్యాలు లేవు



న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత మొదటి రోజు సాధారణ ఖైదీలా గడపాల్సి వచ్చింది. జైలులో ముగ్గురు సాధారణ మహిళా ఖైదీలతో ఆమెకు సెల్ కేటాయించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కవితను రాజకీయ వ్యక్తిగా తిహాడ్ జైలు అధికారులు పరిగణించడం లేదని, ఆమెకు ప్రత్యేకంగా ఎలాంటి వీఐపీ సౌకర్యాలు కల్పించడం లేదని ఆ వర్గాల సమాచారం. ఇంటి నుంచి భోజనం తెప్పించుకునేందుకు అనుమతించాలని కోర్టు చెప్పినప్పటికీ, జైలు నిబంధనల ప్రకారం ఆమెకు బుధవారం సాధారణ జైలు భోజనమే అందించినట్టు తెలిసింది. జైలులో ఉత్తర, దక్షిణాది ఖైదీలకు లభించే భోజనమే కవితకు ఇస్తారని ఆ వర్గాలు తెలిపాయి. దక్షిణాది భోజనం వండేందుకు ప్రత్యేకంగా వంటవాళ్లు ఉంటారని, భోజన పట్టికలో ఖైదీలు కోరిన భోజనాన్ని అందరితో పాటు కవితకు ఇస్తారని వెల్లడించాయి. మొదటి రోజు అయినందు వల్ల బుధవారం కవితను కలుసుకునేందుకు ఎవరినీ అనుమతించలేదు. సాధారణంగా ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో ఖైదీలను వారి బంధువులు అరగంట చొప్పున రెండుసార్లు కలుసుకునేందుకు మాత్రమే అనుమతిస్తారు. ఈ నిబంధన కవితకు కూడా వర్తిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. కవిత తన కుటుంబ సభ్యులు ఎవరినైనా కలవాలంటే జైలు అధికారులకు తెలిపి అనుమతి తీసుకోవచ్చని, ఒకవేళ ఎవరైనా కవితను కలుసుకోవాలంటే ఆమె అంగీకారంతో అనుమతి ఇస్తారని ఆ వర్గాల ద్వారా తెలిసింది. కవిత తన సొంత దుస్తులు ధరించేందుకు జైలు అధికారులు అనుమతి ఇచ్చినట్టు సమాచారం. కవితకు ఏప్రిల్ 9 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించగా, ఆమెను తిహాడ్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే.

ప్రభుత్వానికి పన్ను రాబడి ఊరట

ఫిబ్రవరిలో రూ.13,703 కోట్ల వసూళ్లు.. ఈ ఆర్థిక సంవత్సరం ఇదే అత్యధికం

- మొత్తం అంచనాల్లో ఇప్పటి వరకూ 81.41 శాతం రాక
- లక్ష్యానికి దగ్గరగా జీఎస్టీ, ఎక్సైజ్ సుంకాలు
- కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద వచ్చింది 16.86 శాతమే
- 11 నెలల్లో ఆదాయం రూ.1,51,947.05 కోట్లు, వ్యయం రూ.1,87,357.46 కోట్లు
- రుణాలు రూ.41,448.16 కోట్లు
- వెల్లడించిన 'కాగ్' ఫిబ్రవరి నివేదిక



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి పన్ను వసూళ్లు ఊరట నిస్తున్నాయి. ఫిబ్రవరి నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎప్పుడూ లేనంతగా రూ.13,703.92 కోట్ల మేర వసూలైంది. ఇది 11 నెలల సగటు రాబడి రూ.11,286 కోట్ల కంటే రూ.2,400 కోట్లు ఎక్కువ. ఆగస్టు, డిసెంబరు నెలల్లో రూ.12 వేల కోట్ల కంటే ఎక్కువగా పన్ను వసూలైనా... ఫిబ్రవరిలో దానికి మించి రావటం విశేషం. ఈ మేరకు రాష్ట్ర రాబడులు, వ్యయాలపై 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' (కాగ్) బుధవారం ఫిబ్రవరి నివేదికను విడుదల చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్ని రకాల పన్నుల ద్వారా రూ.1,52,499.49 కోట్ల రాబడి వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా.. ఫిబ్రవరి నాటికి రూ.1,24,146.19 కోట్లు వచ్చింది. ఇది లక్షిత రాబడిలో 81.41 శాతం. పన్నులతో పాటు పన్నుయేతర ఆదాయం, కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు కలిపి రూ.2,16,566.97 కోట్ల రెవెన్యూ రాబడిని అంచనా వేయగా... రూ.1,51,947.05 కోట్లు (70.16%) వచ్చాయి. పన్నుల్లో ఎక్సైజ్ సుంకాలు, జీఎస్టీ వసూళ్లే లక్ష్యానికి కాస్త దగ్గరగా ఉన్నాయి. జీఎస్టీ ద్వారా రూ.50,942.66 కోట్లను అంచనా వేయగా... ఫిబ్రవరి నాటికి రూ.42,441.31 కోట్లు (83.31%) సమకూరాయి. ఎక్సైజ్ సుంకాల కింద రూ.19,884.90 కోట్లు వస్తుందని ఆశించగా.. రూ.18,927.79 కోట్లు (95.19%) వచ్చాయి. కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ.14,528.18 కోట్లను అంచనా వేయగా... 14,955.37 కోట్లు (102.94%) రావడం గమనార్హం. కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద ఈ ఫిబ్రవరి నెలలోనే రూ.1,111.17 కోట్లు రావడం ఊరటనిచ్చే అంశమే. అయితే, ఈ పద్దు కింద మొత్తం రూ.41,259 కోట్లను అంచనా వేయగా... ఇప్పటివరకు రూ.6,955 కోట్లు (16.86%) మాత్రమే వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ పన్నుయేతర రాబడి కింద రూ.22,808.31 కోట్లను అంచనా వేయగా.. 20,845.06 కోట్లు (91.39%) సమకూరాయి. ఇక బహిరంగ మార్కెట్ రుణాల కింద రూ.38,234.94 కోట్లను అంచనా వేయగా... రూ.41,448.16 కోట్లు (108.40%) వచ్చాయి. కాగా... ఫిబ్రవరి నాటికి 11 నెలల్లో మొత్తం రూ.1,87,357.46 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసినట్లు 'కాగ్' వెల్లడించింది. ఇది అంచనా వ్యయం రూ.2,49,209.93 కోట్లలో 75.18 శాతం. రెవెన్యూ వ్యయం కింద రూ.68,986 కోట్లు, వడ్డీ చెల్లింపుల కోసం రూ.20,844 కోట్లు, ఉద్యోగుల వేతనాలు/భత్యాల కోసం రూ.35,739 కోట్లు, పెన్షన్ల కోసం రూ.15,344 కోట్లు, సబ్సిడీల కోసం రూ.8,248 కోట్లను వ్యయం చేసింది.

నెలవారీగా పన్ను రాబడి (రూ.కోట్లలో)

ఏప్రిల్	9,698.65
మే	10,399.08
జూన్	11,627.37
జూలై	10,987.16
ఆగస్టు	12,729.50
సెప్టెంబరు	11,249.73
అక్టోబరు	10,691.20
నవంబరు	9,701.25
డిసెంబరు	12,609.37
జనవరి	10,748.96
ఫిబ్రవరి	13,703.92

ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర పన్నులు, సుంకాల ద్వారా అంచనా వేసిన ఆదాయ లక్ష్యం..

ఫిబ్రవరి నాటికి వచ్చిన రాబడి (రూ.కోట్లలో)

పన్ను వివరాలు	లక్ష్యం	ఫిబ్రవరి నాటికి
వస్తు సేవల పన్ను	50,942.66	42,441.31
స్టాంపులు-రిజిస్ట్రేషన్లు	18,500	12,980.09
సేల్స్ ట్యాక్స్	39,500	27,467.35
స్టేట్ ఎక్సైజ్ సుంకాలు	19,884.9	18,927.79
కేంద్ర పన్నుల్లో వాటా	14,528.18	14,955.37
ఇతర పన్నులు, సుంకాలు	9,131.7	737

అప్పులు తీర్చలేక దంపతుల ఆత్మహత్య



భాగ్యలక్ష్మి, సెల్వరాజ్ (ఫైల్)

జనగామ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కొడుకు పెళ్లికి, వ్యాపారానికి తెచ్చిన అప్పులు తీర్చలేక జనగామ జిల్లాలో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. తమిళనాడుకు చెందిన రాజ్ సెల్వరాజ్, భాగ్యలక్ష్మి దంపతులు 30 ఏళ్ల కింద జనగామకు వచ్చి స్థిరపడ్డారు. ఇద్దరు కుమారులు, కూతురితో కలిసి పాపడాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడు పలనిస్వామి పెళ్లి చేశారు. పెళ్లికి చేసిన అప్పుతో పాటు వ్యాపారంలోనూ నష్టం వచ్చింది. దీంతో ఓ ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలో రూ.15 లక్షలు, ఇతరుల వద్ద రూ.30 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ఈ నేపథ్యంలో దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఎప్పటిలాగే గొడవ సాధారణమని భావించిన కుమారులు వారి వారి ఇళ్లకు వెళ్లారు. తర్వాత భార్యభర్తలు ఇద్దరూ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. ఇంట్లో మంటలు రావడం గమనించిన వాచ్‌మెన్... సెల్వరాజ్ కుమారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసే సరికి ఇద్దరూ పూర్తిగా కాలిపోయారు.

విద్యుత్ కోతలను నిరసిస్తూ సబ్‌స్టేషన్ ముట్టడి

- కామారెడ్డి జిల్లా కాచాపూర్‌లో రైతుల ఆందోళన

భిక్కనూరు, మార్చి 27: విద్యుత్ సరఫరా సక్రమంగాలేదని రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం కాచాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. వ్యవసాయానికి విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారంటూ కాచాపూర్ గ్రామ రైతులు ఉదయాన్నే సబ్‌స్టేషన్‌కు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గ్రామ సమీపంలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌కు విద్యుత్ సరఫరా అవుతున్న సమయంలో ఓవర్‌లోడై వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందన్నారు. చాలా రోజులుగా ఈ సమస్య ఉందని, ఎన్నిసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారంకావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉన్నందువల్ల సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని, లేకుంటే పంటలు ఎండిపోయే పరిస్థితి ఉంటుందని చెప్పారు.

సిరిసిల్లలో నేతన్నల భిక్షాటన

సిరిసిల్ల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): వస్త్ర పరిశ్రమలో సంక్షోభాన్ని నివారించాలని కోరుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పవర్‌లూం కార్మికులు బుధవారం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. రెండు నెలలుగా ప్రభుత్వం నుంచి వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు లేకపోవడం, ప్రైవేటు మార్కెట్ ఆర్డర్లు రాకపోవడం వంటి కారణాలతో సిరిసిల్లలో మరమగ్గాలు మూతపడ్డాయి. ఈ సందర్భంగా చేపట్టిన నిరసనలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడారు. వస్త్ర సంక్షోభంతో పనులు లేక నేత కార్మికులు తల్లడిల్లుతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోనే అత్యధిక మరమగ్గాలు ఉన్న సిరిసిల్లలో నేత కార్మికులు ఉపాధి కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.

సింగరేణిలో 6 నెలలపాటు సమ్మెలపై నిషేధం

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు ఆరునెలల పాటు సమ్మెలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ నిషేధం ఈ నెల 11 నుంచి ఆరునెలల పాటు అమల్లో ఉంటుంది. ఈ మేరకు తెలంగాణ ఎస్మా చట్టం కింద ఇంధన ముఖ్యకార్యదర్శి రిజ్వీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మన్‌సాన్‌పల్లి శివారులో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

పెళ్లి ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురి మృతి

- మరో 22 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- మరో ఘటనలో 16 మందికి గాయాలు

జోగిపేట/ములుగు, మార్చి 27: తెల్లవారితే పెళ్లి.. సంతోషంగా పెళ్లి కూమార్తెను తీసుకువచ్చేందుకు వరుడి తరపు బంధువులంతా కలిసి ట్రాక్టర్‌లో వెళ్తుండగా ప్రమాదవశాత్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడగా, మరో 22 మందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన సొంగ రాములుకు సంగారెడ్డి జిల్లా అందోలు పట్టణానికి చెందిన పూజారి యాదయ్య కుమార్తెతో గురువారం వివాహం జరగనుంది. పెళ్లి తంతులో భాగంగా పతానం కార్యక్రమం జరిపి వధువును తమ గ్రామానికి తీసుకెళ్లేందుకు వరుడి బంధువులు 29 మంది ట్రాక్టర్‌లో వధువు ఇంటికి బయలుదేరారు. ఈక్రమంలో.. అందోలు మండలం మన్‌సాన్‌పల్లి శివారులోని మూలమలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో బాచారం గ్రామానికి చెందిన జుట్టుగారి సంగమ్మ (45), రావగారి బూదెమ్మ(52), ఆగమ్మ (45) అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాలీలోని మిగతా 22 మందికి గాయాలవ్వగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిలో పలువురు చిన్నారులు కూడా ఉన్నారు. ప్రమాద సమాచారం అందగానే ఎస్సై అరుణ్‌గౌడ్ సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జోగిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా, ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి మరో ఘటనలో 16 మంది కూలీలు గాయపడ్డారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని బుట్టాయిగూడెం సమీపంలో మిర్చి తోటల్లో కాయలు ఏరడానికి అదే గ్రామానికి చెందిన 16 మంది కూలీలు ట్రాక్టర్‌పై వెళ్లారు. సాయంత్రం తిరిగొస్తుండగా ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తాపడింది. క్షతగాత్రులను ఏటూరునాగారం, వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రులకు తరలించారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

బీజాపూర్ జిల్లాలోని బాసగూడ అడవుల్లో ఘటన.. ఇద్దరు మహిళలు సహా ఆరుగురు మావోయిస్టుల మృతి

- మృతుల్లో డిప్యూటీ కమాండర్ నగేశ్, సోనీ దంపతులు
- ఘటనా స్థలంలో తుపాకులు, కిట్ బ్యాగులు స్వాధీనం
- ఆరుగురు మృతులపై కలిపి రూ.14 లక్షల రివార్డు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న పోలీసులు
- 30న బీజాపూర్ జిల్లా బంద్‌కు మావోయిస్టుల పిలుపు



పూనెం నగేశ్ కోవాసి గంగి పూనెం ఐతు



వెట్టి సోనీ వికాష్ మోకా

చర్ల, మార్చి 27: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడ అడవుల్లో బుధవారం ఉదయం మావోయిస్టులు, పోలీసులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో పీఎల్‌జీఏ బాసగూడ ఏరియా 10వ ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ పూనెం నగేశ్ సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో పూనెం నగేశ్ భార్య సోనీతోపాటు మరో మహిళా మావోయిస్టు ఉన్నారు. రెండు రోజుల క్రితం బీజాపూర్ జిల్లా బాసగూడ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను మావోయిస్టులు హత్య చేశారు. ఈ ఘటనకు పాల్పడ్డ మావోయిస్టుల కోసం బుధవారం ఉదయం బాసగూడ అడవుల్లో డీఆర్‌జీ 229, కోబ్రా 205, 210, సీఆర్‌పీఎఫ్ 168 బలగాలు గాలింపు ప్రారంభించాయి. ఈ క్రమంలో బలగాలు బాసగూడలోని దక్షిణ వైపు ఉన్న చీపురుభట్టి, తాలిపేరు నది పరిసర ప్రాంతాలకు చేరుకోగానే మావోయిస్టులు, పోలీసులకు మధ్య కాల్పులు జరిగాయి. సుమారు రెండు గంటలపాటు జరిగిన కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతులను పూనెం నగేశ్‌తోపాటు(రూ.5 లక్షల రివార్డు), పీఎల్‌జీఏ బాసగూడ ఏరియా 10వ ప్లాటూన్ సభ్యుడు పూనెం ఐతు (రెండు లక్షల రివార్డు), ప్లాటూన్ సభ్యురాలు, నగేశ్ భార్య వెట్టి సోనీ(రెండు లక్షల రివార్డు), యాక్షన్ టీం కమాండర్ వికాష్, జేగెరు కొండ ఏరియా కమిటీ సభ్యుడు కోవాసి గంగి, (ఐదు లక్షల రివార్డు), మిలీషియా సెక్షన్ కమాండర్ నుప్పో మోకాగా గుర్తించినట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజన్ తెలిపారు. వీరిలో పూనెం నగేశ్, కోవాసి గంగిపై రూ.5 లక్షల చొప్పున రివార్డు, పూనెం ఐతు, వెట్టి సోనీపై రూ.2 లక్షల చొప్పున.. ఆరుగురిపై కలిపి రూ.14 లక్షల రివార్డు ఉన్నట్లు పేర్కొన్నారు.

మృతుల సంఖ్య పెరిగే అవకాశం..

ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని పోలీసులు అంటున్నారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు సంబంధించిన మందుగుండు సామగ్రి, వాకీటాకీలు, రెండు టిఫిన్ బాంబులు, కార్డెక్స్ వైర్లు, యూనిఫాం, విప్లవ సాహిత్య పుస్తకాలు, జిలెటిన్ స్టిక్స్, తుపాకులు, కిట్‌బ్యాగులు, ఇతర వస్తువులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ జరిగిన తీరును పరిశీలిస్తే.. మావోయిస్టులే కవ్వింపు చర్యలకు పాల్పడి ఆ ఉచ్చులో వారే ఇరుక్కున్నారని కొందరు పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. పోలీసు బలగాలు అప్రమత్తంగా ఉండకపోయి ఉంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేదని చెబుతున్నారు. కాగా, వరుస ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీకి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ఏడాది పలు ఘటనల్లో ఇప్పటి వరకు 37 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. లోక్‌సభ ఎన్నికల వేళ గట్టి ఎదురుదెబ్బలు తగులుతుండగా.. ఈ నెల 30న బీజాపూర్ జిల్లా బంద్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీ పశ్చిమ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి మోహన్ పేరుతో మంగళవారం లేఖ విడుదలైంది. ఈ నేపథ్యంలో మావోయిస్టులు దాడులు చేస్తారని పోలీసులు అనుమానిస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా గాలింపు ముమ్మరం చేశారు. కాగా, బీజాపూర్ జిల్లా.. చర్ల మండలానికి అనుకుని ఉండడంతో మావోయిస్టుల బంద్ ప్రభావం ఇక్కడ కూడా ఉంటుందని ఇంటెలిజెన్స్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో చర్ల పోలీసులు అప్రమత్తమయ్యారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

- వాహనాలు పై నుంచి వెళ్లడంతో నుజ్జునుజ్జయిన మృతదేహం
- సూర్యాపేట జిల్లా కోదాడ జాతీయ రహదారిపై ఘటన



కోదాడ టౌన్, మార్చి 27: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ శివారులో జరిగింది. రాత్రి సమయంలో కావడంతో మృతదేహాన్ని గమనించకుండా వాహనాలు వెళ్లాయి. దీంతో మృతదేహం గుర్తించలేని విధంగా నుజ్జునుజ్జయింది. కోదాడ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం... కోదాడ పట్టణ శివారులో 65వ నెంబరు జాతీయ రహదారిపై ఎస్ఆర్ఎం పాఠశాల సమీపంలో అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఓ వ్యక్తిని ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అర్ధరాత్రి కావడంతో మృతదేహాన్ని గుర్తించకుండా వాహనాలు పై నుంచి వెళ్లడంతో ముద్దలా మారింది. కాలు, కొద్ది భాగం అరచేయి మాత్రమే కనిపిస్తున్నాయి. మిగిలిన భాగాలన్నీ నుజ్జునుజ్జయ్యాయి. మృతదేహాన్ని బుధవారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మార్చురీలో భద్రపర్చారు. మృతదేహంపై నిక్కర్ ఉందని, చొక్కా ఆనవాలు కనిపించలేదని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధం ఆగాలి!

గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ మొదలైన ఐదున్నర నెలలకు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి అక్కడ తక్షణకాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ తొలిసారిగా తీర్మానాన్ని ఆమోదించింది. భద్రతామండలిలో ప్రతీ తీర్మానాన్ని వీటో చేస్తూ ఇజ్రాయెల్‌ను రక్షించుకొస్తున్న అమెరికా మొన్న సోమవారం ఈ తీర్మానం సందర్భంగా ఓటింగ్‌కు దూరమై దానిని నెగ్గనిచ్చింది. రమ్‌జాన్ మాసాన్ని పురస్కరించుకొని తక్షణమే కాల్పులను విరమించాలని, తన వద్ద ఉన్న బందీలను హమాస్ విడిచిపెట్టాలని, ఒక దీర్ఘకాలిక, సుస్థిర కాల్పులవిరమణకు వీలుకల్పించే వాతావరణం ఏర్పడాలని ఈ తీర్మానం కోరింది. అల్జీరియా నేతృత్వంలో స్విట్జర్లాండ్ వంటి కొన్ని దేశాల సమష్టికృషితో రూపొందిన ఈ తీర్మానానికి అమెరికా అడ్డుతగలకపోవడం ఒక విశేషమైతే, బ్రిటన్ సైతం ఈ మారు భిన్నంగా వ్యవహరించి, తీర్మానానికి అనుకూలంగా ఓటువేయడం మరో వింత.

ముప్పైరెండువేలమంది మరణించి, డెబ్బయ్‌ఐదువేలకుపైగా గాయపడి, గాజా పూర్తిగా నేలమట్టమై, 90శాతం ప్రజలు వలసపోయిన తరువాత, పవిత్రమాసంలోనైనా కాల్పులు కాస్తంత ఆపండంటూ ఈ తీర్మానం ముందుకు వచ్చింది. అడ్డుపడకుండా దానిని నెగ్గనిచ్చినందుకు అమెరికా మీద ఇజ్రాయెల్‌కు ఎంతో కోపం వచ్చింది. సీనియర్ మంత్రులతో కూడిన బృందంతో అమెరికా వెడదామకున్న నెతన్యాహూ ఇందుకు నిరసనగా తన పర్యటన రద్దుచేసుకున్నారు. ఈ తీర్మానానికి నాలుగురోజుల ముందు అమెరికా స్వయంగా కాల్పుల విరమణను ప్రతిపాదిస్తూ భద్రతామండలిలో ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే, అందులో అమెరికా వాడిన భాష ప్రపంచాన్ని తప్పుదోవపట్టించేట్టుగా ఉందంటూ రష్యా, చైనాలు దానిని వీటో చేశాయి. గాజాయుద్ధం విషయంలో అమెరికా ఆత్మరక్షణలో పడిందని ఈ పరిణామాలు తెలియచెబుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం, గాజా తరహాలోనే మరో భయానకమైన ఊచకోతకు ఇజ్రాయెల్ సిద్ధపడుతూండటం. దాదాపు 15లక్షలమంది పాలస్తీనియన్లు కొంతలోకొంత సురక్షితంగా ఉంటున్న రఫా పట్టణంలోకి ఇజ్రాయెల్ సైన్యం చొరబడబోతున్నట్టు నెతన్యాహూ సహా ఆయన మంత్రులంతా ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. గాజా యుద్ధం లక్ష్యం నెరవేరాలంటే తీవ్రవాదుల ఏరివేత కార్యక్రమం పరిపూర్ణంగా జరగాలని, రఫా నగరాన్ని జల్లెడపట్టినప్పుడు మాత్రమే ఆ ప్రక్షాళన పూర్తవుతుందని ఇజ్రాయెల్ నాయకులు వాదన. ఇందుకు ప్రతిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రఫాలో కాలూనితే అమెరికా సాయం ఆగిపోతుందన్న తరహాలో హెచ్చరికలు చేయడమూ చూశాం. కానీ, ఆ హెచ్చరికలనూ, సలహాలనూ బేఖాతరుచేస్తూ నెతన్యాహూ తాను అనుకున్నది చేసుకుపోతున్నారు. అనతికాలంలోనే రఫా నేలమట్టం కాబోతున్నదని అక్కడ సాగుతున్న వైమానికదాడులు స్పష్టంచేస్తున్నాయి. సైన్యం ప్రత్యక్షంగా నగరంలోకి అడుగుపెడితే ఆ విధ్వంసం ఇక ఊహకు కూడా అందనంతగా ఉంటుంది. రఫా నగరాన్ని దురాక్రమించుకొనే ఆలోచనలో బెంజమీన్ ఉన్నారని అందరికీ తెలుసు.

ఈ నేపథ్యంలోనే, భద్రతామండలిలో తక్షణ కాల్పుల విరమణ తీర్మానాన్ని నెగ్గనిచ్చి, నెతన్యాహూ భవిష్యత్తు చర్యలతో తనకు ఏ సంబంధం లేదని అమెరికా ప్రపంచాన్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టుంది. తాను ఎంతగా ప్రయత్నిస్తున్నా నెతన్యాహూ ఆగడం లేదని చెప్పుకోవడం అమెరికా ఉద్దేశం కావచ్చు. భద్రతామండలి ఈ తీర్మానాన్ని ఆమోదించిన ఇరవైనాలుగు గంటల్లోనే అమెరికా, ఇజ్రాయెల్ రక్షణమంత్రులు భేటీ అయి, రఫాలో ఇజ్రాయెల్ ఎంత జాగ్రత్తగా అడుగులువేయాలో, తీవ్రవాదులను మాత్రమే చంపుతూ, సామాన్యులమీద ఈగవాలనీయకుండా ఎలా వ్యవహరించాలో చర్చించారట. ప్రజల ప్రాణాలు, మానవతాసాయం అంటూ అమెరికా రక్షణమంత్రి ఎన్ని కబుర్లు చెప్పినప్పటికీ, హమాస్ ఉగ్రవాదుల అంతమే తమపంతమనీ, అందుకు ఎంతదూరమైనా వెడతామంటూ ఇజ్రాయెల్ రక్షణమంత్రి చేసిన వ్యాఖ్యలు పరిస్థితిలో ఏ మార్పూ రాలేదనడానికి నిదర్శనం. రఫాలో ఇజ్రాయెల్ చొరబాటును ఆపే ఉద్దేశం అమెరికాకు ఎంత మాత్రం లేదు. రేపు అది ఆ పట్టణాన్ని భస్మీపటలం చేస్తున్నా, ప్రజలను ఊచకోత కోస్తున్నా అమెరికా హితవులు చెబుతూంటుంది, ఆగ్రహాలు ప్రకటిస్తుంది తప్ప దానిని నిలువరించదు. గాజా దృశ్యాలను ప్రపంచమంతా చూస్తోంది, యుద్ధాన్ని ముగించాలి అని ట్రంప్ కూడా ఓ పక్కన సణుగుతూ ఉంటారు. ఇజ్రాయెల్‌కు తమ పాలకులు హద్దూపద్దూలేని సాయం అందిస్తూండటం మీద అధికశాతం అమెరికన్లు గుర్రుగా ఉన్నారని కూడా సర్వేలు చెబుతున్నాయి. అమెరికాకు చిత్తశుద్ధి గనుక ఉంటే, భద్రతామండలి తీర్మానాన్ని ఆచరణలోకి తెచ్చేవిధంగా ఇజ్రాయెల్‌మీద ఒత్తిడి తేవాలి.

వాక్ స్వాతంత్ర్యంపై పెరుగుతున్న అసహనం



ఇటీవలి కాలంలో పెరుగుతున్న మతపరమైన అసహన సంస్కృతికి అనుగుణంగా ఒక ప్రణాళిక ప్రకారం రూపొందించబడిన కొన్ని మతోన్మాద శక్తులు సోషల్ మీడియానీ, ఇతర సాధనాలనూ దుర్వినియోగం చేస్తూ, స్త్రీల పట్ల అశ్లీలమైన, అసభ్యకరమైన భాషను వాడుతూ ప్రగతిశీల మహిళా మేధావులను, రచయిత్రులను, జర్నలిస్టులను, ఏక్టివిస్టులను, కళాకారులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో నీచమైన దాడులు చేస్తున్నాయి. వీరు వినియోగించే పద్ధతులు, వాడే భాష వీరి నేపథ్యాన్నీ, మేధాస్థాయినీ, నేర ప్రవృత్తినీ వెల్లడిస్తున్నాయి. తమ ఆలోచనలతో ఏకీభవించకుండా, భిన్నమైన ఆలోచనలు కలిగినవారి నోళ్లు మూయించే అనాగరిక, అమానుష చర్యలకు పాల్పడుతున్నారు. సహజంగానే ఈ రకమైన దాడి ప్రధానంగా స్త్రీల మీదనే ఎక్కువగా జరుగుతున్నది. స్త్రీలు దేశంలో ఏర్పడుతున్న మత, రాజకీయ పరిణామాల గురించి ఆలోచించడం, తమ భావాలను వ్యక్తపరచడం ఈ అప్రజాస్వామిక, సంప్రదాయ వాద సమర్థక మూకలకు నచ్చదు. స్త్రీలు తమ ఇష్టాలకు అనుగుణంగా కట్టు, బొట్టు, వేష, భాష ధారణలు చేసినప్పుడల్లా ఈ అరాచకులు రంగంలోకి దిగి వ్యక్తిగతంగా కాల్ చేసి, తలుచుకుంటే వారి ఇళ్లపై దాడులు చేయగలమని, ప్రాణ హాని తలపెట్టగలమని బెదిరింపులకు పూనుకుంటున్నారు. ఈ అప్రజాస్వామిక, ప్రజావ్యతిరేక ధోరణులను మేము నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) ఈ దేశ పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యాన్ని ఇచ్చింది. ఫలానా విధంగా అభిప్రాయాలు వ్యక్త పరచకూడదని, ఫలానా విధంగానే బతకాలని శాసించడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ప్రాథమిక హక్కుని ప్రభుత్వంతో బాటు ఎవరూ హరించ డానికి వీలులేదు. ఈ విధంగా బెదిరింపులకు, దాడులకు పాల్పడే శక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వర్గాలను, పోలీసు వ్యవస్థను కోరుతున్నాం.

ప్రజాస్వామిక సంస్థలు, వేదికలు: ప్రొ.జి. లక్ష్మణ్ (పౌరహక్కుల సంఘం, తెలంగాణ); ఎస్. జీవన్ కుమార్ (మానవ హక్కుల వేదిక, తెలం గాణ, ఆంధ్ర రాష్ట్రాలు); అరసవిల్లి కృష్ణ, రివేరా (విరసం); శ్రీదేవి(చైతన్య మహిళా సంఘం); విజయ భండారు (హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరమ్); పసునూరి రవీందర్ (సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరమ్); కె. శ్రీనివాసాచారి (హైదరాబాద్ హ్యూమనిస్ట్ మీట్); రేణుకా అయోల, తూముచర్ల రాజారాం (సంతకం సాహిత్య వేదిక); ఐకా బాలాజీ (మంచి సినిమా గ్రూపు); బి. గిరిజ (వాయిస్ ఫర్ జెండర్ జస్టిస్); కొండవీటి సత్యవతి (భూమిక); అమరేంద్ర దాసరి (సాహితీవేదిక, డిల్లీ); డా. భైరి నరేష్ (మూఢనమ్మకాల నిర్మూలన సంఘం); మహిళా మరియు ట్రాన్స్ జండర్ సంస్థల ఐక్య కార్యాచరణ వేదిక; ఖలీదా పర్వీన్, ఉష (సన్నిహిత); వి. సంధ్య (POW); సజయ, సుమిత్ర (అంకురం); వంగపల్లి పద్మ (వాయిస్ ఆఫ్ ద పీపుల్); కన్నెగంటి రవి (రైతు స్వరాజ్యవేదిక); గీతాంజలి (వెన్నెల సాహిత్య సామాజిక అధ్యయన వేదిక).

కవులు, రచయితలు, కార్యకర్తలు, విలేకరులు, న్యాయవాద నిపుణులు: అఫ్సర్, నారాయణ స్వామి, డా. సి. మృణాళిని, గోగు శ్యామల, విమల, ప్రసాదమూర్తి, అరణ్యకృష్ణ, వెంకటకృష్ణ, దొంతం చరణ్, నరేష్ సూఫీ, అరుణాంక్ లత, ఓల్గా, అక్కినేని కుటుంబరావు, పి. సత్యవతి, కొండేపూడి నిర్మల, ప్రతిమ, ఉదయమిత్ర, ఎ.కె. ప్రభాకర్, నల్లూరి రుక్మిణి, తేళ్ళ అరుణ, అపర్ణ తోట, శివలక్ష్మి, లక్ష్మీ సుహాసిని, కత్తి పద్మ, సీతా కంబంపాటి, శాంతి ప్రబోధ, అమరవాది నీరజ, గుత్తా జ్యోత్స్న, చల్లా సరోజినీ దేవి, బెల్లపు అనురాధ, చలం జీ.ఎస్, దుర్గా డింగరి, ఘంటసాల నిర్మల, పైడిమర్రి గిరిజ, జయలక్ష్మి, సమ్మెట ఉమాదేవి, మంజుల, రోహిణి వంజారి, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, నాంపల్లి సుజాత, మెర్సీ మార్గరెట్, కాత్యాయిని కె, సంధ్య కె, వివి జ్యోతి, గోపరాజు సుధ, రూపా రుక్మిణి, సురేఖ, శీలా సుభద్రా దేవి, శిలాలోలిత, ఆశాలత, అంబిక, రత్నా సుమతి, రుక్మిణీ రావు, మీరా సంఘమిత్ర, రచన, వైజయంతి, ఇందిర, జహాఆరా, కల్పనా కన్నాబిరన్, హేమలలిత, సావిత్రి కోల, కన్నెగంటి అనసూయ, కృష్ణ కుమారి, ఝాన్సీ, అనసూయ, సుజాత, సరోజినీదేవి, శాంతిశ్రీ బెనర్జీ, రోహిణి, డా. కె.బి సంధ్యా విప్లవ్, వాసరచెట్ల జయంతి, జ్వలిత, డా.నళిని, అరుణ, డి. భారతి, కె. ప్రవీణ్, వైష్ణవిశ్రీ, సుభాషిణి తోట, సి.హెచ్. ఉషారాణి, శోభాభట్, రోజారాణి దాసరి తదితరులు.

అవినీతి పురాణం, గురివింద కచేరీ!

కుమార్తె కవిత అరెస్టయినప్పుడు, కేసీఆర్ ఎందుకు వెంటనే స్పందించలేకపోయారు? కేజ్రీవాల్ అరెస్టును ఖండించినప్పుడు మాత్రమే కవిత పేరు కూడా చేర్చి ఎందుకు మాట్లాడారు? ఆమె అరెస్టయినప్పుడు, కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు ఈడీ అధికారులతో వాదనలు చేశారు తప్ప, అదంతా అన్యాయమని గట్టిగా జనం ముందు ఎందుకు అనలేకపోయారు? మద్యం కుంభకోణంలో కల్వకుంట్ల కవిత ప్రమేయం, ఏమంత గర్వకారణమైన అంశం కాదన్న సంకోచం ఏదైనా కేసీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల మనసులను ఆవరించిందా? ఒక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే వేలకొలది కేజ్రీవాల్‌లు పుట్టుకువస్తారని, అరవింద్ ఒక మనిషి కాదు, ఒక భావన అని ఆమ్ ఆద్మీపార్టీ ఎట్లా గట్టిగా అనగలుగుతోంది? దేశంకోసమే నా జీవితం అంటూ కేజ్రీవాల్ జైలు నుంచి పంపిన సందేశాన్ని ఆయన భార్య ఎట్లా సగర్వంగా దేశం ముందు చదవగలిగింది?

పై ప్రశ్నలు, ఒకే కేసులో అరెస్టయిన ఇద్దరిలో ఒకరు నైతికంగా ఎక్కువ, మరొకరు తక్కువ అని చెప్పడం కోసం కాదు. రెండు రాజకీయ సంస్థల ప్రతిస్పందనల్లో ఉన్న తేడాలను చెప్పడానికి కూడా కాదు. ఎన్నికల సందర్భంగా ఆవిష్కృతమయిన రాజకీయవాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఆ ప్రశ్నలు పనికిరావచ్చు. పెరిగిపోతున్న కర్కశతకు, నిర్దాక్షిణ్యతకు సమాధానంగా రూపుదిద్దుకోగలిగే ప్రతికథనాలను గుర్తించడానికి కూడా సహాయపడవచ్చు.

కేసీఆర్ కనుక, మొన్నటి ఎన్నికల్లో అధికారం పోగొట్టుకోకపోయి ఉంటే, ఓడిపోయినాక మరీ ప్రస్తుత దయనీయ స్థితికి ఆయన పార్టీ చేరుకోకపోయి ఉంటే, బహుశా కవిత అరెస్టు జరిగేది కాదేమో? రేపటి కేంద్రప్రభుత్వానికి ఏ విధంగానూ ఆయన ఉపయోగపడగలిగే పరిస్థితి లేదు. ఆ నిరుపయోగత్వం నుంచే కవిత అరెస్టు సులువుగా జరిగిపోయింది. మద్యం కేసులో ఆమె కథానాయిక కాదు. సంధానకర్త వంటి పాత్రలో మాత్రమే ఆమె ఉన్నారట. కేసుకు ఆ పాత్రే కీలకం మరి. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి పూర్వరంగంగా ఆమె అరెస్టు జరిగింది. ఆమెను ప్రధానముద్దాయిల్లో చేర్చి కూడా, అరెస్టు చేయకుండా ఉండే సామర్థ్యం, చాతుర్యం దర్యాప్తు సంస్థలకు ఉన్నాయి కానీ, అంతటి ఔదార్యం ప్రకటించవలసిన అవసరం ఇప్పుడులేదు. కవిత మీద కానీ, బీఆర్ఎస్ మీద కానీ కేంద్రప్రభుత్వం, బీజేపీ, మోదీషా కత్తిగట్టారనుకోవడానికి తగిన రాజకీయ వాదన చెలామణిలో లేదు. తెలంగాణ అధికార కుటుంబ సభ్యురాలై ఉండి కూడా, రాష్ట్ర రాజకీయాలలో అప్రధానమైనపాత్రలోనే మిగిలిపోయిన వ్యక్తి, ఇట్లా రాష్ట్రం దాటి దేశరాజధానిలో ఏదో ధనార్జన మార్గంలో, అది కూడా ఏమంత గౌరవప్రదం కాని మద్యం వ్యాపారంలో, ప్రమేయం పెట్టుకోవడం ప్రజలు హర్షించలేదు. కుంగి కునారిల్లినదశలో, బీఆర్ఎస్‌కు మోదీ మీద కత్తులు నూరగలిగే విలాసత్వమూ లేదు.

కేజ్రీవాల్ విషయం అట్లా కాదు. దేశమంతా గెలిచినా ఢిల్లీలో తాము గెలవలేకపోతున్నామని, ఉన్నచోట ఉండకుండా అతను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్నాడని, అన్నిటికంటె మించి, 'ఇండియా కూటమి'లో భాగమయ్యాడని బీజేపీకి ఆయనంటే కోపం ఉంది. కేజ్రీవాల్ అరెస్టులో నైతిక నిష్ఠ కంటె, పగాప్రతీకారాలూ ఎక్కువని అంటే, బీజేపీ వీరాభిమానులు కూడా పెద్దగా ఖండించబోరు. 370, 400 స్థానాల లక్ష్యాలను అందుకోవడానికి కేజ్రీవాల్ ఒక అవరోధం కూడా కావచ్చు. ఇన్ని రాజకీయ కారణాలున్నంత మాత్రాన, కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో లేరని కాదు. కాకపోతే, తన మీద అభియోగం తప్పని, ఇదంతా కక్షసాధింపు అని ఆయన చెప్పుకుంటే జనం వింటారు, హేళన చేయరు. అరవింద్ కేజ్రీవాల్ అవినీతి సొమ్ము తీసుకుని, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టారని ఈడీయే చెబుతోంది, కవిత విషయంలో ఆ రాజకీయ



ఇప్పుడు, నైతికమయిన బెంచ్ మార్క్ లేవీ సమాజంలో లేవని, అక్కరలేదని కూడా బీజేపీ భావిస్తున్నది. నీతికబుర్లు చెప్పేవారందరూ అవినీతిపరులని నిరూపణ అయిందని, బలంగా ఉండి, దేశాన్ని దృఢత్వం వైపు తీసుకువెళ్లగలిగే తన వంటి రాజకీయ శక్తి ఉనికిలో ఉండగా మరొక ఎంపిక అవసరమే లేదని ప్రజలకు చెబుతోంది. ప్రాంతీయపార్టీలు, చిన్నపార్టీలు అన్నీ–అయితే కుటుంబ పార్టీలో లేదా అవినీతి పార్టీలో–అయి ఉంటాయని ప్రధాని తన సభల్లో పదే పదే చెబుతూ వస్తున్నారు. తను మాత్రమే ప్రజలే కుటుంబంగా జీవిస్తున్నానని చెప్పుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఈ నాయకులను పలచన చేసినంత మాత్రాన సరిపోదు కాబట్టి, ఆ పార్టీల బలాన్ని, బలగాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఒకవైపు దర్యాప్తు యంత్రాంగాలను, మరొకవైపు రాజకీయచాణక్యాన్ని ప్రయోగిస్తున్నారు.

కారణం కూడా లేదు!

సమాజంలోని అన్ని రంగాలకు, ఏదో ఒక నైతికమయిన చెలియలికట్ట ఉంటుంది. కొందరు వ్యక్తుల్లో, కొన్నిచోట్లలో ఆ హద్దులకు ప్రమాణంగా ఉంటారు. రాజకీయరంగంలో ఒకప్పుడు జయప్రకాశ్ నారాయణ్, తరువాత విపి సింగ్, కొందరికి వాజపేయి, అబ్దుల్ కలాం, అట్లాగే, అన్నా హజారే.. ఆయా కాలాల్లో కొంత నైతిక ప్రభ వెలిగించారు. కారుచీకటి అనుకున్న కాలంలో కూడా జనం ఏదో ఒక ఔన్నత్యాన్ని గుర్తించి లేదా భావించి, దాన్ని ఆశగా నిలుపుకుంటారు. అన్నాహజారే పదిపన్నెండేళ్ల కిందట, ఈ కేజ్రీవాల్ తో కలిసి ఢిల్లీలో చేసిన హడావుడి, రెండో యూపిఏ ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసింది. భ్రష్టుపట్టిపోవడానికి తగినంత అవినీతి, దుష్పరిపాలన ఆ ప్రభుత్వం చేయలేదని కాదు. నరేంద్రమోదీ వెలిగిపోవడానికి ముందు, యుపిఎ ప్రభుత్వం కేవలం చీకటియుగం మాత్రమేనని నమ్మకంగా చెప్పి, జనాల మనస్సులను సిద్ధం చేసిన కూటమి ఆ నీతిపరులదే! తాము చేసిన అవినీతి వ్యతిరేక ఆందోళన ఇంతటి నిరంకుశ పాలనను తీసుకువస్తుందని ఊహించలేదని ఒక్క యోగేంద్ర యాదవ్ మాత్రమే పశ్చాత్తాపపడ్డట్టున్నారు! తాము ఎటువంటి పర్యవసానాలకు కారణమయ్యారో, సిసోడియా, కేజ్రీవాల్ అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు!

ఇప్పుడు, నైతికమయిన బెంచ్ మార్క్ లేవీ సమాజంలో లేవని, అక్కరలేదని కూడా బీజేపీ భావిస్తున్నది. నీతికబుర్లు చెప్పేవారందరూ అవినీతిపరులని నిరూపణ అయిందని, బలంగా ఉండి, దేశాన్ని దృఢత్వం వైపు తీసుకువెళ్లగలిగే తన వంటి రాజకీయ శక్తి ఉనికిలో ఉండగా మరొక ఎంపిక అవసరమే లేదని ప్రజలకు చెబుతోంది. ప్రాంతీయపార్టీలు, చిన్నపార్టీలు అన్నీ–అయితే కుటుంబ పార్టీలో లేదా అవినీతి పార్టీలో–అయి ఉంటాయని ప్రధాని తన సభల్లో పదే పదే చెబుతూ వస్తున్నారు. తను మాత్రమే ప్రజలే కుటుంబంగా జీవిస్తున్నానని చెప్పుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఈ నాయకులను పలచన చేసినంత మాత్రాన సరిపోదు కాబట్టి, ఆ పార్టీల బలాన్ని, బలగాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఒకవైపు దర్యాప్తు యంత్రాంగాలను, మరొకవైపు రాజకీయచాణక్యాన్ని ప్రయోగిస్తున్నారు.

బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కూడా కేసుల పద్మవ్యూహంలో చిక్కుకోవడం వల్ల మాత్రమే తన పార్టీని నిష్క్రియాత్మకం చేసుకోవలసివచ్చిందని చెబుతారు. అఖిలేశ్ యాదవ్ తల మీద కూడా అనేక కత్తులు వేలాడుతున్నాయి. మమతా బెనర్జీ 'ఇండియా కూటమి'కి ఎడంగా మెలగడానికి తగిన కేంద్ర కారణమే ఉన్నదని ఊహిస్తున్నారు. నాడు కేసీఆర్ కూడా మాటల్లో మంటలు కురిపించినా, లోలోపల భయభక్తులతో ఉండడానికి కారణాలున్నాయంటారు. జగన్ సంగతి తెలిసిందే. అట్లాగని, ఈ దండోపాయానికి అందరూ, అన్ని వేళలా లొంగిపోతారని అనడానికి లేదు. కొందరు నిలబడతారు, మరికొందరు ఓపిక నశించాక తిరగబడతారు. జైలులో సుదీర్ఘకాలం గడిపినా, ఇంకా కేసులు ముగియకపోయినా, లాలూ ప్రసాద్ బేలగా మారలేదు, జనాకర్షణా కోల్పోలేదు. ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా తన మీద జరుగుతున్న రాజకీయదాడికి కుంగిపోయేటట్టు కనిపించడం లేదు. అవినీతి వ్యతిరేక ఉద్యమం చేసి తమ ఓటమికి కారణమయిన కేజ్రీవాల్‌తో కాంగ్రెస్ తన సంబంధాలు మెరుగుపరుచుకోవడం విశేషం. 'ఆప్' విస్తరణ ప్రయత్నాలమీద బీజేపీతో సమానంగా కాంగ్రెస్



▪ కె. శ్రీనివాస్

సందర్భం

కూడా ఒకప్పుడు అసహనం చూపింది. కొంతకాలం కిందట రెండుపార్టీల మధ్య పొత్తు అసాధ్యమనిపించింది. కానీ, సర్దుబాటు చేసుకోవడంతో పాటు, ఆశ్చర్యకరంగా ఇప్పుడు ఒకరికొకరు నిలబడుతున్నారు కూడా.

ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి గట్టి రాజకీయ నినాదం లేదని అంతా అంటున్నారు కానీ, భారతీయ జనతా పార్టీకి కూడా ఈ సారి నినాదాల కొరత ఉన్నది. పరివార్ వాద్, భ్రష్టాచార్ అన్నీ అయిపోయాయి. అబ్ కీ బార్ మోదీసర్కార్, ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ పోయినసారే అయిపోయాయి. చార్ సౌ కే పార్ అన్నది పర్వాలేదు కానీ, అది ప్రధాన నినాదం కాలేదు. నినాదమే కాదు, రాజ

కార్పొరేట్లతో తన ధనానుబంధం ఎంతటిదో తెలిసిపోయినా, పార్టీలో చేరే పేరుమోసిన అవినీతిపరులకు అభయమిస్తున్నట్టు అందరూ గుర్తించినా, బీజేపీకి ఎందుకు పరువు భయం కలగడం లేదు? అన్ని నీతులను రద్దు చేసిన చోట, బలమే నీతి, ధనమే రీతి కాబట్టి, ఉద్వేగాలు వెదజల్లి మనసులను కట్టివేసిన తరువాత, ఇంద్రజాలికులదే సర్వాధికారం కాబట్టి.

కీయ వాదనే లేదు. రామాలయ ప్రతిష్ఠ ఒక్కటే ఆధారపడదగ్గ ఘనతగా కనిపిస్తున్నది. సాధ్యమైనంత అధిక విజయాలను పోయినసారే సాధించినందున, ఈసారి తరుగే తప్ప పెరుగుదల ఉండదన్నది సాధారణాభిప్రాయం. అయినాసరే, సకల శక్తులను మోహరించి అధికస్య అధికం సాధించాలని ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే, ప్రతిపక్షం అనైతికీకరణ, నిరాయుధీకరణ. ఈ వ్యూహాన్ని గుర్తించి, అవినీతి ముద్రలను ఖాతరు చేయక, రాజకీయ దురుద్దేశ్యాలను ఎలుగెత్తి చాటడమే బాధిత పక్షాలు కనీసంగా చేయవలసింది.

ఎన్నికల బాండ్లలో దాగిన రహస్యాలు తెలుస్తున్నప్పుడు, తన నీతి గురించి, ఇతరుల అవినీతి గురించి కేంద్రప్రభుత్వ నాయకులు ఎట్లామాట్లాడగలుగుతారని ఆశ్చర్యం వేస్తుంది. కేంద్ర అధికారపార్టీకి అందిన అనామకపు సొమ్ముతో పోలిస్తే, ఆప్ కు అందిన వందకోట్లు ఎంత? రాజకీయపార్టీలన్నీ అంతో ఇంతో బాండ్ల వీరులే కాబట్టి, పెద్ద కలకలం రాలేదు కానీ, బీజేపీ రాజకీయ సొమ్ము ఏమంత స్వచ్ఛమైనది కాదని, అది దాన దండోపాయాలతో సమకూర్చుకున్నదని బాండ్ల విశ్లేషణలు చెబుతున్నాయి. అధికారపార్టీ వేల కోట్ల అవినీతి విరాళాల మీద జాతీయమీడియా మౌనం పాటిస్తుంది. కేజ్రీవాల్ అరెస్టు కు మాత్రం ప్రైమ్ టైమ్ లన్నీ అంకితం చేస్తుంది.

కార్పొరేట్లతో తన ధనానుబంధం ఎంతటిదో తెలిసిపోయినా, పార్టీలో చేరే పేరుమోసిన అవినీతిపరులకు అభయమిస్తున్నట్టు అందరూ గుర్తించినా, బీజేపీకి ఎందుకు పరువు భయం కలగడం లేదు? అన్ని నీతులను రద్దు చేసిన చోట, బలమే నీతి, ధనమే రీతి కాబట్టి, ఉద్వేగాలు వెదజల్లి మనసులను కట్టివేసిన తరువాత, ఇంద్రజాలికులదే సర్వాధికారం కాబట్టి.

ప్రతిపక్ష నేతల నేరం అవినీతిపరులు కావడం కాదు, బలహీనులు కావడమే వారి అసలు పాపం!

సామ్యవాది, సాహిత్యాభిలాషి

ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక కార్యకర్త, కళాపోషకుడు, సాహితీ పోషకుడు, ప్రజా ప్రతినిధి, దాత, మార్వాడీ కుటుంబానికి చెందిన బద్రీ విశాల్ పిత్తి పూర్వీకులు రెండు వందల ఏళ్ల క్రితం హైదరబాద్‌కు చేరుకుని స్థిరపడ్డారు. తండ్రి పన్నాలాల్ పిత్తి నిజాం గౌరవ ఆర్థిక సలహాదారుగా వ్యవహరించారు. బద్రీ విశాల్ కలకత్తాలో 1928 మార్చ్ 28న పన్‌బాయి – పన్నాలాల్ పిత్తి దంపతులకు జన్మించారు. విద్యాభ్యాసం అలహాబాదులో సాగింది.

బద్రి విశాల్ ఇరవయ్యొక్క ఏళ్ళ వయసులోనే హైదరాబాదులో 1949 ఆగస్టులో ప్రముఖ హిందీ సాహిత్య పత్రిక 'కల్పన' ప్రారంభించారు. అది స్వల్పకాలంలో హిందీ సాహిత్యంలో ఉన్నతమైన పత్రికగా పేరు తెచ్చుకుని 1978 వరకు నిరంతరాయంగా వెలువడింది. ఎం.ఎఫ్. హుస్సేన్ చిత్రాలు తరచూ 'కల్పన' పత్రిక ముఖచిత్రంగా కనిపించేవి. ఆనాటి హిందీ రచయితలు కల్పన పత్రికలో రచనలను ప్రచురితం కావడం గొప్ప విషయంగా భావించేవారు.



సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియాతో పరిచయం ఏర్పడిన తర్వాత బద్రీ విశాల్ ఆయన భావాలకు ప్రభావితుడై జీవితాంతం సోషలిష్టుగా ఉండిపోయారు. 1955లో సోషలిష్టు పార్టీ స్థాపనలో కీలకపాత్ర పోషించారు. 1960లో లోహియా పిలుపునిచ్చిన పౌర నిరాకరణోద్యమంలో పాల్గొని జైలుకి వెళ్ళారు. బద్రీ విశాల్ 1969లో ప్రారంభమైన ఉద్యమంలో ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌కు గట్టి మద్దతు ప్రకటించారు. నిజాంతో తన కుటుంబానికున్న సాన్నిహిత్యాన్ని కూడా లెక్క చేయకుండా హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ తొలి సమావేశంలో పాల్గొని ప్రజాస్వామ్యం కోసం పిలుపునిచ్చారు. అప్పుడు కొత్తగా ఏర్పడిన మహారాజ్ గంజ్ శాసనసభ నియోజకవర్గం నుంచి బద్రీ విశాల్ 1967లో సంయుక్త సోషలిష్టు పార్టీ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1972లో సంపూర్ణ తెలంగాణ ప్రజాసమితి అభ్యర్థిగా, 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా ఇదే నియోజకవర్గం నుండి రెండు సార్లు పోటీచేసి పరాజితుడయ్యారు. బద్రీ విశాల్ సోషలిష్ట్ అయినా తన రాజకీయాలకు అతీతంగా కళలను, కళాకారులను పోషించారు. ఎం.ఎఫ్.హుస్సేన్ తన ప్రసిద్ధ రామాయణం, మహాభారతం చిత్రాలను సోమాజీగూడలోని బద్రీ విశాల్ ఇంట్లో ఉంటూనే చిత్రీకరించారు. ఎం.ఎఫ్.హుస్సేన్ 1940దశకం చివరి నుండి 1970వ దశకం చివరి వరకు చిత్రించిన నాలుగు వందలకు పైగా చిత్రాలను బద్రి విశాల్ సేకరించారు. 2003 డిసెంబర్ 6న బద్రీ విశాల్ మరణానంతరం ఆయన సేకరణలో ఉన్న ఎం.ఎఫ్. హుస్సేన్ చిత్రాలు, 2013లో వేలంలో దాదాపు రూ.18కోట్లకు అమ్ముడు పోయాయి.

బద్రి విశాల్ పిత్తి జయంతి సందర్భంగా ఈ మార్చ్ 28 గురువారం 'బద్రి విశాల్ పన్నాలాల్ పిత్తి' ట్రస్ట్ నిర్వహణలో 18వ స్మారకోపన్యాసం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని కోహినూర్ హాలులో నిర్వహిస్తున్నారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఈ సభలో సుప్రీం కోర్ట్ మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ప్రధాన వక్తగా పాల్గొంటున్నారు.

• నందిరాజు రాధాకృష్ణ

రైతులపై బీఆర్ఎస్ మొసలి కన్నీరు!

అధికారం పోతేగాని కేసీఆర్ కు రైతులు గుర్తుకు రాలేదు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని కేసీఆర్ ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం కొత్త డ్రామా మొదలు పెట్టిండు. పదేళ్ల కేసీఆర్ నియంతృత్వ, దోపిడీ పాలన నుంచి తెలంగాణను విముక్తి చేసి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కుదురుకునే సమయం ఇవ్వకుండా, అధికారం కోల్పోయిన మరుసటి రోజు నుంచే విమర్శలు చేయడం కేసీఆర్ అధికార దాహానికి నిదర్శనం.

పదేళ్ల కేసీఆర్ దోపిడీకి ఆగమైన తెలంగాణను చక్కదిద్దటానికి; గడీల పాలనలో గాడి తప్పిన తెలంగాణను గాడిలో పెట్టడానికి; భూమి, నీరు, ఇసుక, లిక్కర్ కాదేదీ అవినీతికి అనర్హం అన్నట్టు కేసీఆర్ అండ్ కో చేసిన లూటీ నుంచి తెలంగాణను కోలుకొనేట్టు చేసి ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలంగాణ ప్రజలు, రైతులు పెద్దమనసుతో అర్థం చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై సభలో మా ప్రభుత్వం శ్వేత పత్రాన్ని ప్రవేశపెట్టింది. బంగారు తెలంగాణ ముసుగులో 2014నాటికి 60ఏళ్లలో రూ.60వేల కోట్ల అప్పులున్న తెలంగాణ రాష్ట్రాన్ని, 2024లో కేవలం 10ఏళ్లలో దిగిపోయేనాటికి 7 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి దించిన కేసీఆర్ బడా మోసాల నుంచి తేరుకొని పాలన మొదలుపెట్టినం. కానీ, ఏ మాత్రం రాజకీయ విలువలు లేని బీఆర్ఎస్ పార్టీ, ప్రజాపాలన కనీసం వంద రోజులు కూడా పూర్తి చేసుకోకముందే, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై విషం చిమ్ముతుంది.

ఎండిన పంట పొలాల పరిశీలన పేరుతో రైతులపై కపట ప్రేమలు ఒలుకబోస్తున్నారు. కానీ కేసీఆర్ కాసులకు కక్కుర్తిపడి అవినీతితో కట్టిన డ్యాములు కుంగడం వల్లనే రైతులకు నీళ్లు ఇవ్వలేక పోతున్నాం. తాము నిర్మించిన నాణ్యతలేని డ్యాములు నిరుపయోగంగా మారిన పరిస్థితులలో తప్పు ఒప్పుకొని తెలంగాణ ప్రజల ముందు ముక్కు నేలకు రాయాల్సింది పోయి కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు మొండి వాదనలకు దిగడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ప్రపంచంలో అతిపెద్ద అవినీతి స్కాం కాళేశ్వరం. రైతులకు నీళ్లు ఇస్తున్నామనే పేరుతో ధన దోపిడీ చేసిండు కేసీఆర్. ఈ ప్రాజెక్టు పేరు మీద వివిధ మార్గాల ద్వారా 1 లక్ష 41 వేల కోట్ల అప్పు చేస్తే, కనీసం 40 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు ఇవ్వలేని పరిస్థితి. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోయి, పర్రెలు పాసి నీటిని తోడుకోలేని దుస్థితికి ఆ బ్యారేజ్ పడిపోయింది. అన్నారం బ్యారేజ్లో బుంగలు పడ్డాయి. కేసీఆర్ డిజైన్ చేసిన అద్భుత కట్టడం అభాసుపాలవుతుంటే, కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒకటే కాదు ఎన్నో కెనాల్స్, ఎన్నో డ్యాములు అని సుద్దులు చెప్తున్నారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ గుండెకాయ లాంటిది. అక్కడినుంచి నీళ్లు ఎత్తి అన్నారం సుందిళ్ల బ్యారేజిలకు పోయాలి. మరి అదే మేటిగడ్డ పనికిరాకుండా పోతే నీళ్లు ఎట్లా ఎత్తిపోయమంటారో ఈ మేధావులు చెప్పాలి. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన నాగార్జునసాగర్, కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులు 50ఏళ్లు దాటినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయంటే అందుకు కారణం వాటి నిర్మాణంలో, నాణ్యతలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి.

కేసీఆర్ పాలనలో రైతుబంధు పేరుతో ధన దోపిడీ జరిగింది. ఆ పేరు మీద బీఆర్ఎస్ నాయకులు జాతీయ రహదారి భూమికి, రియలెస్టేట్ వెంచర్లకు, ప్రభుత్వ భూములకు, చెరువులు కుంటలు చివరికి స్మశానాలకు కూడా రైతుబంధు డబ్బులు పంచిపెట్టారు. వందల ఎకరాలున్న బడా కాంట్రాక్టర్లకు సైతం కోట్ల రూపాయల డబ్బు పంచిపెట్టిన దాఖలాలు ఉన్నాయి. మా ప్రజా ప్రభుత్వం వచ్చాక ఈ లెక్కలన్నిటినీ తేల్చి అర్హులైన రైతులకు మాత్రమే రైతు భరోసా అందిస్తుంది. ఇప్పటికే ఈ ప్రక్రియ 50శాతానికి పైగా పూర్తయింది.

పంట నష్టపరిహారం విషయంలో కేసీఆర్ మాటలు రైతులను నమ్ముతారా? వాళ్ల పదేళ్ళ పాలనలో ఏనాడూ పంట నష్టం అంచనాలు వేయలేదు. రైతులకు పంట నష్టపరిహారం పరిహారం ఇవ్వలేదు. 2014 నుంచి 2017 వరకు రాష్ట్రంలో కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ కేసీఆర్ ప్రభుత్వం కేంద్రానికి కరువు నివేదికలు కూడా సమర్పించలేదు. ఆ తర్వాత అకాల వర్షాలు వరదలతో రైతులు పంట నష్టపోయారు. కనీసం అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలించమని గాని నివేదికలు రూపొందించమని గాని నష్టపరిహారం ఇద్దామని గాని ఏనాడు ఆలోచించలేదు. 2023 ఏప్రిల్లో జరిగిన పంట నష్టానికి రూ.10వేల నష్టపరిహారం ఇస్తామని చెప్పి హడావుడి చేశారు కానీ అది రైతులకు అందలేదు. ఇప్పుడు అధికారం కోల్పోగానే ఎకరానికి రూ.20వేల చొప్పున పంట నష్టపరిహారం ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నరు. కానీ

పదేళ్ళ పాలనలో రైతులను పూర్తిగా విస్మరించి కేసీఆర్, నేడు కేవలం పార్లమెంటు ఎన్నికలలో లబ్ధి పొందేందుకు రైతుల పేరుతో ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రలకు తెరతీసిండు. కేసీఆర్ అండ్ కో ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయమే ప్రాధాన్యంగా, రైతు సంక్షేమమే పరమావధిగా మన ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను కలెక్టర్లు పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదికలు అందించారు. బీఆర్ఎస్ నాయకులు ఓట్ల కోసం రైతులతో రాజకీయ ఆటలు ఆడటం మాని పంట పొలాలకు వెళ్లి పదేళ్ళ కేసీఆర్ పాలనలో ఆగమైన తెలంగాణను కళ్ళనిండా చూసి రావాలి.

ధరణి పోర్టల్ కేసీఆర్‌కు, వారి అనుయాయిలకు బంగారుగని. ప్రభుత్వ భూములు, అటవీ భూములు, భూదాన్ భూముల దోపిడీకి కేసీఆర్ అండ్ కో రచించిన పథకమే ఈ ధరణి. ఎన్నికల ముందు కాంగ్రెస్ గెలిస్తే ధరణి రద్దు అవుతుందని, ధరణి రద్దు ఐతే రైతుబంధు ఆగిపోతుందని అబద్ధపు ప్రచారాలు చేసిన కేసీఆర్ను ప్రజలు నమ్మలేదు. ఇప్పుడు ధరణి పోలేదు, రైతుబంధు ఆగలేదు. కేసీఆర్ పాలనలో దాదాపు 6000 ఎకరాల అటవీ భూములు మాయమయ్యాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూములు కేసీఆర్ కుటుంబ సభ్యుల పేరు మీద ధరణిలో నమోదయ్యాయి. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇవన్నీ సవరిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భూ సమస్యల పరిష్కారం త్వరితగతిన చేస్తూ సత్వరం రైతులకు ప్రయోజనంచేకూర్చే విధంగా ధరణి స్పెషల్ డ్రైవ్లు నిర్వహిస్తున్నాం.



రైతుల ఆత్మహత్యల పేరుతో బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. వాళ్ళ పదేళ్ల పాలనలో దాదాపు 12వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం మర్చిపోయారా? కేసీఆర్ ఫామ్ హౌస్ ఉన్న గ్రామంలోనే 40 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పదేళ్లలో ఒక్క రోజు సెక్రటేరియట్‌కు రాకుండా 365 రోజులు ఫామ్‌హౌస్ లోనే ఉండే కేసీఆర్, ఒక్కనాడైనా వాళ్ల గురించి మాట్లాడాడా? వాళ్లను పరామర్శించాడా? వాళ్లకి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చాడా? అధికారం కోల్పోయిన మూడు నెలల్లోనే రైతు ఆత్మహత్యలంటూ వగల ఏడ్పులు మాత్రం మొదలుపెట్టారు.

మద్దతు ధర అడిగిన మిర్చి రైతులకు ఖమ్మంలో బేడీలు వేసిన తన చరిత్ర కేసీఆర్ మర్చిపోయినట్టున్నారు. గిరిజన రైతుల పోడు భూములు లాక్కొని, అడ్డొచ్చిన మహిళా రైతులను చెట్లకు కట్టేసి కొట్టి ఈడ్చుకుపోయిన దురాగతాలు గుర్తు లేవా? మల్లన్న సాగర్ రిజర్వాయర్ పేరుతో రైతుల భూములు లాక్కున్న వీళ్ల రైతుల గురించి పోరాడుతాం అంటే జనం నవ్వుకుంటున్నారు. పత్రికా సమావేశాల్లో హరీష్ రావు బోరుబావులు ఎండిపోయాయి అంటున్నారు. పదేళ్లలో కేసీఆర్ గ్రౌండ్ వాటర్ రీచార్జ్ అయిందని సుద్దులు చెప్తుంటే రెండు నెలల్లోనే గ్రౌండ్ వాటర్ పాతాళానికి మాయమైపోయిందా? అది ఎట్లా సాధ్యం? అయితే కేసీఆర్ చెప్పిన గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ అనే మాటైనా అబద్ధం అయి ఉండాలి లేదా ఇప్పుడు గ్రౌండ్ వాటర్ అడుగంటిపోయింది అనే వాదన అబద్ధం అని ఒప్పుకోవాలి.

నల్గొండ, కరీంనగర్‌లలో బీఆర్ఎస్ నిర్వహించిన రాజకీయ సభల్లో పాల్గొనడానికి కేసీఆర్ చూపించిన ఉత్సాహం, ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీలో ప్రజా సమస్యల మీద చర్చించడంలో చూపించకపోవడం ఆయన నిరంకుశత్వానికి నిదర్శనం. ప్రజాస్వామ్య విలువలు లేని కేసీఆర్ కనీసం ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించడంలో కూడా విఫలమవుతున్నారు.

పదేళ్ళ పాలనలో రైతులను పూర్తిగా విస్మరించి కేసీఆర్, నేడు కేవలం పార్లమెంటు ఎన్నికలలో లబ్ధి పొందేందుకు రైతుల పేరుతో ప్రజా ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రలకు తెరతీసిండు. నాడు పరిపాలనలో విఫలమైన కేసీఆర్, కనీసం ప్రధాన ప్రతిపక్ష నేత పాత్ర పోషించడంలో కూడా విఫలమైతున్నడు. ఓట్ల కోసం కేసీఆర్ వేసే ఎత్తులకు జిత్తులకు తెలంగాణ ప్రజలు, మరీ ముఖ్యంగా రైతులు, తగిన గుణపాఠం చెప్తారు. కేసీఆర్ అండ్ కో ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వ్యవసాయమే ప్రాధాన్యంగా, రైతు సంక్షేమమే పరమావధిగా మన ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది.

• డాక్టర్ కొనగాల మహేష్
కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి





బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్న నీతా అంబానీ

అమీర్‌పేట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ సతీమణి, ఐపీఎల్ ముంబై ఇండియన్స్ టీం యజమాని నీతా అంబానీ బుధవారం రాత్రి బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్‌లో ముంబై ఇండియన్స్ మ్యాచ్ ఎప్పుడు జరిగినా నీతాఅంబానీ ఎల్లమ్మను దర్శించుకొని స్టేడియానికి వెళుతుంటారు. నీతా అంబానీకి ఆలయ ఈవో కుంట నాగరాజు, చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్‌లు స్వాగతం పలికారు.



భారీ భద్రత మధ్య హైకోర్టు భవనానికి శంకుస్థాపన

రాజేంద్రనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతంలో హైకోర్టు వద్దంటూ ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా భారీ భద్రత ఏర్పాటు చేశారు. విద్యార్థులు మహేశ్, జీవన్, కమల్, సూర్య ప్రకాశ్, రాజు, కుమార్‌లను అరెస్ట్ చేశారని విద్యార్థి సంఘం నాయకుడు రాజ్‌కుమార్ తెలిపారు. రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్

మిగతా 8వ పేజీలో..







పరుగుల హోరు.. అభిమానుల జోరు

ఉప్పల్‌లో బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లతో విజృంభించడంతో స్టేడియం హోరెత్తిపోయింది. భారీస్కోర్లు నమోదైన ఈ పోరులో సన్‌రైజర్స్ విజయంతో అభిమానగణం మురిసిపోయింది. ఇదిలా ఉండగా బ్లాక్ టికెట్లు విక్రయిస్తున్న 25 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- ఉప్పల్, (ఆంధ్రజ్యోతి)



సన్‌రైజర్స్ అభిమాని సందడి



నిర్మాత కేఎల్ నారాయణ, జయేష్ రంజన్



నిర్మాత సురేష్‌బాబు, హీరో విజయ్‌దేవరకొండ



5,813 కోట్లు 125 చ.కి.మీలు

మూసీనదికి ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రానున్నది. మూసీ వెంట 125 చదరపు కిలోమీటర్ల మేర ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి జరిగేలా ప్రణాళిక రూపొందించనున్నారు. ఈమేరకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా జోన్లను నిర్ణయిస్తూ ఆరు నెలల్లో మాస్టర్‌ప్లాన్‌ను సంసిద్ధం చేయాలని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్)ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఎంఆర్‌డీసీఎల్ కార్యాచరణ మొదలు పెట్టింది. టెండర్ ప్రక్రియను ప్రారంభించి ఓ కన్సల్టెన్సీ ద్వారా మాస్టర్‌ప్లాన్‌కు కసరత్తు చేస్తోంది.

మూసీనది అభివృద్ధికి ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్

- నదికి ఇరువైపులా కి.మీ. వరకు గ్రోథ్ ఏరియాగా గుర్తింపు
- ప్రాంతాల వారీగా జోన్ల నిర్మాణం.. ● కార్యాచరణ చేపట్టిన ఎంఆర్‌డీసీఎల్

హైదరాబాద్ సిటీ, మార్చి27 (ఆంధ్రజ్యోతి): ఏ నగరమైనా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరగాలంటే మాస్టర్‌ప్లాన్ తప్పనిసరి. ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్‌కు ఐదు మాస్టర్‌ప్లాన్‌లున్నాయి. హైదరాబాద్ పాత నగరం కోసం మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్) మాస్టర్‌ప్లాన్ ఉండగా, జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రాంతానికి హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ (హుడా) మాస్టర్‌ప్లాన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసిన క్రమంలో హైదరాబాద్ విమానాశ్రయాభివృద్ధి సంస్థ (హడా) మాస్టర్‌ప్లాన్, హైదరాబాద్‌కు పశ్చిమవైపున ఐటీ కారిడార్ అభివృద్ధి కోసం సైబరాబాద్ అభివృద్ధి సంస్థ (సీడీఏ) మాస్టర్‌ప్లాన్ ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల మరో ఏడు జిల్లాల్లోని పలు ప్రాంతాలతో విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏకు కూడా మాస్టర్‌ప్లాన్ ఉన్నది. పట్టణ విస్తరణపై భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిపేందుకు ఈ మాస్టర్ ప్లాన్లు దోహదపడుతున్నాయి.

ఇప్పటికే ఐదు మాస్టర్‌ప్లాన్‌లు

ఇప్పటికే ఉన్న ఐదు మాస్టర్‌ప్లాన్‌లు గాకుండా మూసీనది అభివృద్ధికి, ఫార్మాసిటీకి, ఫ్యాబ్‌సిటీకి వేర్వేరు మాస్టర్‌ప్లాన్లు అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా చేపట్టే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు దాదాపు రూ.5,813 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలేశారు. ప్రాజెక్టును ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేపట్టడానికి ప్రత్యేకంగా మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని నిర్ణయించారు. మూసీనదికి ఇరువైపులా కిలోమీటర్ చొప్పున మాస్టర్‌ప్లాన్ పరిధిలోకి రానున్నది. మూసీనదికి తూర్పున ఔటర్ రింగ్ రోడ్డు గౌరెల్లి వద్ద నుంచి పశ్చిమాన ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగి వరకు 55 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేపట్టేలా మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. మూసీనదికి ఇరువైపులా మరో కిలోమీటర్ గ్రోథ్ ఏరియాగా గుర్తించారు. మొత్తంగా అన్నివైపులా కలుపుకుని సుమారు 125 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉండేవిధంగా మూసీ రివర్ ఫ్రంట్ మాస్టర్‌ప్లాన్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసింది.



ప్రాంతాలవారీగా జోన్లు

నది వెంట పర్యావరణ పునరుద్ధరణకు మూసీ రివర్ ఫ్రంట్ మాస్టర్ ప్లాన్ దోహదపడనుంది. నది పరిసర ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దడంతో పాటు, రోడ్లు, వివిధ రకాల వాణిజ్య కేంద్రాలు, నివాస సముదాయాలు, రవాణా, లాజిస్టిక్ హబ్‌లు రానున్నాయి. ఆమేరకు జోన్లను నిర్ధారించనున్నారు. చారిత్రక, వారసత్వ కట్టడాలు కలిగిన ప్రాంతాన్ని హెరిటేజ్ జోన్‌గా, ఆటవిడుపు ఉండే ప్రాంతాన్ని రిక్రియేషన్ జోన్‌గా, ల్యాండ్‌స్కేప్, పార్కులను అభివృద్ధి చేసే ప్రాంతాన్ని

మిగతా 8వ పేజీలో..



చెత్త ఇస్తలేరు!

సేకరణ 24 శాతమే!


- 1.23 లక్షల ఇళ్లు చెత్త సేకరణ లక్ష్యానికి దూరం
- బస్తీలు, మురికివాడల్లోనే ఎక్కువ
- సేకరణ రుసుము ఇవ్వలేక రోడ్ల పక్కన పారబోత

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మహానగరంలోని మెజార్టీ బస్తీలు, మురికివాడల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదని జీహెచ్‌ఎంసీ గుర్తించింది. ఇప్పటి వరకు నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో బస్తీలు, మురికివాడల్లోని 1.62 లక్షల ఇళ్లకుగాను 1.23 లక్షల ఇళ్లలో చెత్త సేకరణ చేయడం లేదని తేల్చింది. అంటే దాదాపు 76 శాతం ఇళ్ల నుంచి స్వచ్ఛ ట్రాలీ కార్మికులు చెత్త తీసుకెళ్లడం లేదని గుర్తించింది. స్థానికులు గార్బేజ్ రుసుము చెల్లించకపోవడం, పలు ప్రాంతాల్లో వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడం, అధిక రుసుము కూడా ఇందుకు కారణంగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు అధికారులు శ్రీకారం చుట్టారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో బస్తీలు, మురికివాడల వాసుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నామమాత్రపు గార్బేజ్ రుసుము తీసుకునేలా స్వచ్ఛ ట్రాలీ కార్మికులను.. ఆ మొత్తం చెల్లించేలా బస్తీ, మురికివాడల వాసులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

4500 ట్రాలీలు

గ్రేటర్‌లో ఇంటింటి చెత్త సేకరణకు నాలుగు దఫాలుగా జీహెచ్‌ఎంసీ 4,500 స్వచ్ఛ ట్రాలీలను అందజేసింది. నామమాత్రపు వాటా లబ్ధిదారులు

మిగతా 8వ పేజీలో..



ఇఫ్తార్: 6:34 (గురువారం సాయంత్రం)

సహర్: 4:51 (శుక్రవారం ఉదయం)

పోలీసు కస్టడీలో ఓక్రా

- డ్రగ్స్ నెట్‌వర్క్ గోవా లింకులపై ఆరా

8




ఆలస్యానికి

చింతిస్తున్నాం..

- 15 నిమిషాలు నిలిచిన మెట్రోరైలు
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద సాంకేతిక సమస్య

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సాంకేతికలోపంతో బుధవారం ఉదయం మెట్రోరైలు రాకపోకల్లో 15 నిమిషాలు అంతరాయం ఏర్పడింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద ఉదయం 10.15 గంటల సమయంలో సాంకేతిక లోపంతో రైలు నిలిచిపోయింది. దీంతో నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్ కారిడార్లలోని రైళ్ల రాకపోకలలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయి. టెక్నికల్ సిబ్బంది సమస్యను పరిష్కరించి రైళ్లను యథావిధిగా నడిపించారు. 'సాంకేతికలోపంతో రైళ్ల

మిగతా 8వ పేజీలో..



విద్యుత్ వెలుగుల్లో ఆలయం



స్వామి సేవలో నిర్వాహకులు

వైభవంగా వెంకటేశ్వర స్వామి ప్రతిష్ఠాపన

ప్రశాంత్‌నగర్‌లో 30న కల్యాణ మహోత్సవం

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ ప్రశాంత్‌నగర్ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థాన ప్రాంగణంలోని పద్మావతి, గోదాదేవీ సమేత శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి నూతన బింబ, ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్, హానర్, ఫ్యామిలీ సంస్థల అధినేతలు పొట్టి వెంకటేశ్వర్లు-సుజాత, సీర్ల రాజమౌళి-సువర్ణ ఆధ్వర్యంలో కుంభాభిషేకం, విమాన శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో వేదోక్త కార్యక్రమాలు ప్రారంభించి ఉ.9 గంటల సుముహూర్తంలో శ్రీ వైభవ వెంకటేశ్వర యంత్ర, విగ్రహ, విమాన శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనా మహోత్సవాన్ని వైభవంగా పూర్తిచేశారు. మార్చి 30 శనివారం ఉదయం 11 గంటలకు త్రిదండీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో శ్రీ పద్మావతీ, గోదాదేవీ సమేత శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు.

ఓటీఎస్.. మరో నాలుగు రోజులే

ఆస్తి పన్ను బకాయిల చెల్లింపునకు ముగియనున్న గడువు



రూ.12 కోట్ల చెక్కును కమిషనర్‌కు అందజేస్తున్న ఐడీపీఎల్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిల వడ్డీని 90 శాతం మాఫీ చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం స్కీమ్ (ఓటీఎస్) గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. ఓటీఎస్ ప్రకటనతో జీహెచ్‌ఎంసీలో ఆస్తిపన్ను ఆదాయం పెరిగింది. ఇప్పటి వరకు రూ.1606 కోట్ల పన్ను వసూలు కాగా, ఇందులో ఓటీఎస్ ఆదాయం రూ.110 కోట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బుధవారం ఎర్లీ బర్డ్ ఆఫర్ అనంతరం ఈ యేడాదిలోనే అత్యధికంగా రూ.33 కోట్ల పన్ను వసూలైంది. కూకట్‌పల్లిజోన్‌లోని ఐడీపీఎల్ కంపెనీ ప్రతినిధులు రూ.12 కోట్ల ఆస్తి పన్ను బకాయి చెక్కును కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు అందజేశారు. ఓటీఎస్ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

ఐటీ కారిడార్‌లోని అమెరికా కాన్సులేట్‌ను ఆనుకొని ఉన్న గౌలిదొడ్డి పూర్తిగా 111జీవో ఏరియా. ఇక్కడి బహుళ అంతస్తుల భవనాలకు పంచాయతీ, మున్సిపాలిటీ అనుమతుల్లేవ్. సెట్ బ్యాక్‌లుండవు.. సెల్లార్ ఉండదు.. ఫైర్ సేఫ్టీ కూడా కరువు. భవనంలోకి వెళ్లేందుకు, వచ్చేందుకు ఒకే మార్గం తప్ప.. ఎలాంటి రక్షణలేని భవనాలను కొన్ని కంపెనీలు లీజుకు తీసుకొని లివింగ్, సర్వీస్‌రూమ్‌లు, హోటళ్లను ఏర్పాటు చేసి భారీ దందాకు తెరలేపాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను ఆనుకొని ఉండడంతో అక్కడ పనిచేసే ఐటీ నిపుణులంతా గౌలిదొడ్డిలోనే బస చేస్తున్నారు. ఇక్కడ ఒక్క భవనంలో ప్రమాదం వాటిల్లితే.. వరుసగా ఐదు నుంచి పది భవనాలకు ముప్పువాటిల్లే పరిస్థితులు ఉన్నాయి. ఎలాంటి ప్రణాళికలేని గౌలిదొడ్డిలో ఇలా ఉంటే, ఎంతో ప్రణాళికబద్ధంగా ఏర్పాటైన జీహెచ్‌ఎంసీ పరిధిలోని గోపనపల్లి జర్నలిస్టుకాలనీలోనూ అలాంటి అధ్వానపు పరిస్థితులే నెలకొంటున్నాయి. అనుమతులప్పుడు పొందుపరిచే ప్లాన్‌కు, క్షేత్రస్థాయిలో నిర్మాణాలకు పొంతనే ఉండటం లేదు. అడ్డగోలుగా నిర్మిస్తున్న భవనాలపై ఫిర్యాదులు వచ్చినా, పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు.. ఫైర్‌సేఫ్టీ లేని బహుళ అంతస్తుల భవనాల్లో హోటల్‌తో పాటు అడ్డగోలు వ్యాపారాల నిర్వహణకు ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చేస్తున్నారు.

భవనాలు ఇలా.. భద్రత ఎలా?

సెట్‌బ్యాక్ లేదు.. ఫైర్‌సేఫ్టీ ఉండదు

- ఐదారు అంతస్తులైనా నిబంధనలకు పాతర
- పెద్దఎత్తున లివింగ్, సర్వీస్‌రూమ్, హాస్టల్స్ ఏర్పాటు
- ఒక్కో భవనంలో వంద మందికిపైగా ఉద్యోగుల బస
- గౌలిదొడ్డిలోని ఒక భవనంలో ప్రమాదం జరిగితే, మరో పదింటికి ముప్పే
- గోపనపల్లి జర్నలిస్ట్‌కాలనీలోనూ అదే దుస్థితి
- కాసుల కక్కుర్తితో అడ్డగోలు వ్యవహారాలపై శీతకన్ను
- ఫిర్యాదులు చేసినా చోద్యం చూస్తున్న జీహెచ్‌ఎంసీ
- ఇష్టారీతిగా ట్రేడ్‌లైసెన్స్‌లు

హైదరాబాద్ సిటీ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం చుట్టూ నిర్ణీత స్థలాన్ని (సెట్‌బ్యాక్) వదిలేసి బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాలి. ఇరువైపులా రోడ్డు ఉన్నా, భవనానికి చుట్టూ ఫైర్ ఇంజన్ తిరిగేలా స్థలాన్ని వదలాల్సి ఉంటుంది. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకొని నిర్మించే భవనాల్లో సుమారు పది శాతం వాటికి నిబంధనలు పాటించడం లేదు. అయినా అధికారులు నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) జారీ చేస్తున్నారు. లివింగ్, సర్వీస్ రూమ్, హాస్టల్స్ ఏర్పాటు చేయడం కోసమే నిర్మిస్తున్న భవనాలకు అనుమతులు ఉండడం లేదు. కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలను కూడా పార్కింగ్ చేసే స్థలాలను వదలడం లేదు. అయినప్పటికీ వాణిజ్య భవనాల ద్వారా నిర్మాణ సమయంలోనే కాకుండా, నెల నెలా డబ్బులు దండుకునే అవకాశాలు ఉండడంతో మున్సిపల్ అధికారులు ఆవైపు తొంగిచూడడం లేదు.



కోజీ కోలివింగ్ భవనం

గౌలిదొడ్డిలో ఇష్టానుసారంగా నిర్మాణాలు

విప్రో సర్కిల్ నుంచి గోపనపల్లికి వెళ్లే మార్గంలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌ను ఆనుకొని గౌలిదొడ్డి ఉంటుంది. ప్రధాన రోడ్డుకు గల ఆలయానికి ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఇష్టానుసారంగా భవనాలు నిర్మించారు. ఈ ప్రాంతం 111 జీఓ ఏరియా

మిగతా 8వ పేజీలో..

కుమార్తెపై లైంగిక దాడికి యత్నం

బంజారాహిల్స్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి కన్నకూతురిపై లైంగిక దాడికి యత్నించాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే దినసరి కూలీ(38) మద్యానికి బానిసై కొంతకాలంగా పనికి వెళ్లడం లేదు. భార్య సంపాదనపై ఆధారపడుతూ ఇంటి వద్దే ఉంటూ మద్యం తాగుతూ ఆవారాగా తిరుగుతున్నాడు. స్కూల్ నుంచి వచ్చిన తన ఏడేళ్ల కూతురిపై మద్యం మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైగింక దాడికి యత్నించాడు. భయంతో వణికిపోతూ ఆ చిన్నారి కామాంధుడైన తండ్రి కబంధహస్తాల నుంచి బయటపడి రోడ్డుపైకి పరుగులు తీసింది. అప్పుడే పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లి కుమార్తె ద్వారా విషయం తెలుసుకుని వెంటనే ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పొక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.


పదవుల కంటే జాతి ప్రయోజనాలే ముఖ్యం

● మందకృష్ణ మాదిగ



సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

పద్మారావునగర్, మార్చి, 27 (ఆంధ్రజ్యోతి): తనకు పదవుల కంటే జాతి ప్రయోజనాలే ముఖ్యమని ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం బోయగూడ ముదిరాజ్ భవన్‌లో ఏర్పాటు చేసిన సికింద్రాబాద్ పార్లమెంటు డివిజన్ స్థాయి ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వల్ల మాదిగ, మాదిగ ఉప కులాలు అన్ని విధాలుగా మోసానికి గురవుతున్నాయని, మాలలు అత్యధికంగా లబ్ధిపొందుతున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముందుకు వచ్చి హామీ ఇవ్వడంతో ఆ పార్టీకి మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. మన జాతి బిడ్డల భవిష్యత్ కోసం రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తున్న కిషన్‌రెడ్డి గెలుపునకు సర్వశక్తులు ఒడ్డాలని ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ శ్రేణులకు ఆయన పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గోవింద్ నరేశ్ మాదిగ, ఎంఎస్పీ నాయకులు జానకిరమయ్యాచౌదరి, నర్సింహ, సత్యం, సోమశేఖర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.



సీఎంతో జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అబ్దుల్ భారీ

రంజిత్‌రెడ్డి గెలుపునకు సైనికుల్లా పనిచేస్తాం

పహాడిషరీఫ్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి గెలుపునకు సైనికుల్లా పనిచేస్తామని ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ వర్కింగ్ ప్రసిడెంట్ మహ్మద్ అబ్దుల్ భారీ చెప్పారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జిగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మంగళవారం రాత్రి సీఎం క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో రేవంత్‌రెడ్డి సమావేశం అయ్యారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, విధివిధానాలపై సీఎం మార్గదర్శనం చేసి వారిలో స్ఫూర్తిని నింపారు. సీఎంతో ప్రత్యేకంగా సమావేశమైన మహ్మద్ అబ్దుల్ భారీ జల్‌పల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థికి రంజిత్‌రెడ్డికి భారీ మెజారిటీ తీసుకొస్తామని హామీ ఇచ్చారు.



ముచ్చింతల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి కొండా విశేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

శంషాబాద్ రూరల్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సతీమణి కొండా సంగీతా రెడ్డి అన్నారు. బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా సంగీతారెడ్డి బుధవారం ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సంగీతా రెడ్డి మాట్లాడుతూ దేశం బాగుండాలంటే మోదీ ప్రధాని కావాలని అన్నారు. దేశ వ్యాప్తంగా మెజారిటీ ఎంపీ సీట్లు సాధించాల్సిన అవసరమున్నదని అన్నారు. ఎన్నికల ప్రచారంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, స్థానిక సర్పంచ్, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. మండల పరిధిలోని నర్కూడ అమ్మపల్లి శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయం నుంచి చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశేశ్వర్‌రెడ్డి చేవెళ్ల ప్రజా ఆశీర్వాద పాద యాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పాల్గొంటారని అన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలత

హైదరాబాద్ ఎంపీ సీటు గెలిచి ప్రధాని మోదీకి కానుకగా ఇస్తా: మాధవీలత

చార్మినార్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ సీటును గెలిచి ప్రధాని నరేంద్రమోదీకి కానుకగా ఇస్తానని ఆ పార్టీ హైదరాబాద్ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్నివర్గాల ఓటర్లు బీజేపీకి మద్దతుగా ఉన్నారని, వారంతా బీజేపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు. మంగళవారం రాత్రి గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా పత్తర్‌గట్టి డివిజన్ అధ్యక్షుడు కాట ఆదిత్య ఆధ్వర్యంలో మీరాలంమండిలో జరిగిన సమావేశంలో మాధవీలత మాట్లాడారు. దశాబ్దాలుగా హైదరాబాద్‌లో మజ్లిస్ పార్టీ అధికారం చెలాయిస్తున్నప్పటికీ.. ఎక్కడా అభివృద్ధి దాఖలాలు లేవన్నారు. హైదరాబాద్‌లో ఇప్పటి వరకు జరిగిన ఎన్నికలు వేరు.. ఇప్పుడు జరుగబోతున్న ఎన్నికలు వేరన్నారు. 'అబ్కీ బార్..చార్ సౌ పార్' నినాదంతో ముందుకు వెళ్తూ హైదరాబాద్ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు నిరంతరం పని చేయనున్నారన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శులు కృష్ణాగుప్తా, బీజేపీ గోల్కొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు సమష్టిగా పనిచేయాలి

● మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

చాంద్రాయణగుట్ట, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు సమష్టిగా పనిచేయాలని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యువ ఓటర్లకు వివరించి వారిని చైతన్య పర్చాలని అన్నారు. బుధవారం బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు ఎ.భరత్ కుమార్ గౌలిపురాలో ఆలే జితేంద్రను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జితేంద్ర వారిని సన్మానించారు. జితేంద్రను కలిసిన వారిలో ఇ.సుమన్ కుమార్, జి.రఘుకాంత్, కె.జగన్మోహనచారి, ఎం.ఉదయ్‌కిరణ్ రెడ్డి, ఆర్. ఈశ్వర్‌యాదవ్, జమాల్‌పూర్ అశోక్, అభిలాష్, సచిన్ ఉన్నారు.

గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను గెలిపించుకోవాలి

● గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు సరస్వతి

అఫ్జల్‌గంజ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవ చేయాలనే గొప్ప సంకల్పం ఉన్న నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ అని, బీఆర్ఎస్ అభ్యర్థిగా హైదరాబాద్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న అతడిని గెలిపించుకోవాల్సి అవసరం ఎంతైనా ఉన్నదని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు శీలం సరస్వతీ ఆర్యా పేర్కొన్నారు. బుధవారం గౌలిగూడలో గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను పలువురు మహిళలు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సరస్వతీ ఆర్య మాట్లాడుతూ సమాజ సేవ చేయాలనే ఉద్దేశం ఉన్న శ్రీనివాస్ యాదవ్‌కు.. పార్టీ అధిష్టానం ఎంపీ టికెట్ ఇవ్వడం శుభపరిణామన్నారు. శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన వారిలో కల్యాణి, భారతి, తులసి, సంగీత, మాణిక్‌లత ఉన్నారు.

ఊపిరితిత్తుల వ్యాధి నిర్ధారణ, చికిత్సలో

విప్లవాత్మక మార్పులు: డా.ఆర్.విజయ్ కుమార్

● స్టార్ ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సూట్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తులు, వాయు మార్గాల వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో విప్లవాత్మక మార్పులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్నాయని సీనియర్ పల్మనాలజిస్ట్ డా.ఆర్.విజయ్ కుమార్ అన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ స్టార్ ఆస్పత్రి కాంప్లెక్స్‌లో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సూట్‌ను బుధవారం స్టార్‌గ్రూప్ ఆస్పత్రుల మేనేజింగ్ డైరెక్టర్ డా.గోపిచంద్ మన్నంతో కలిసి ప్రారంభించి లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా.ఆర్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ పలు రకాలైన పల్మనరీ వ్యాధులను రూపుమాపేందుకు ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ప్రత్యేక విభాగం ఉపయోగపడుతుందన్నారు. ఈ విధానంలో రోగికి కచ్చితమైన ప్రయోజనాలను నిర్ధారిస్తుందన్నారు. ఈ సూట్‌లో ప్రాథమిక ఊపిరితిత్తుల కేన్సర్ నిర్ధారణ, చికిత్స, మెటాస్టాటిక్ ఊపిరితిత్తుల కణితుల నిర్వహణ, వాయుమార్గ అడ్డంకుల ఉపశమనం, ప్లూరల్ వ్యాధుల చికిత్సతోసహా అనేక రకాల సేవలందిస్తుందని తెలిపారు. స్టార్ ఆస్పత్రి ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజీ స్పెషలిస్ట్ డా.కిషన్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సూట్ ప్రారంభం పల్మనరీ మెడిసిన్‌లో ఒక నమూనా మార్పు సూచిస్తుందన్నారు. స్టార్ ఆస్పత్రి పల్మనరీ, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డా.చందన మాట్లాడుతూ ఈ సదుపాయం సంక్లిష్టమైన పల్మనరీ పరిస్థితులను తక్షణమే పరిష్కరించే సామర్థ్యాన్ని మెరుగుపర్చి, రోగి సంరక్షణకు భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో స్టార్ ఆస్పత్రి పల్మోనాలజిస్ట్ డా.అనురాధ, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని పరిరక్షించుకోవాలి: రమణాచారి

రవీంద్రభారతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు నాటక రంగానికి మూడు దశాబ్దాలుగా సేవ చేస్తున్న రసరంజని పాత్ర గొప్పదని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ.రమణాచారి కొనియాడారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకొని రసరంజని సంస్థ 31వ వార్షికోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన నాటకోత్సవం బుధవారం ముగిసింది. మూడు రోజులుగా జరిగిన ఈ నాటకోత్సవంలో భాగంగా చివరి రోజు నచికేత నాటకం ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి కళాకారులను, దర్శకుడిని ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంగస్థల దినోత్సవం రోజు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. రసరంజని సంస్థ మూడు దశాబ్దాలు పూర్తి చేసుకోవడం అభినందనీయమని అన్నారు. తెలుగు నాటక రంగంలో రసరంజని సంస్థ తనదైన ముద్ర వేసుకుందని అన్నారు. నాటకాన్ని, నటీనటులను తగిన ప్రోత్సాహం లభించాల్సిన అవసరముందని అన్నారు. రసంరంజని సంస్థ ఇదే విధంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. నాటక రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని అన్నారు. రసరంజని సంస్థ మూడు దశాబ్దాలుగా ఎనలైని కృషి చేస్తోందని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులను అభినందించారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ తెలుగు నాటక రంగంలో రసరంజని సంస్థ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని అన్నారు. మూడు దశాబ్దాల పాటు నాటక రంగం వికాసాని కృషి చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో డా.డి.ఎస్.ఎన్.మూర్తి, ప్రముఖ పాత్రికేయులు డా.రెంటాల జయదేవ్, సుధామ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

సందేశాత్మకంగా సాగిన నచికేత నాటకం

రసరంజని నాటకోత్సవంలో భాగంగా చివరి రోజు నచికేత నాటకాన్ని ప్రదర్శించారు. ఆకెళ్ల శివప్రసాద్ రచించిన ఈ నాటకానికి ఆచార్య కోట్ల హనుమంతరావు దర్శకత్వం వహించారు. కఠోపనిషత్‌లోని నచికేతుడి కథ ఈ నాటకానికి ఆధారం. సాక్షాత్తు మృత్యుదేవత యముడే నచికేతుడికి బోధించిన మరణ రహస్యం ఇందులోని ప్రధాన అంశం. చక్కటి నటనతో కళాకారులు ఆకట్టుకున్నారు.

మన నగరంలో మ్యాచ్ కూడా చూడలేమా

● రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



నార్సింగ్, మార్చి 27, (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ క్రికెట్ ఫీవర్ ఎమ్మెల్యేలకు తాకింది. బుధవారం ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో ముంబయి ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆయన మనవడు, మనవరాళ్లను తీసుకుని క్రికెట్ మ్యాచ్ చూసేందుకు స్టేడియం వద్దకు టికెట్లు కావాలని అడిగారు. టికెట్లు లేవని నిర్వాహకులు చెప్పడంతో ఎమ్మెల్యే అవాక్కయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 30 వేల టికెట్‌లు గంటలో అయిపోవడం ఏంటని, ఏ ప్రాతిపదికన టికెట్లు అమ్ముతున్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి చొరవతీసుకొని టికెట్‌ల అమ్మకం విషయంలో ఒక విధి , విధానాలు రూపొందించాలని, ట్రాన్స్‌ఫరెన్సీగా టికెట్ విక్రయించేలా చూడాలన్నారు. స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలకు కొన్ని టికెట్లు రిజర్వ్ ఉండాలని, సాధారణ ప్రజలతో పాటు మేము కొంటామని, ఉచిత టికెట్ అవసరం లేదన్నారు. మన నగరంలో మ్యాచ్ జరిగితే మనకు టికెట్‌లు లేకపోవడమేమిటని, ఇంతకన్న దారుణమైన విషయం ఇంకొకటి ఉంటుందానని ఆయన ప్రశ్నించారు.



ఖలీమ్ ఆజాద్‌ను సత్కరిస్తున్న తెలుగు వర్సిటీ వీసీ కిషన్‌రావు

ఖలీమ్ ఆజాద్‌కు తెలుగు వర్సిటీ యువ పురస్కారం ప్రదానం

రవీంద్రభారతి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంగస్థల నటుడు, యువ దర్శకుడు మహ్మద్ అబ్దుల్ ఖలీమ్ ఆజాద్‌కు తెలుగు విశ్వవిద్యాలయం యువ పురస్కారాన్ని ప్రదానం చేసింది. బుధవారం వర్సిటీలోని ఆడిటోరియంలో రంగస్థల కళలశాఖ వారు దివంగత జేఎల్ఎన్. నసింహారావు పేరిట నెలకొల్పిన యువ పురస్కార ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్సిటీ వీసీ ఆచార్య తంగేడు కిషన్‌రావు యువ రంగస్థల నటుడు ఖలీమ్ ఆజాద్‌ను ఘనంగా సత్కరించి పురస్కారాన్ని ప్రదానం చేశారు. 10,116 రూపాయల నగుదుతోపాటు శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం వీసీ కిషన్‌రావు మాట్లాడుతూ నాటకమంటే తనకు చిన్ననాటి నుంచి మక్కువ ఉండేదని, పురస్కారగ్రహీత ఖలీమ్ ఆజాద్ జె.ఎల్.ఎన్. స్ఫూర్తిని పొంది తెలుగు నాటక రంగంలో తనకంటూ ప్రత్యేక కీర్తిని పొందాలని ఆశీర్వదించారు. పురస్కారగ్రహీత ఖలీమ్ మాట్లాడుతూ తన జీవితాన్ని నాటక రంగంవైపు మళ్లించి ఆ రంగంలో నిష్ణాతుడిని చేసి ప్రముఖ రంగస్థల కళాకారుని పేరిట నెలకొల్పిన జె.ఎల్.ఎన్. పురస్కారాన్ని తెలుగు వర్సిటీ తనకు అందించడం గొప్ప అనుభూతిని అందించిందన్నారు. దీంతో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆంటోనిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఆనం మీర్జా, బాలీవుడ్ నటి రవీనాటాండన్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

దావత్ ఏ రంజాన్ ఎక్స్‌పో ప్రారంభం

కార్వాన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని 'దావత్ ఏ రంజాన్' పేరుతో మెహిదీపట్నం కింగ్ ప్యాలెస్‌లో రంజాన్ ఎక్స్‌పోను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనం మీర్జా, ప్రముఖ బాలీవుడ్ నటీ రవీనాటాండన్ హాజరై ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనం మీర్జా మాట్లాడుతూ ఈ నైట్‌బజార్ ప్రదర్శనలో పిల్లలు, మహిళలతోపాటు అన్ని వయస్సుల వారు ఇష్టపడే ఫ్యాషన్ దుస్తులు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఏప్రిల్ 10వ వరకు ఈ రంజాన్ సందర్భంగా బజార్ ఉంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆనం మీర్జా భర్త అసదుద్దీన్ మొహద్, జాకీ జీయావుద్దీన్ ఆలీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని

భార్యను హత్య చేసిన భర్త



మృతురాలు ఆస్మా ఫాతీమా

అఫ్జల్‌గంజ్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన భర్త డబ్బు విషయమై భార్య గొంతు నులిమి హత్య చేసిన సంఘటన బుధవారం కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జియగూడ రహీంపురా కాలనీకి చెందిన సయ్యద్ అబ్దుల్ సలీం (42), ఆస్మా ఫాతీమా(27) భార్యాభర్తలు. వారికి నలుగురు సంతానం. సయ్యద్ అబ్దుల్ సలీం ప్లంబర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన సలీం తరుచూ డబ్బుల విషయమై భార్యతో గొడవపడేవాడు. డబ్బు విషయంలో మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన సలీం భార్య ఆస్మాఫాతీమా గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం ఏమీ తెలియనట్టు స్థానికులకు తన భార్య అనారోగ్యంతో కిందపడిపోయిందని చెప్పి వైద్య చికిత్సల నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. అక్కడ వైద్యులు ఆమెను పరీక్షించగా మృతిచెందినట్టు నిర్ధారించారు. స్థానికులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి అబ్దుల్ సలీంను అదుపులోకి తీసుకుని విచారించగా గొంతునులిమి హత్య చేసినట్టు అంగీకరించాడు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

భార్య మృతికి కారణమైన భర్త అరెస్ట్

గోషామహల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భార్య మృతికి కారణమైన భర్తను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. షాహినాథ్‌గంజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...జుమ్మేరాత్‌బజార్ ప్రాంతానికి చెందిన రాకేశ్‌సింగ్(41), కామాక్షి (38) భార్యాభర్తలు. వారికి కవల పిల్లలు పుట్టి చనిపోయారు. ఈ క్రమంలో తనకు మగపిల్లవాడు కావాలని కామాక్షితో తరచూ భర్త గొడవపడుతున్నాడు. ఇదే విషయమై గతేడాది డిసెంబర్ 14న ఇద్దరూ గొడవపడ్డారు. కోపోద్రిక్తుడైన భర్త రాకేశ్‌సింగ్.. భార్య కామాక్షిని గొంతుపట్టి గోడకేసి కొట్టగా స్పృహతప్పి కిందపడింది. వెంటనే కామాక్షిని వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా... పరీక్షించిన వైద్యులు మృతి చెందిందని నిర్ధారించారు. దాంతో కామాక్షి సోదరుడు విశాల్‌సింగ్ పోస్టుమార్టం నిర్వహించాలని షాహినాయత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తలకు బలమైన గాయం కావడంతో మృతిచెందినట్టు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనది. దాంతో రాకేశ్ సింగ్‌ను అదుపులోకి తీసుకొని ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలుచౌహాన్ విచారించగా తన భార్యను తానే చంపినట్లు నేరాన్ని అంగీకరించాడు. కేసు నమోదు చేసుకొని రాకేశ్‌సింగ్‌ను రిమాండ్‌కు తరలించారు.

పాతబస్తీలో పర్యటించిన సీపీ

● బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంట్ ఎన్నికలు, రంజాన్ పండగను పురష్కరించుకుని భద్రతా, బందోబస్తుపై అధికారులు దృష్టి సారించారు. మంగళవారం రాత్రి నగర పోలీస్ కమిషనర్ కె. శ్రీనివాస్‌రెడ్డి, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యతో మదీనా నుంచి చార్మినార్ వరకు పర్యటించి, అక్కడ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చార్మినార్ వద్ద మీడియాతో సీపీ మాట్లాడారు. రంజాన్ మాసంలో మదీనా పతర్‌గట్టి, లాడ్‌బజార్ చార్మినార్ పరిసరాలలో రాత్రి వేళ ప్రజలు వచ్చి దుకాణాలలో కొనుగోలు చేస్తుంటారని, అకతాయిలు, జేబు దొంగలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాఫ్టీ పోలీసులు, షీటీం బృందాలతో నిఘా ఉంటున్నదని అన్నారు. కార్యక్రమంలో దక్షిణ మండల అడిషనల్ డీసీపీ జాంగీర్, చార్మినార్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

● సౌత్, వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్ కుమార్

కార్వాన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు స్థానిక ప్రజలు సహకరించాలని సౌత్, వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్ కుమార్ కోరారు. బుధవారం లంగర్‌హౌజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాపూఘాట్, ఆసంనగర్, గాంధీ విగ్రహం తదితర ప్రాంతాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ముందస్తుగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, తనిఖీలు చేసి అనుమానితులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామని చెప్పారు.

టీఎస్ ఎప్‌సెట్‌కు ఏపీలో పరీక్షా కేంద్రాల పెంపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షా కేంద్రాలను పెంచినట్లు అధికారులు తెలిపారు. టీఎస్ ఎప్‌సెట్‌కు ఈ ఏడాది ఏపీలో పరీక్షా కేంద్రాలను భారీగా తగ్గించడంపై 'ఎప్‌సెట్‌కు ఏపీలో తగ్గిన పరీక్షా కేంద్రాలు' శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి టీఎస్ ఎప్‌సెట్ ఉన్నతాధికారులు స్పందించారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎప్‌సెట్‌కు ఏపీలో తగినన్ని పరీక్షా కేంద్రాలను సిద్ధం చేయాలని, ఏపీ అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సెట్ నిర్వహణ బాధ్యత చేపట్టిన జేఎన్‌టీయూ అధికారులను ఆదేశించారు. ఏపీలోని విశాఖపట్నం జోన్ పరిధిలో విజయనగరం, విజయవాడ జోన్ పరిధిలో మచిలీపట్నం, గుడ్లవల్లేరు, గుంటూరు జోన్ పరిధిలో నర్సరావుపేట, తిరుపతి జోన్ పరిధిలో మదనపల్లి, కర్నూలు జోన్ పరిధిలో నంద్యాల, అనంతపురం పట్టణాల్లో అదనంగా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఏపీ అభ్యర్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు అవసరమైతే మరో 10 వేల మంది అభ్యర్థులకు సరిపడేలా మరికొన్ని పరీక్షాకేంద్రాలను ముందుగానే సిద్ధం చేసి ఉంచాలని టీసీఎస్ సిబ్బందికి జేఎన్‌టీయూ అధికారులు సూచించారు. కొత్త పరీక్షాకేంద్రాల ఏర్పాటుతో సుమారు 8,500 మంది అభ్యర్థులు వారి నివాస ప్రాంతాలకు సమీపంలో పరీక్షా కేంద్రాలను ఎంచుకునేందుకు వీలు ఏర్పడింది. పరీక్షా కేంద్రాలను పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల అక్కడి విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓటీపీ, ఇతర వివరాలు ఎవరికీ చెప్పకూడదు

సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు, ఓటీపీ వివరాలు, వ్యక్తిగత వివరాలు ఎవరికీ చెప్పకూడదని, బలమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలని పోలీసులు సూచించారు. గౌడ్ కమ్యూనిటీ సెంటర్ హిమాయత్‌నగర్, కోఠి మహిళా యూనివర్సిటీలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సైబర్ నేరాలు జరిగే విధానం, కార్డ్ స్కిమ్మింగ్, ఫిషింగ్, సోషల్‌మీడియా, మెయిల్, ఫెడెక్స్, ఓఎల్ఎక్స్ ఓటీపీ, జాబ్, పెట్టుబడి మోసాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా మహిళా వర్సిటీకి చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించడంతోపాటు, ఇతరులను సైబర్ నేరాలనుంచి కాపాడే వారిని సైబర్ వారియర్లుగా శిక్షణ అందించారు.

వేర్వేరు ప్రాంతాల్లో

పలువురు అదృశ్యం



ధ్యాప మల్లారెడ్డి



తల్లి హీనాఫాతిమా, పిల్లలు, అర్మాన్, సాజీద్,

పహాడి షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురు

పహాడిషరీఫ్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు అదృశ్యమైయ్యారు. ఇంటినుంచి బైక్‌పై బయటకు వెళ్లిన వ్యక్తి, ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లిన తల్లి కనిపించకుండా పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన ద్యావ మల్లారెడ్డి(56) కొంగరకలాల్లోని కలెక్టర్ కార్యాలయంలో పని ఉన్నదని ఇంట్లో చెప్పి ఈ నెల 12న ద్విచక్రవాహనంపై వెళ్లాడు.

అదే రోజు రాత్రి తుక్కుగూడలోని తన స్నేహితుడు మల్లేశ్ ఇంటి వద్ద బైక్‌ను పెట్టి, ఘట్‌కేసర్‌కు వెళ్తున్నాని ఫోన్ చేసి కుటుంబ సభ్యులకు చెప్పాడు. అనంతరం రాజమండ్రికి వెళ్తున్నాని, 19వ తేదీ వరకు ఇంట్లో వారితో ఫోన్ ద్వారా మాట్లాడుతున్న అతడు, తర్వాత ఫోన్ స్విచ్ఛ్ వచ్చింది. ఆందోళన చెందిన మల్లారెడ్డి కుమారు ధ్యావ సాయి కృష్ణారెడ్డి బుధవారం పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఇద్దరు పిల్లలను తీసుకుని తల్లి

నాందేడ్‌కు చెందిన షేక్ యూనుస్, హీనాఫాతిమా భార్యాభర్తలు, వారికి అర్మాన్(10), సాజీద్(8) కుమారులు ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యూనుస్ జల్‌పల్లి దేశీ దాబా వద్ద అద్దెకు ఉంటూ ఆటో నడుపుకుంటున్నాడు. ఈ నెల 26 ఉదయం 6 గంటలకు యూనుస్ ఆటో తీసుకుని వెళ్లి రాత్రి ఇంటికి వచ్చాడు. తాళం వేసి ఉండడంతో చుట్టపక్కల వారిని అడగగా ఇద్దరు పిల్లలను తీసుకుని హీనాఫాతిమా ఎటో వెళ్లిపోయిందని చెప్పారు. ఆందోళన భర్త యూనుస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

భార్యాభర్తల మధ్య గొడవతో కుమారుడితోసహా తల్లి

మంగళ్‌హట్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): భర్తతో ఏర్పడిన స్వల్పవివాదంతో ఓ గృహిణీ తన ఏడు నెలల బాబుని తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన బుధవారం మంగళ్‌హట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మంగళ్‌హట్ ప్రాంతానికి చెందిన లకన్ సింగ్, అనితా సింగ్(30) భార్యాభర్తలు. వీరికి నైరా, నవ్యశ్రీ, అల్యాసింగ్ (7 నెలలు) సంతానం. భర్త లకన్‌సింగ్ తరచూ ప్రతి చిన్న విషయానికి భార్యతో గొడవపడుతుండేవాడు. మనస్తాపం చెందిన భార్య అనితాసింగ్ ఏడు నెలల చిన్నారి అల్యాసింగ్‌ను తీసుకుని బుధవారం తెల్లవారుజామున ఇంటి బయటకు వెళ్లిపోయింది. నిద్రలేచిన భర్తకు... అనితాసింగ్ కుమారుడు అల్యాసింగ్ కనిపించలేదు. ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ విషయాన్ని తన బావమరిది అక్షయ్‌సింగ్ సమాచారం ఇచ్చి మంగళ్‌హట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మదీన, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు మార్చురీకి తరలించారు. హిమ్మత్‌పురా రోడ్డు పక్కన ఓ అచేతనస్థితిలో పడి ఉన్నాడని స్థానికులు హుస్సేనీ ఆలం పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 87126 61284, 87126 60334 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పోలీసులు కోరారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/P4u2Je2 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.



జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

బాబు జగ్జీవన్‌రాం జయంత్యుత్సవాలకు ఆహ్వానం

రాజేంద్రనగర్, మార్చి27(ఆంధ్రజ్యోతి): దళిత వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్‌రాం జయంతిని రాజేంద్రనగర్ దళిత సంఘాల నాయకులు ఏప్రిల్ 5న ఆరాంఘర్ చౌరస్తాలో నిర్వహించబోతున్నారు. తెలంగాణ రాష్ట్ర డైయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి. జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను బండ్లగూడ జాగీర్‌లోని ఆయన నివాసంలో, శంషాబాద్‌లో నివాసం ఉంటున్న బీజేపీ నాయకుడు వీటీ విజయ్‌కుమార్ బుధవారం దళిత సంఘాల నాయకులు కలిశారు. వారికి ఆహ్వాన పత్రికలు అందజేసి జగ్జీవన్ రాం జయంత్యుత్సవాలకు ఆహ్వానించారు. వారి వెంట మాజీ కౌన్సిలర్ కె.ఎస్ దయానంద్, నాయకులు పి.జీవన్‌దాస్, టీఆర్ శ్రీరాములు, పంబాల రాజు, గోల్కొండ రాజ్‌కుమార్, వి.ప్రీతమ్ రాజ్, ఉపేందర్, సుమన్, చంద్రశేఖర్, బాబురావు, రమేశ్, గౌతమ్ తదితరులు ఉన్నారు.

'నిందితులను కఠినంగా శిక్షించాలి'

పహాడిషరీఫ్ మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ పాలన అంటే హిందువులపై దాడి చేయడమేనా అని బీజేపీ నాయకులు పెరమోని నరేశ్ యాదవ్, న్యాయవాది ఎండీ నయీమ్ గుర్జన్ని గణేశ్ గౌడ్ ప్రశ్నించారు. బుధవారం మామిడిపల్లి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో హిందువులకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల గ్రామం పిట్టల బస్తీపై ఆదివారం రాత్రి ముస్లింల దాడిని వారు ఖండించారు. దాడిలో ఓ గర్భిణికి తీవ్రగాయాలు కాగా, మరో మహిళ ప్రాణాపాయస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నదని పేర్కొన్నారు. దాడికి పాల్పడిని నిందితులను వెంటనే అరెస్ట్ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



ప్రెస్‌క్లబ్ ఎదుట నిరసన తెలుపుతున్న ఫొటో జర్నలిస్టులు

ఢిల్లీలో ఫొటో జర్నలిస్టులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బర్కత్‌పుర, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న ఫొటో జర్నలిస్టులపై దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడేనని రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమళ్ల గంగాధర్, ప్రధానకార్యదర్శి కేఎన్ హరి ఆరోపించారు. ఢిల్లీలో ఫొటో జర్నలిస్టులపై దాడిచేసిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్ట్‌కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు చేస్తున్న నిరసనలను ఫొటో జర్నలిస్టులు కవర్ చేస్తుండగా ఢిల్లీ పోలీసులు అకారణంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వద్ద ఫొటో జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాయపడిన ఫొటో జర్నలిస్టులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో సంఘం కోశాధికారి కె. అనిల్‌కుమార్, కార్యవర్గసభ్యులు నక్కా శ్రీనివాస్, ఎండీ అలీముద్దీన్, నాయకులు జి.బాలస్వామి, సయ్యద్ మజార్, జనార్దన్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రోనాల్డ్‌రోస్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ సూచించారు. బుధవారం ఎన్నికల విభాగం, రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పోలింగ్ సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ అందజేయడం, నిబంధనలు, ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బందికి మొదటి విడత శిక్షణ సమయంలోనే ఫారం-12 అందించి పోస్టల్ బ్యాలెట్‌పై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అన్ని వివరాలతో దరఖాస్తు చేసుకున్న ఓటర్లకు ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు వేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే వారి ఓటర్ గుర్తింపు కార్డు, పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ తదితర వివరాలను శిక్షణ తరగతులకు హాజరయ్యే సందర్భంగా తీసుకొని రావాలని సూచించారు. అత్యవసర సేవల విభాగాలకు నోడల్ ఆఫీసర్లను నియమించేలా ఆయా శాఖలకు లేఖలు రాయాలన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరయ్యే వారిపై సస్పెన్షన్ విధించడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు వెనుకాడవద్దన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్, హైదరాబాద్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ పాల్గొన్నారు.

ఓయూలో ప్రారంభమైన షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ లింబాద్రి, వీసీ రవీందర్, మామిడి హరికృష్ణ

తార్నాక, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయస్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ బుధవారం ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్ని పుస్తకాలు చదివినా ప్రేక్షకులకు అర్థం కాని విషయాలు కేవలం మూడు గంటల సినిమా చూస్తే స్పష్టంగా అర్థమవుతాయని అన్నారు. అనంతరం తెలంగాణ భాష, సాంస్కృతిక విభాగం సంచాలకులు డా. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ దర్శకులు వినూత్నంగా ఆలోచించి, అవరోధాలను అధిగమించినట్లయితే భవిష్యత్‌లో షార్ట్‌ఫిల్మ్‌లకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. అనంతరం మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగాధిపతి డాక్టర్ టి.సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక విభాగం సంయుక్త సహకారంతో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయస్థాయి షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆకర్షణీయమైన ప్యానల్ చర్చలు, థియేటర్ నాటకాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, చిత్ర ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ డాక్టర్ రవీందర్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.అర్జున్ రావు తెలిపారు.

దేశవ్యాప్తంగా ఈవీ చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): స్వయం సహకార సంఘాలు, పేద మహిళలకు ఆటో నడపడంలో శిక్షణ ఇచ్చి, వారికి ఎలక్ట్రికల్ ఆటోను ఇచ్చి సహకరిస్తున్నామని ప్రముఖ ఎలక్ట్రికల్ వాహనాల తయారీ సంస్థ ఈటో మోటర్స్ సీఈఓ, రాజీవ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించడంలో భాగంగా నగరంతోపాటు తెలంగాణ వ్యాప్తంగా ఈవీ చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సంప్రదిస్తే తక్కువ ఖర్చులో ఈవీ చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాయని దీనికి తగినట్లు చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ఈటో మోటర్స్ ముందుకు వచ్చిందన్నారు.

పోలీసు కస్టడీలో ఓక్రా

హైదరాబాద్ సిటీ, మార్చి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నార్కొటిక్ బ్యూరో (టీ న్యాబ్), పంజాగుట్ట పోలీసులు సంయుక్తంగా అంతర్జాతీయ ఘరానా డ్రగ్స్‌స్మగ్లర్ స్టాన్లీని ఇటీవల పట్టుకున్న విషయం తెలిసిందే. అతన్ని విచారించిన క్రమంలో మరో ఘరానా స్మగ్లర్ ఓక్రాను గుర్తించారు. అప్పటికే అతడు గోవా జైల్లో ఉండి అక్కడి నుంచే డ్రగ్స్ ఆర్డర్ చేసి, నైజీరియా నుంచి తెప్పిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారం రోజుల క్రితం గోవా జైల్లో ఉన్న ఓక్రాను పీటీ వారెంట్‌పై పోలీసులు హైదరాబాద్‌కు తీసుకొచ్చి కటకటాల్లోకి నెట్టారు. ఓక్రాను పోలీస్ కస్టడీకి ఇస్తే.. దేశవ్యాప్తంగా తన డ్రగ్స్ నెట్‌వర్క్‌ను విస్తరించిన వైనంపై లోతుగా విచారించి మరికొందరు అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లర్స్‌ను గుర్తిస్తామని పంజాగుట్ట పోలీసులు నాంపల్లి న్యాయస్థానంలో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై బుధవారం వాదనలు విన్న న్యాయస్థానం డ్రగ్స్ స్మగ్లర్ ఓక్రాను నాలుగు రోజులు పోలీస్ కస్టడీకి అనుమతిస్తున్నట్లు తీర్పు వెల్లడించింది. దాంతో పంజాగుట్ట పోలీసులు చంచల్‌గూడ జైలుకు వెళ్లి ఓక్రాను అదుపులోకి తీసుకున్నారు. వైద్యపరీక్షల నిర్వహించిన అనంతరం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నార్కొటిక్ బ్యూరో అధికారులు ఓక్రాను విచారిస్తున్నారు. దేశవ్యాప్తంగా విస్తరింపజేసిన డ్రగ్స్ నెట్‌వర్క్‌పై, గోవాలో స్మగ్లర్స్‌తో గోవాలో లింకులపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఇటీవల హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలో వెలుగులోకి వచ్చిన డ్రగ్స్ కేసులకు, ఓక్రా, స్టాన్లీ ముఠాకు లింకులు ఉన్నట్లు నార్కొటిక్ పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో విచారిస్తే సెలబ్రిటీలకు డ్రగ్స్ సరఫరా చేస్తున్న స్మగ్లర్స్‌తో స్టాన్లీ, ఓక్రా ముఠాలకు ఉన్న లింకులు బయటపడే అవకాశం ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

చెత్త ఇస్తలేరు!

(5వ పేజీ తరువాయి)

చెల్లించగా, వాహనం ఖరీదులో 90 నుంచి 95 శాతం బ్యాంకు రుణాలను జీహెచ్ఎంసీ చెల్లించింది. పాడైన, మాయమైన వాహనాలను మినహాయిస్తే ప్రస్తుతం 4300 ట్రాలీలు అందుబాటులో ఉన్నాయని పారిశుధ్య నిర్వహణ విభాగం అధికారులు చెబుతున్నారు. బల్దియా పరిధిలో 23 లక్షల వరకు కుటుంబాలు ఉంటాయని సూత్రప్రాయ అంచనా. ఈ లెక్కన ఒక్కో ట్రాలీ కార్మికునికి 500 నుంచి 800 ఇళ్లు కేటాయించారు. వాస్తవంగా రోజూ ఇంటింటి చెత్త సేకరణ జరగాలి. ప్రముఖులు, కీలక ప్రజాప్రతినిధులు ఉండే ప్రాంతాలు మినహా నగరంలోని దాదాపు 80 శాతం ఏరియాల్లో రెండు, మూడు రోజులకోమారు చెత్త తీసుకెళ్తున్నారు. అయితే మురికివాడలు, బస్తీలతోపాటు కాలనీల్లోని పలు కుటుంబాలు సేకరణ కార్మికులకు చెత్త ఇవ్వడం లేదు. నెలకు రూ.150 నుంచి రూ.200 వసూలు చేస్తుండడంతో ఆ మొత్తం ఇవ్వడం ఇష్టంలేక రోడ్డు పక్కన పడేస్తున్నారు.

100 శాతం ఇంటింటి చెత్త సేకరణ

వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా, రోడ్లపై చెత్త వేసే ప్రాంతాలు(గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు) తొలగించేలా వీక్లీ బస్తీ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. ఈ వివరాలను బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యుల సహకారంతో బస్తీవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. చెత్త సేకరణ కార్మికుల ద్వారా ఏ ఇళ్లలో చెత్త సేకరిస్తున్నారు..? ఎక్కడ సేకరించడం లేదని గుర్తిస్తున్నారు. యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా 1333 సమావేశాలు, 607 ర్యాలీలు నిర్వహించారు. 538 రంగోళి కార్యక్రమాలు, 56 టౌన్ వెండింగ్ కమిటీలతో సమావేశమయ్యారు.

వీక్లీ యాక్షన్ ప్లాన్...

మొదటి రోజు - బస్తీవాసులతో సమావేశం ● రెండో రోజు - సేకరణ కార్మికులకు చెత్త ఇవ్వని కుటుంబాల గుర్తింపు ● మూడో రోజు - బస్తీలో ర్యాలీ ● నాలుగో రోజు - స్థానికుల్లో ప్రేరణ కల్పించే కార్యక్రమం ● ఐదో రోజు - రంగోలి ● ఆరవ రోజు - పట్టణ వెండింగ్ కమిటీ మీటింగ్ ● ఏడో రోజు - ప్రతిజ్ఞ, తీర్మానాలు

ఇదీ లెక్క..		
	పరిశీలించిన ఇళ్లు	1,62,591
	చెత్త సేకరణ జరగనివి	1,23,582

బండ్లగూడ పీఎస్‌లో ముగ్గురి సస్పెన్షన్

- ఎస్‌హెచ్ఓ, ఎస్ఐ, కానిస్టేబుల్‌పై వేటు
- ఫిర్యాదుదారులతో దురుసు ప్రవర్తన
- సక్రమంగా కేసు దర్యాప్తు చేపట్టలేదని నిర్ధారించిన సీపీ



ఎస్‌హెచ్ఓ షాకీర్ అలీ




ఎస్ఐ వెంకటేశ్వర్‌జీ

మదీన, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): తన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడగటానికి వచ్చిన సీఆర్‌పీఎఫ్ మహిళా కానిస్టేబుల్‌తో దురుసుగా మాట్లాడిన సంఘటనలో బండ్లగూడ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓతో పాటు సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుళ్లను నగరపోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశాడు. వివరాల్లోకి వెళితే... చాంద్రాయణగుట్ట సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌లో నివసించే ముఖలింగం సీఆర్‌పీఎఫ్ రిటైర్డ్ కానిస్టేబుల్. అతని భార్య సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్. ప్రస్తుతం ముఖలింగం ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీఓగా పనిచేస్తున్నాడు. జనవరి నెలలో ముఖలింగం తాను నివాసముంటున్న క్వార్టర్ ముందు కారును పార్కు చేసి ఉండగా అదే క్వార్టర్స్‌లో నివాసముండే నలుగురు సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు మద్యం మత్తులో ఆ కారు ముందు మూత్రవిసర్జన చేశారు. ఇదేమిటని ప్రశ్నించిన ముఖలింగంతో వారు వాదనకు దిగారు. దీంతో వారి మధ్య మాటామాటా పెరిగి ముఖలింగంను కొట్టారు. భార్య వారిని అడ్డుకోబోగా ఆమెను కూడా కొట్టారు. దీంతో భార్యాభర్తలు బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షాకీర్ అలీ కేసు నమోదు చేశారు. సెక్టార్ ఎస్ఐ వెంకటేశ్వర్లుజీ, కానిస్టేబుల్ రమేశ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితులను గుర్తించి వారికి 41ఏ కింద నోటీసులు ఇచ్చారు. ఇటీవల బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షాకీర్ అలీని కలిసిన భార్యాభర్తలు తమ కేసు ఇంకా పెండింగ్‌లో ఉందని, తమపై దాడి చేసినవారు దర్జాగా తిరుగుతున్నారు... వారిని అరెస్ట్ చేయమని కోరారు. దీనికి ఏడేళ్ల జైలుశిక్ష పడే అవకాశం లేని కేసుల్లో రిమాండ్ విధించలేమని ఇన్‌స్పెక్టర్ చెప్పారు. ఈ విషయంలో భార్యాభర్తలతో ఎస్‌హెచ్ఓ దురుసుగా మాట్లాడాడు.

రికార్డు చేసి సీపీకి వినిపించిన భార్యాభర్తలు

బండ్లగూడ ఇన్‌స్పెక్టర్ తమతో దురుసుగా మాట్లాడిన మాటలను భార్యాభర్తలు రికార్డు చేసి నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికి వినిపించినట్లు సమాచారం. దీంతో సీపీ విచారణకు ఆదేశించారు. బాధితులతో దురుసుగా ప్రవర్తించడంతో పాటు సరైన పద్ధతిలో కేసు విచారణ చేపట్టలేదనే విషయం ప్రాథమిక విచారణలో నిర్ధారించారు. దీంతో ఎస్‌హెచ్ఓ మహ్మద్ షాకీర్ అలీతోపాటు సెక్టార్ ఎస్ఐ వెంకటేశ్వర్‌జీ, కానిస్టేబుల్ రమేశ్‌లను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్‌జీ మరో మూడు నెలల్లో రిటైర్డ్ కానున్నారు. రిటైర్‌మెంట్‌కు మూడు నెలల ముందు సస్పెన్షన్‌కు గురికావడం గమనార్హం.



రీసెర్చ్ సెంటర్ ప్రారంభ కార్యక్రమంలో ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి

ఏఐజీ ఆస్పత్రిలో మధుమేహ పరిశోధన కేంద్రం

- ప్రారంభించిన డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మనదేశంలో దాదాపు 10 కోట్లమంది మధుమేహంతో బాధపడుతున్నారని, మధుమేహంపై భారతీయ దృక్కోణంలో పరిశోధించడానికి ఓ పరిశోధనా కేంద్రం ఏర్పాటు అత్యవసరంగా మారిందని ఏఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. డయాబెటీస్‌పై పరిశోధన చేసేందుకు అమెరికాలోని ఎమోరీ గ్లోబల్ డయాబెటిక్ రీసెర్చ్ సెంటర్, వాండర్‌బిల్ట్ డయాబెటిక్ సెంటర్, బెంగళూరు సెయింట్ జాన్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలతో కలిసి ఆసియాలోనే మొట్టమొదటి ఆసియన్ సెంటర్ ఫర్ ఎండోక్రైన్ పాంక్రియాస్ రీసెర్చ్ సెంటర్(ఏసీ ఈపీఆర్)ను బుధవారం ఏఐజీ ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మనదేశాన్ని పట్టిపీడిస్తున్న మధుమేహ మహమ్మారిని తక్షణం నిర్మూలించాల్సిన అవసరాన్ని గుర్తించామన్నారు. వివిధ శాస్త్రీయ విశ్లేషణల ద్వారా, సాధారణ రక్త పరీక్షల ద్వారా మధుమేహ కారకాలు ఏవిధంగా వృద్ధి చెందుతాయో గుర్తించడం, ఆయా రకాల మందులకు వ్యక్తుల ప్రతిస్పందన, ఎండోస్కోపీ, శస్త్ర చికిత్స అవసరం వంటి అంశాలను గుర్తించేందుకు పరిశోధనలు చేస్తామన్నారు. ఈ పరిశోధనలు విజయవంతం అయితే మన జీవన ఆహారశైలికి తగిన, మధుమేహ చికిత్సకు కచ్చితమైన ఔషధ విధానం అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎం.శశికళ, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ కోచైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్, డాక్టర్ మోహన్స్ డయాబెటిక్ స్పెషాలిటీ సెంటర్ ఫౌండర్ డాక్టర్ వి.మోహన్, ఎమోరీ గ్లోబల్ డయాబెటిక్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎం వెంకట్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

నేను తొలిసారి విమానం ఎక్కింది హైదరాబాద్ లోనే

- భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్
- ఇండియా ఆన్ కాన్వాస్ ప్రదర్శన ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కపిల్‌దేవ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'నేను తొలిసారి విమానం ఎక్కింది హైదరాబాద్ లోనే' అని భారత తొలి క్రికెట్ వరల్డ్ కప్ కెప్టెన్ కపిల్‌దేవ్ తెలిపారు. వ్యాపారవేత్త, ఎస్ఏఆర్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పార్వతీరెడ్డి, అనిల్‌రెడ్డి నూకలపాటితో కలిసి బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో 'ఇండియా ఆన్ కాన్వాస్' పేరుతో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కపిల్‌దేవ్ మాట్లాడుతూ ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్ ద్వారా నిధులను సేకరించి, చిన్నారుల విద్య, ఆరోగ్యం కోసం వినియోగించనున్నారని తెలిపారు. ఇప్పటి వరకూ దాదాపు 2 లక్షల మంది పిల్లల విద్యపై ప్రభావం చూపగలిగామన్నారు. హైదరాబాద్ అద్భుతంగా అభివృద్ధి చెందిందని అన్నారు. పార్వతి రెడ్డి మాట్లాడుతూ ఖుషీ బోర్డు సభ్యురాలిగామాత్రమే కాకుండా సౌత్ హెడ్‌గా అనేక కార్యక్రమాలను ఖుషీ తరఫున చేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శనలో పలువురు సుప్రసిద్ధ ఆర్టిస్టులు చిత్రించిన 300కు పైగా చిత్రాలను ప్రదర్శిస్తున్నామన్నారు. తెలంగాణలో హైదరాబాద్‌తో పాటుగా పెద్దపల్లి, రంగారెడ్డి జిల్లాలో 8 పాఠశాలల్లో 2365 మంది విద్యార్థులకు అండగా నిలిచామని తెలిపారు. ఈ చిత్ర ప్రదర్శనకు ముఖ్య అతిథిగా రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విచ్చేయగా, కంట్రీ క్లబ్ డైరెక్టర్లు వరుణ్ రెడ్డి, సిద్ధార్థరెడ్డి, గ్రాన్యూల్స్ ఇండియా సంస్థ డైరెక్టర్ ఉమా చిగురుపాటి సహా పలువురు సోషలైట్లు పాల్గొన్నారు.

'పల్సర్' దొంగల అరెస్ట్

- అమ్మకానికి సహకరించిన ఫేస్‌బుక్ ఫ్రెండ్ కూడా..
- 3 సెల్‌ఫోన్లు, 18 బైకులు స్వాధీనం, బ్యాంకు ఖాతా ఫ్రీజ్



నిందితులతో క్రైమ్ టీం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎస్‌హెచ్ఓ రామాంజనేయులు, డీఐ సుధాకర్

కొత్తపేట, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పల్సర్ బైకులను అపహరిస్తున్న పాత నేరస్థుడితో పాటు విక్రయించేందుకు సహకరిస్తున్న ఫేస్‌బుక్ ఫ్రెండ్‌ను ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరి వద్ద 3 సెల్‌ఫోన్లు, 18 బైకులను స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ ఏ.కృష్ణయ్య తమ కార్యాలయంలో కేసు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా ప్రొద్దుటూరు వాజ్‌పేయినగర్‌కు చెందిన మల్లె భరత్‌కుమార్(28) కారుడ్రైవర్. ఆంధ్రప్రదేశ్‌లో అతడిపై 14 కేసులు నమోదయ్యాయి. బద్వేల్ సబ్‌జైలు నుంచి విడుదలైన అతడు నగరంలోని మలక్‌పేట మూసారాంబాగ్‌కు మకాం మార్చాడు. ఈ నెల 17న ఎల్‌బీనగర్ మెట్రో వెహికల్ పార్కింగ్ వద్ద ఓ పల్సర్ బైకు చోరీకి గురైందని ఫిర్యాదు అందడంతో క్రైమ్‌టీం అప్రమత్తమై నేరస్థుడి కదలికలపై సాంకేతికంగా నిఘా పెట్టింది. మెట్రోపార్కింగ్ వద్ద దొంగిలించిన పల్సర్‌బైకును మంగళవారం ఓ వ్యక్తికి విక్రయించేందుకు భరత్‌కుమార్ డీవీఎం కాలేజీ వద్దకు వచ్చాడు. సమాచారం అందుకున్న పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, బైకును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. భరత్‌కుమార్ ఇచ్చిన సమాచారంతో ఫేస్‌బుక్ ఫెండ్, బైక్‌లను అమ్ముతున్న నారాయణపేట మరికల్, రాకొండ గ్రామానికి చెందిన వలిమోని చెన్నయ్య(22)ను పోలీసులు అరెస్టు చేశారు. అపహరించిన బైక్‌లను అతడు కొనుగోలు చేసి రూ.30 వేల నుంచి రూ.40 వేలకు విక్రయించేవాడు. ఇద్దరి వద్ద 18 బైకులను స్వాధీనం చేసుకున్నారు. చెన్నయ్య బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 22,205 లనూ ఫ్రీజ్ చేశారు. భరత్‌కుమార్‌పై రాచకొండ కమిషనరేట్ పరిధిలో 10 బైక్ చోరీ కేసులు, హైదరాబాద్ పరిధిలో 7 కేసులు, సైబరాబాద్ మియాపూర్ పీఎస్ పరిధిలో ఒక కేసు నమోదయ్యాయి. సమావేశంలో ఎస్‌హెచ్ఓ ఎల్.రామాంజనేయులు, డీఐ ఏ.సుధాకర్, క్రైమ్ టీం పాల్గొన్నారు.

చిక్కడపల్లిలో రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం

- ఒకరి అరెస్టు

చిక్కడపల్లి, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పాత నేరస్థుడిని అరెస్టు చేసి అతడి వద్ద రెండు ద్విచక్రవాహనాలను చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చిక్కడపల్లి పోలీస్ సబ్‌డివిజన్ ఏసీపీ ఎల్.రమేశ్‌కుమార్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య క్రైమ్ ఎస్ఐ కోటేశ్వరరావుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన చాగంటి పవన్ తిరుమలేష్(27) ఖరీదైన వాహనాలను దొంగిలించడం, దృష్టి మళ్లించి నేరాలకు పాల్పడ్డం అలవాటుగా మార్చుకున్నాడు. ఈ క్రమంలోనే గుంటూరు, విశాఖపట్నం, వరంగల్, నల్గొండ, ప్రకాశం, హైదరాబాద్ తదితర నగరాలు, జిల్లాల్లో అతనిపై 39 కేసులు నమోదయ్యాయి. ఫిబ్రవరి 16 జైలు నుంచి విడుదలైన అతను బుధవారం చిక్కడపల్లి పీఎస్ పరిధిలో చోరీకి గురైన వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో అతన్ని క్రైమ్ పోలీసులు పట్టుకుని నాంపల్లి క్రిమినల్ కోర్టు 9వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. జడ్జి అతనికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు.

పోలీసులు వేధిస్తున్నారంటూ సీఎం నివాసం వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బంజారాహిల్స్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీసులు అకారణంగా తనను వేధిస్తున్నారంటూ ఓ వ్యక్తి జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసం వద్ద ఆత్మహత్యకు యత్నించాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24న ఓ వ్యక్తి సీఎం నివాసం వద్దకు చేరుకున్నాడు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నా అంటూ హడావిడి చేశారు. బ్లేడుతో ఎడమ చేతిని కోసుకున్నాడు. సీఎం భద్రతను పర్యవేక్షించే పోలీసులు అతన్ని ఆపేందుకు ప్రయత్నించగా మెడ కోసుకుంటానని బెదిరించాడు. పోలీసులు అతనికి నచ్చజెప్పి బ్లేడు లాక్కొని ఆ వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. విచారణలో అతను కార్మికనగర్‌కు చెందిన మోరెడ్డి నాగార్జునరెడ్డి అని తేలింది. మధురానగర్ ఎస్ఐ బాలరాజు, కానిస్టేబుల్ గోపీ ఓ సెల్ ఫోన్ చోరీ కేసులో అతన్ని విచారణ నిమిత్తం పిలిచారు. దీంతో పోలీసులు నుంచి వేధింపులు ఆపాలని కోరుతూ నాగార్జునరెడ్డి ఆత్మహత్యకు యత్నించినట్లు తేలింది. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పల్స్‌హార్ట్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

మియాపూర్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లోని పల్స్‌హార్ట్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను బుధవారం ఆస్పత్రి వైద్యులు ముఖర్జీ, డాక్టర్ మొవ్వా శ్రీనివాస్ బృందం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కార్సినోయిడ్ గుండె జబ్బుతో బాధపడుతున్న 59ఏళ్ల మహిళకు ట్రాన్స్‌కాథెటర్ పల్మనరీ వాల్వ్ రీప్లేస్‌మెంట్ (టీపీవీఆర్) ట్రైకస్పిడ్ వాల్వ్(టీఆర్ఐసి) రీప్లేస్‌మెంట్‌ను నిర్వహించామని తెలిపారు. ఈ ప్రక్రియ దేశంలోని ఎంపిక చేయబడిన కొన్ని ఆస్పత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉన్నదని తెలిపారు. ఇది ప్రపంచంలో నాల్గవ చికిత్సని, మన దేశంలో మొదటిదని వారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్ ఉన్ని, క్రాంతికుమార్, వికాస్‌శుక్లా, వంశీ, నందకిషోర్, చంద్రేష్, రాజేష్, జయ రంగనాథ్, శ్రీనివాస్ అభిషేక్ పాల్గొన్నారు.

యశోదా ఆర్గానిక్స్‌కు ఇన్నోవేటివ్ అవార్డు



అశోక్‌కుమార్‌కు అవార్డును అందజేస్తున్న జస్టిస్ చంద్రయ్య, జయేష్ రంజన్

రాంనగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): బాగ్‌లింగంపల్లిలోని యశోదా ఆర్గానిక్స్ సంస్థకు ది కనెక్ట్ సంస్థ ఇచ్చే ఇన్నోవేటివ్ బిజినెస్ అవార్డు లభించింది. ఈ అవార్డును ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ విభాగాల ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్‌రంజన్, మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ జి.చంద్రయ్య చేతుల మీదుగా యశోదా ఆర్గానిక్స్ అధినేత జి.అశోక్‌కుమార్ బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలోని యశోదా ఆర్గానిక్స్ సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అశోక్‌కుమార్ మాట్లాడారు. గత ఆరేళ్లుగా బాగ్‌లింగంపల్లిలో గానుగ నూనెలు, ఆర్గానిక్ సిరిధాన్యాలు, పప్పులు తదితర వస్తువులను సరసమైన ధరలకు అందజేస్తున్నందుకు తమను గుర్తించి ఇన్నోవేటివ్ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

ఆలస్యానికి చింతిస్తున్నాం..

(5వ పేజీ తరువాయి)

రాకపోకల్లో స్వల్ప ఆలస్యం జరుగుతుంది. దీనికి చింతిస్తున్నాము' అంటూ ట్రైన్‌లో ప్రకటన విడుదల చేశారు. 11:04కు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టుకు రావాల్సిన మెట్రోరైలు 11.19 గంటలకు చేరుకుంది. రైలు ఆలస్యంతో ఉదయం ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

ఐపీఎల్ మ్యాచ్.. మెట్రో సమయం పొడిగింపు

ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ మార్గంలో మెట్రో రైలు సమయాన్ని బుధవారం అర్ధరాత్రి వరకు పొడిగించారు. మెట్రోరైళ్లు నిర్ణీత సమయానికి మించి నడుస్తాయని సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. చివరి రైలు రాత్రి 12:15 గంటలకు బయలుదేరుతుందని, 1:10 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటుందని వివరించారు. నాగోల్, ఉప్పల్ స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్లలో రాత్రి రైల్ ఎక్కేందుకు అనుమతి ఉంది. ఇక్కడ రైలెక్కి ఏ స్టేషన్‌లలోనైనా దిగవచ్చు. సాధారణంగా ప్రతీరోజు రాత్రి 11.15 గంటల వరకు మాత్రమే మెట్రోరైల్ సదుపాయం ఉంటుంది.

5,813 కోట్లు.. 125 చ.కి.మీ

(5వ పేజీ తరువాయి)

ఓపెన్‌స్పేస్‌గా, మూసీ వెంట ఇరువైపులా కొంత మేరకు బఫర్‌జోన్‌గా నిర్ణయించనున్నారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం ఇప్పటికే ఎంఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో కన్సల్టెన్సీ సేవల కోసం గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈఓఐ)ని ఆహ్వానించింది. మూసీనది నీటి నాణ్యత, వరద నియంత్రణ, నిర్వహణ వ్యూహాలు, పర్యావరణ వ్యవస్థను అంచనా వేసేందుకు బ్లూ ప్రణాళికలు, అభివృద్ధికి అనుగుణంగా భూ వినియోగానికి, తాగు, మురుగునీటి, విద్యుత్ నిర్వహణ ట్రంక్‌లైన్లు, రోడ్లు, వంతెనలు, ప్రజారవాణా మార్గాలు, నడక మార్గాలు, సైకిల్ ట్రాక్.. ఇలా మౌలిక సదుపాయాల కల్పనకు ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళికలు కన్సల్టెన్సీ రూపొందించనుంది. మరో ఆరునెలల్లో సమగ్ర మూసీ రివర్ ఫ్రంట్ మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించడమే లక్ష్యంగా ఎంఆర్‌డీసీఎల్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. 2050 సంవత్సరం నాటికి అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందిస్తున్న ఈ ప్లాన్‌లో మున్ముందు మార్పులు, చేర్పుల అవసరం లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

భారీ బందోబస్తు మధ్య ..

(5వ పేజీ తరువాయి)

పర్యవేక్షణలో ఏసీపీ టి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బి.నాగేంద్రబాబుతోపాటు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది, అదనపు బలగాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో పికెటింగ్ నిర్వహించారు. కొత్త వారిని క్యాంపస్‌లోకి అనుమతించలేదు. న్యాయమూర్తుల రాకతో ఆరాంఘర్ చౌరస్తా, పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పై ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు అరగంట సేపు ఇబ్బందులు పడ్డారు.

భవనాలు ఇలా.. భద్రత ఎలా?

(5వ పేజీ తరువాయి)

పరిధిలో ఉండడంతో అనుమతులు లేవు. ప్రస్తుతం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా, ఇక్కడ భవన నిర్మాణ అనుమతులివ్వడం లేదు. కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో పెద్దఎత్తున బహుళ అంతస్తుల భవనాలు ఒక్కదానికి ఒకటి ఆనుకొని నిర్మిస్తున్నారు. ఒక భవనానికి మరో భవనానికి మధ్య కనీసం రెండు అడుగులు ఖాళీ స్థలం లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అక్కడి రోడ్డు కూడా 15 అడుగుల నుంచి 20 అడుగులలోపే. చాలావాటికి ఫైర్‌ఇంజన్ వెళ్లే దారి లేదు. కొందరు గౌలిదొడ్డిలో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించి కొన్ని కంపెనీలకు లీజుకిచ్చారు. కొన్ని కంపెనీలైతే స్థలాన్ని లీజుకు తీసుకొని ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టాయి. కొన్ని భవనాల్లో హోటళ్లు, లివింగ్, సర్వీస్‌రూమ్, హాస్టళ్లను ఏర్పాటు చేశారు.



రెండు భవనాల మధ్య రెండు అడుగుల ఖాళీ స్థలం కూడా లేకుండా లేకుండా నిర్మించిన ఆరు అంతస్తుల నిర్మాణం

గోపనపల్లి జర్నలిస్టు కాలనీలోనూ అవే ఉల్లంఘనలు

గోపనపల్లిలోని సర్వే నంబర్ 74లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి స్థలాన్ని కేటాయించడంతో ప్రణాళికబద్ధమైన లేఅవుట్‌ను ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ పరిధి కావడంతో చాలా వరకు నిర్మాణాలు నిబంధనల ప్రకారమే ఉన్నాయి. కానీ ఇటీవల గౌలిదొడ్డి ప్రభావం జర్నలిస్టు కాలనీపై కూడా పడడంతో కొందరు నిబంధనలను తుంగలో తొక్కుతూ ఐదారు అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. లివింగ్, సర్వీస్‌రూమ్, హాస్టల్స్ ఏర్పాటు చేస్తున్నారు. సెట్‌బ్యాక్, ఫైర్‌సేఫ్టీ ఉండడం లేదు. రెండు, మూడు అంతస్తుల్లో భవన నిర్మాణానికి దరఖాస్తు చేసి, క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారు. జర్నలిస్టుకాలనీ ప్రవేశంలోనే ఏపీఎస్ సీబీఎస్ఈ స్కూల్‌కు ఎదురుగా గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తులతో కోజీ కో లివింగ్ పేరుతో ఓ భవనాన్ని నిర్మించారు. సెట్‌బ్యాక్, ఫైర్ సేఫ్టీ లేని ఆ భవనంలో 50 నుంచి 60 గదులతో పక్కా హోటల్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. సెల్లార్, గ్రౌండ్‌ను హోటల్ ఆఫీసుకు, షెట్టర్‌లు వేసి కమర్షియల్ షాపులకు వినియోగిస్తున్నారు. ఒక్క కారును కూడా లోపల పార్కింగ్ చేసే సదుపాయం లేదు. హోటల్‌లో బస చేసేందుకు వచ్చేవారంతా వాహనాలను ఫుట్‌పాత్, రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దాంతో కాలనీలోకి రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆ హోటల్ పక్కనే మరో ఆరు అంతస్తులు

కోజీ కోలివింగ్‌ను ఆనుకొని రోడ్డు వెంటే మరో భవనాన్ని గ్రౌండ్ ప్లస్ ఆరు అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఆ భవనానికీ కనీస సెట్‌బ్యాక్‌లు లేవు. పశ్చిమం, ఉత్తరం భాగంలో కనీసం రెండు అడుగుల ఖాళీ స్థలం లేదు. ఫైర్ ఇంజన్ కాదు కదా.. ఫైర్‌మెన్ వెళ్లేందుకూ దారి వదల్లేదు. హోటల్స్, లివింగ్, సర్వీస్ రూమ్‌ల కోసం ఇచ్చేందుకే నిర్మిస్తున్నట్లు తెలిసింది. ఈ భవనానికి వెనుక వైపు ఇప్పటికే ఓ హోటల్‌ను గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల్లో నిర్వహిస్తున్నారు. ఈ భవనాలకు ఏవిధంగా ఎన్‌ఓసీలు జారీ చేస్తున్నారో జీహెచ్ఎంసీ అధికారులకే తెలియాలి. పట్టణ ప్రణాళికా నిబంధనల ప్రకారం 15 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉండే వాణిజ్య, 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న నివాస భవనాలకు అగ్నిమాపక ఏర్పాట్లు తప్పనిసరి. విస్తీర్ణాన్ని బట్టి రెండు, మూడంతస్తుల నిర్మాణాలకూ తగిన ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లు చేయాల్సిందే. వాటిని పరిశీలించిన తర్వాతే జీహెచ్ఎంసీ కానీ, శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, ఫైర్ సర్వీసెస్ విభాగం నిరభ్యంతర పత్రం జారీ చేయాలి. కానీ జర్నలిస్టు కాలనీలోనే అనుమతులు ఉల్లంఘించి పెద్దఎత్తున నిర్మాణాలు సాగిస్తుండగా అధికారులు చోద్యం చూస్తున్నారు. ముడుపులకు అలవాటు పడిన కొందరు అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా యథేచ్ఛగా ట్రేడ్ లైసెన్స్‌లనూ జారీ చేస్తున్నారు. సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్స్ తరహాలో ప్రమాదం జరిగితే కోజీ కోలివింగ్‌లో ప్రమాదం తలెత్తి ప్రాణాలకు ముప్పు వాటిల్లితే జీహెచ్ఎంసీ బాధ్యత వహిస్తుందా.? లేకుంటే హోటల్ నిర్వాహకులపై నెట్టేసి చేతులు దులుపుకుంటుందా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే జీహెచ్ఎంసీలో వింత పరిస్థితి

జర్నలిస్టు కాలనీ నివాస సముదాయాల మధ్య పార్కింగ్ సదుపాయం లేకుండా హోటల్స్ నిర్వహించడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరు నెలలుగా జీహెచ్ఎంసీకి కాలనీవాసులు ఫిర్యాదులు చేశారు. ఇప్పటి వరకు ఒక్కదానిపై కూడా చర్యలు తీసుకోలేదు. చట్టప్రకారం కనీసం నోటీసులివ్వలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించిందీ లేదు. అయినా ఫిర్యాదు చేసిన 15 రోజుల్లో సమస్యను సంబంధిత అధికారి పరిష్కారం చేసినట్లుగా మై జీహెచ్ఎంసీ యాప్‌లో పేర్కొంటున్నారు. ఉల్లంఘనలకు పాల్పడేవారితో లోపాయికారి ఒప్పందాలే ఇందుకు కారణమని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి కమిటీ లేకపోవడంతో ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జిగా ఓ అధికారి కొనసాగుతున్నారు. సాధారణంగా సొసైటీ స్థలంలో జరిగే నిర్మాణాలకు ముందుగా పర్సన్ ఇన్‌చార్జి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం జర్నలిస్టు కాలనీలో నిర్మిస్తున్న భవనాలకు ఆయన ఎన్‌ఓసీలు ఇచ్చారా? లేదా? తెలియాల్సి ఉంది. అదేవిధంగా కాలనీ సంరక్షకులుగా సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అడ్డగోలు నిర్మాణాలు, ఉల్లంఘనలపై జీహెచ్ఎంసీకి కనీసం ఒక్క ఫిర్యాదూ చేయలేదు. సొసైటీ నిబంధనల ప్రకారం అడ్డగోలు నిర్మాణాలపై, ఉల్లంఘనలపై నోటీసు జారీ చేసే అధికారం ఉన్నా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. పర్సన్ ఇన్‌చార్జి, జీహెచ్ఎంసీ అధికారుల కనుసన్నల్లోనే అడ్డగోలుగా నిర్మాణాలు సాగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అందాల పోటీల్లో సౌదీ బ్యూటీ



సౌదీ అరేబియా, మొట్టమొదటిసారిగా ఈ ఏడాది మిస్ యూనివర్స్ అందాల పోటీల్లో పాల్గొనబోతోంది. సెప్టెంబరు 18న మెక్సికోలో జరగబోతున్న ఈ అంతర్జాతీయ పోటీలో, ఆ దేశం తరఫున 27 ఏళ్ల రూమీ అల్‌కహ్తానీ పాల్గొనబోతోంది. ఈ అందాల రాశి గురించిన విశేషాలు.

"మిస్ యూనివర్స్ 2014 పోటీల్లో పాల్గొన బోతున్నందుకు నాకెంతో గర్వంగా ఉంది. సౌదీ అరేబియా మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనడం ఇదే మొదటిసారి" అంటూ రూమీ అందాల పోటీల గురించి తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. రియాద్‌లో పుట్టిన రూమీ... మోడల్, కంటెంట్ క్రియేటర్‌గా పేరు తెచ్చుకుంది. గత ఏడాది బహ్రెయిన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, లుహానే యాకూబ్ అనే ముద్దుగుమ్మ మిస్ యూనివర్స్‌లో పాల్గొంది. ఆవిడ అడుగుజాడలనే అనుసరిస్తూ ఈ ఏడాది సౌదీ అరేబియా నుంచి రూమీ అల్‌కహ్తానీ ఈ అందాల పోటీల్లో పాల్గొనబోతూ ఉండడం విశేషం!

ఆదరణకు కొదవ లేదు

రూమీ అల్‌కహ్తానీ సౌదీ మహిళల స్వయం స్వావలంబన కోసం ఎంతో కాలంగా కృషి చేస్తోంది. గతంలో, మిస్ ఏసియా ఇన్ మలేసియా, మిస్ అరబ్ పీస్, మిస్ యూరప్ మొదలైన ఎన్నో అంతర్జాతీయ పోటీల్లో రూమీ సౌదీ అరేబియాకు ప్రాతినిధ్యం వహించింది. మిస్ సౌదీ అరేబియా కిరీటాన్ని దక్కించుకున్న రూమీ, మిస్ మిడిల్ ఈస్ట్ (సౌదీ అరేబియా), మిస్ అరబ్ వరల్డ్ పీస్ (2021), మిస్ ఉమన్ (సౌదీ అరేబియా)గా కూడా గెలుపొందింది. ఇన్‌స్టాలో పది లక్షల మంది ఫాలోవర్లను కలిగి ఉన్న రూమీకి ఇతర సామాజిక మాధ్యమాల్లో కోట్లకొద్దీ అభిమానులున్నారు. డెంటిస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ కలిగి ఉన్న ఈ అమ్మడు, ఇంగ్లీష్, ఫ్రెంచ్, అరబిక్ భాషలను ధారళంగా మాట్లాడగలుగుతుంది.

అతని చలవే!

యువరాజు, 32 ఏళ్ల మొహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, విజన్ 2020లో భాగంగా, సౌదీలోని మహిళలకు ఎన్నో సౌలభ్యాలను కల్పించాడు. 2017లో క్రౌన్ ప్రిన్స్‌గా ఎంపికైనా మొహమ్మద్, అప్పటి నుంచి ఆ దేశంలో ఎన్నో ఆర్థిక, సామాజిక మార్పులకు పూనుకున్నాడు. ఇప్పుడు సౌదీ అరేబియాలో మహిళలు వాహనాలను నడపగలుగుతున్నారు. పురుషులతో సమానంగా బహిరంగ క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతున్నారు. పురుష గార్డియన్ అనుమతితో పని లేకుండా పాస్‌పోర్టులను పొందగలుగుతున్నారు. ఇలా సినిమాలు, మిక్స్‌డ్ జెండర్ వేడుకల మీద కూడా నిషేధాన్ని ఎత్తివేసిన సౌదీ అరేబియా, పాతకాలపు సంప్రదాయ నిబంధనల నుంచి బయటపడి, గణనీయమైన స్వేచ్ఛ వైపు అడుగులు వేయడం హర్షణీయం.



ఒక్క ఆలోచన చాలాసార్లు జీవితాలను మార్చేస్తుంది. రష్మి సావంత్‌కు వచ్చిన ఆలోచన ఆమె జీవితాన్నే కాదు... కడలిని నమ్ముకొని, దాని సమీపంలో నివసిస్తున్న అనేక మంది జీవితాలను మార్చేసింది. ఆమె ప్రారంభించిన 'కల్చర్ ఆంగన్'- మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పర్యాటక రంగాలలో కొత్త ఒరవడిని సృష్టిస్తోంది.

ఆ ఆలోచన వందల జీవితాలు మార్చేసింది!

మహారాష్ట్రలోని సింధుదుర్గ్ ప్రాంతంలో మడ అడవులు ఎక్కువ. వాటి వల్ల ఆ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు కూడా చాలా ఎక్కువగానే ఉంటారు. కానీ వారందరికీ ఆతిథ్యం ఇచ్చే సంస్థలు తక్కువ. ఒక వైపు పర్యాటకులకు ఆతిథ్యం అందిస్తూనే- ఆర్థిక సాధికారతను సాధించటానికి ఉద్దేశించిన కార్యక్రమమే రిష్మి సావంత్ ప్రారంభించిన 'కల్చర్ ఆంగన్'. "2013లో నాకు ఈ ఆలోచన వచ్చింది. మాండవి దగ్గర అందమైన మడ అడవులు ఉంటాయి. కానీ ఆ ప్రాంతంలో నివసించే జేస్తా వారు- చేపలు పట్టుకోవటానికి మాత్రమే అవి పరిమితమై ఉండేవి. ఆ ప్రాంతానికి పర్యాటకులను తీసుకువచ్చి... ప్రకృతి అందాలను చూపిస్తే- రెండు ప్రయోజనాలు ఉంటాయనుకున్నాం. వీటిలో మొదటిది- మడ అడవులు నాశనం కాకుండా ఉంటాయి. రెండోది- స్థానికంగా నివసించే వారికి ఆర్థిక స్వావలంబన కలుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని- ఐక్యరాజ్య సమితికి చెందిన 'యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్



ప్రోగ్రామ్' (యూఎన్‌డీపీ)కు ఒక ప్రతిపాదన పంపాను" అంటారు రష్మి. 2016లో యూఎన్‌డీపీ ప్రతినిధులు ఈ ప్రాంతంలో పర్యటించారు. అక్కడ స్థానిక మహిళలతో మాట్లాడారు. తొమ్మిది మంది మహిళలతో 'స్వామిని' అనే స్వయం సహాయక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోకి వచ్చే టూరిస్టులకు మడ అడవుల అందాలను చూపించటం వీరి పని. ఈ బృందం ప్రస్తుతం ఏడాదికి రెండు లక్షల రూపాయలు సంపాదిస్తోంది. "సముద్ర తీరాల్లో, మడ అడవుల సమీపంలో ఉన్న మహిళలకు కొద్ది సేపు మాత్రమే పని ఉంటుంది. మిగిలిన సమయాన్ని వారు సమర్థంగా వాడుకుంటే సంపాదన పెరుగుతుంది. ఈ ఆలోచనకు రూపమే నేను ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాలు" అంటారు రష్మి.

మొదలయింది ఇలా..

రష్మి పుట్టింది, పెరిగింది ముంబాయిలో. ఆమె భర్త ఒక ట్రావెల్ కంపెనీలో పనిచేస్తూ ఉండేవారు. పెళ్లైన కొత్తల్లో ఆమె తన భర్తతో కలిసి అనేక గ్రామాలకు వెళ్లేవారు.. అక్కడ అనేక మంది మహిళలను కలిసేవారు. "చాలామంది రోజువారి సంపాదనపైనే బతుకుతూ ఉండేవారు. కొందరికైతే నెలకు పది రూపాయలు దాచటం కూడా కష్టమయ్యేది. ఆ సమయంలో నాకు హోం స్టేలను ప్రోత్సహిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది" అంటారు రష్మి. ఆమెకు ఆ ఆలోచన రావటానికి కూడా ఒక కారణం ఉంది. 2000 సంవత్సరంలో రష్మి- 'ఎడిన్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్'కు వెళ్లి- అక్కడ ఒక హోం స్టేలో ఉన్నారు. తమ ఇంట్లో ఒక రూమ్‌ను అద్దెకు ఇచ్చి, వంట వండి పెట్టడం ద్వారా ఆ హోం స్టే యజమానురాలు చాలా సంపాదిస్తున్న విషయాన్ని రష్మి గమనించారు. మన వాళ్లు కూడా అదే పని చేస్తే- వారికి కూడా సంపాదన పెరుగుతుందనే ఆలోచన రష్మికి వచ్చింది. ఎంత మంది తన ఆలోచనకు స్పందిస్తారో చూడటానికి ఆమె - ఒక స్థానిక పత్రికలో ప్రకటన ఇచ్చారు. దానికి సుమారు 50 మంది సానుకూలంగా స్పందించారు. దేవగఢ్ అనే ప్రాంతానికి చెందిన- వైశాలి, విజయ్ లోకే అనే దంపతులు- ముందుకు వచ్చి 'పితృఛాయ' అనే హోంస్టేని ప్రారంభించారు. అతి కొద్ది కాలంలోనే దానికి విపరీతమైన ఆదరణ లభించింది.

అదే చాలదు...

అనేక ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు ఉండటానికి ఇల్లు. చూడటానికి కొన్ని ప్రదేశాలు ఉంటే చాలదు. స్థానికంగా వారికి అదనపు ఆకర్షణలు కావాలి. అవి వారి మనసులను దోచుకోవాలి. "ఇలా ఆలోచిస్తున్న సమయంలో- నేను ఒక రోజు పింగుళి అనే ఒక గ్రామానికి వెళ్లా. ఆ గ్రామం తోలుబొమ్మలాటలకు ప్రసిద్ధి. అక్కడ నివసించే అనేక కుటుంబాలు ఆ వృత్తిపైనే బతుకుతూ ఉంటాయి. ఛత్రపతి శివాజీ కాలం నుంచి వారు ఈ వృత్తిలోనే ఉన్నారని చెబుతారు. కానీ సరైన ఆదరణ లేక ఆ వృత్తిలోకి ఎవరు రావటం లేదని విన్నా. దాంతో టూరిస్టులను ఈ ప్రాంతానికి తీసుకువస్తే- ఒక వైపు అంతరించిపోతున్న తోలుబొమ్మలాట కళ తిరిగి బతుకుతుందనీ, మరో వైపు టూరిస్టులకు అదనపు ఆకర్షణ దొరుకుతుందనీ ఆలోచించా" అంటారు రష్మి. స్థానికుల సహకారంతో రష్మి- 'ఠక్కర్ ఆదివాసీ లోక్ కళా మ్యూజియం'ను స్థాపించారు. స్థానిక కళాకారులకు శిక్షణ ఇప్పించటం.. టూరిస్టులను అదనపు సౌకర్యాలు కల్పించటం మొదలుపెట్టారు. "మహిళలకు వంట వండటం సహజంగానే వస్తుంది. ఆ నైపుణ్యాన్ని సక్రమంగా వాడితే వారికి అదనపు ఆదాయం లభిస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని- 'హిర్‌కాని' అనే కమ్యూనిటీ కిచెన్‌ను ప్రారంభించాం. దీనిలో సుమారు 300 మంది సభ్యులుగా చేరారు. వీరు ఆహారంతో పాటు- జ్యూస్‌లు, పచ్చళ్ల లాంటివి టూరిస్టులకు విక్రయించటం మొదలుపెట్టారు. దీనితో వారికి అదనపు ఆదాయం వస్తోంది. ప్రస్తుతం సింధుదుర్గ ప్రాంతానికి వెళ్లిన వారందరూ 'హిర్‌కాని'కి తప్పనిసరిగా వెళ్తారు" అంటారు రష్మి.

అక్కడితో ఆగకుండా..

సింధుదుర్గ్ ప్రయోగం విజయవంతం కావటంతో రాజస్థాన్‌లోని పాలీలో కూడా హోం స్టేలను రష్మి ప్రారంభించారు. ఆ తర్వాత ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వంతో కలిపి మహిళా సాధికారత కోసం పనిచేయటం మొదలుపెట్టారు. "ప్రతి ప్రాంతంలోను మహిళలకు ఏదో ఒకటి చేయగలుగుతున్నానే తృప్తి మిగులుతోంది. నేను చేస్తున్న ప్రయోగం చిన్నదే కావచ్చు.. కానీ కొన్ని వందల కుటుంబాలను ఆదాయాన్ని సమకూరుస్తోంది. తద్వారా వారు నివసించే ప్రాంతం మెరుగుపడుతోంది" అంటారు రష్మి. ఆమెలా సామాజిక మార్పును కోరుకొనేవారు మరింతమంది ముందుకు రావాలని కోరుకుందాం.

కౌన్సెలింగ్

ఆ మొటిమలు ఎందుకు?

డాక్టర్! నా వయసు 22 ఏళ్లు. గత కొంత కాలంగా 'వెజైనల్ పింపుల్స్'తో బాధపడుతున్నాను. ఇవి ఎందుకొస్తాయి? కారణమేంటి? ఈ సమస్య నుంచి శాశ్వతంగా బయటపడేదెలా?

- ఓ సోదరి, హైదరాబాద్

Q A

వెజైనల్ పింపుల్స్‌కు ఎన్నో కారణాలుంటాయి. అయితే అవి తలెత్తే సందర్భాన్ని బట్టి కచ్చితమైన కారణాన్ని అంచనా వేయవచ్చు. శుభ్రత లోపించడం, లైంగిక వ్యాధులు, నెలసరి సమయంలో ఉపయోగించే ఉత్పత్తులు, ప్యూబిక్ హెయిర్ ఇన్‌ఫెక్షన్... వెజైనల్ పింపుల్స్‌కు ప్రధాన కారణం. నెలసరి తర్వాత ఈ సమస్య వేధిస్తుంటే, ఆ సమయంలో ఉపయోగిస్తున్న శానిటరీ న్యాప్కిన్లు, ఇతరత్రా నెలసరి ఉత్పత్తులే కారణంగా భావించాలి. లోదుస్తులు శుభ్రంగా ఉంచుకోవడం, వీలైనంత వరకూ గాలి ధారాళంగా ఆడే కాటన్ లోదుస్తులు ధరించడం అలవాటు చేసుకోవాలి. వీటితో సమస్య పరిష్కారం



కాని సందర్భాల్లో వైద్యులను కలవాలి. ఇన్‌ఫెక్షన్ ఉందని తేలితే, వైద్యులు సూచించినంత కాలం నోటి మాత్రలు, పైపూత మందులు వాడుకోవాలి. గాఢమైన సువాసనలు వెదజల్లే పౌడర్లు, వెజైనల్ వాష్‌లు ఉపయోగించడం మానుకోవాలి. రాత్రి వేళల్లో లోదుస్తులు ధరించడం మానేయాలి. పగటి వేళ బిగుతైన అండర్‌వేర్స్ జీన్స్ లాంటి వాడకం తగ్గించాలి. ఎక్కువగా చమట పట్టే వీలున్న వేసవి కాలంలో లోదుస్తుల విషయంలో ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలి. సింథటిక్ బదులుగా కాటన్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. శానిటరీ న్యాప్కిన్లు ప్రతి నాలుగు గంటలకోసారి మార్చుకుంటూ ఉండాలి. టాంపూన్లు, కప్స్ వాడకం మానేయాలి. లైంగిక వ్యాధులు సోకే అవకాశం లేకుండా జాగ్రత్తగా ఉండాలి.

డాక్టర్ అమిత్ శర్మ,
గైనకాలజిస్ట్, హైదరాబాద్.

స్ఫూర్తి

అసాధారణం... ఆమె జీవితం



అనూహ్యమైన స్టార్‌డమ్... క్షణం తీరికలేని షెడ్యూల్స్... స్వయంకృషితో నిర్మించుకున్న సౌధం ఒక్కసారిగా కుప్పకూలింది. కారు ప్రమాదం... కోమాలోకి నెట్టేసి... పాత జ్ఞాపకాలన్నీ చెరిపేస్తే... ఆత్మవిశ్వాసంతో నిలబడి... సానుకూల దృక్పథంతో తిరిగి మామూలు మనిషి అయింది. బాలీవుడ్ మ్యూజికల్ హిట్ 'ఆషికీ' కథానాయిక అనూ అగర్వాల్ ప్రయాణంలో ఊహకందని మలుపులే కాదు... కుదుపులూ ఎన్నో ఉన్నాయి. అన్నిటినీ అధిగవించి... నేడు ఎందరికో ప్రేరణగా మారిన అనూ జీవిత 'చిత్రం' ఇది.

స్వీయ నిర్మితం నుంచి స్వీయ స్వస్థత వరకు... అనూ అగర్వాల్ జీవితం నుంచి నేర్చుకోవాల్సిన అనుభవ పాఠాలు ఎన్నో. శరీరానికి అయిన గాయాలకు తల్లడిల్లిపోకుండా.. మానసిక ఒత్తిడికి కుంగిపోకుండా... తనను తాను ఒక మనిషిగా మలుచుకున్న తీరు స్ఫూర్తి రగిలిస్తుంది. 1990లో 'ఆషికీ'తో తొలిసారి వెండితెరపై మెరిసిన అనూ... 'బాలీవుడ్ కథానాయిక అంటే ఇలానే ఉండాలి' అనే కొలమానాలకు భిన్నం. ఆమె అప్పీయరెన్స్ వెండితెరకు కొత్తదనాన్ని తెచ్చింది. ఢిల్లీలో పుట్టి పెరిగిన ఆమె... బడి రోజుల్లోనే నటన ప్రారంభించింది. తొమ్మిదో తరగతికి వచ్చేసరికి థియేటర్ గ్రూప్ ఒకటి నెలకొల్పి, ఒక నాటకానికి తనే దర్శకత్వం వహించి నటించింది. క్రమంగా స్క్రిప్ట్ కూడా రాసింది. బోర్డ్ పరీక్షల కోసం కొన్నాళ్లు నటనకు బ్రేక్ ఇచ్చిన అనూ.. 'ఢిల్లీ యూనివర్సిటీ'లో సోషియాలజీ చదివింది. అందులో గోల్డ్ మెడల్ కూడా అందుకుంది. సినీ నటి కావాలని ఏ రోజూ ఆమె అనుకోలేదు. మొదట మోడలింగ్, వీజేయింగ్ చేసింది. అవకాశం వస్తే... 1988లో దూరదర్శన్ సీరియల్ 'ఇసీ బహానే'తో మొదటిసారి తెరపై కనిపించింది. అది చూసి ఆమెకు బాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. అలా 'ఆషికీ' చిత్రంతో అరంగేట్రంలోనే చిరస్మరణీయ విజయాన్ని అందుకున్న అనూ... రాత్రికి రాత్రి స్టార్ హీరోయిన్ అయిపోయింది.

జీవితం తలకిందులు...

చేతి నిండా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్న అనూ... తన గమ్యాన్ని మార్చుకుని యోగా వైపు అడుగులు వేసింది. వెలుగుజిలుగులకు దూరంగా జీవించడం ప్రారంభించింది. అదే సమయంలో ఆమె జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. 1999లో జరిగిన కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె... ఇరవై తొమ్మిది రోజులు కోమాలోనే ఉంది. అప్పుడామెకు ముప్పై ఏళ్లు. కోలుకున్నాక తన గతమేదీ ఆమెకు గుర్తుకురాలేదు. సగం శరీరం చచ్చుబడిపోయింది. ఎన్నో సర్జరీలు, భరించలేని నొప్పులు... నిద్రలేని రాత్రులు... ఆ గాయాలు మానడానికి కొన్నేళ్లు పట్టింది.

పునర్జన్మ...

2001లో సన్యాసినిగా మారిన అనూ.. ఆరేళ్లపాటు అదే జీవితాన్ని గడిపింది. ఆ క్రమంలోనే యోగా, స్వీయ ప్రేమ, స్వీయ అవగాహన వల్ల జరిగే అద్భుతాలను తెలుసుకుంది. సానుకూల దృక్పథంతో ముందడుగు వేసింది. అవే తనకు పునర్జన్మ ప్రసాదించాయి అంటుంది అనూ. మృత్యువుతో, మానసిక సమస్యలతో పాతికేళ్లు పోరాడిన ఆమె ఇవాళ మనముందు ఒక స్ఫూర్తి శిఖరంలా నిలబడిందంటే.. నిజంగా ఇది ఒక అద్భుతం. ఇన్నేళ్ల తరువాత, 55 ఏళ్ల వయసులో మళ్లీ నటించి మురిపించేందుకు సిద్ధమైన అనూ.. ఆలోచన, ఆచరణ ఎప్పుడూ భిన్నంగా, కొత్తగా ఉంటుంది.

జీవన గమనం... అక్షర రూపం...

"నాకు మూడేళ్లప్పుడు... ఇంట్లో ఉన్న అమ్మ బ్యాగ్ తగిలించుకుని బయటకు వెళ్లాను. ఒక్కదాన్నే రోడ్డు మీద నడుస్తున్నా. ఆ బ్యాగ్ నాకంటే పెద్దగా ఉండేది. రోడ్డు దాటడానికి నేను పడుతున్న ఇబ్బంది గమనించిన ఒకాయన వచ్చి.. 'ఎక్కడికి వెళుతున్నావ్' అని అడిగారు. 'షాపింగ్‌కు వెళుతున్నా' అన్నాను తడుముకోకుండా. మానవత్వం ఉన్న ఆయన నన్ను జాగ్రత్తగా తీసుకువచ్చి ఇంట్లో దిగబెట్టారు. అప్పటికే మా అమ్మ గుండె ఆగినంత పని అయింది" అంటూ చిన్ననాటి సంఘటన గుర్తు చేసుకున్న అనూ అడుగులు ఎప్పుడూ అనూహ్యంగా, నిర్భయంగా ముందుకు పడతాయి. సగటు అమ్మాయి ఆలోచనలకు భిన్నంగా.. కొత్తదనాన్ని వెతుక్కొంటూ వెళతాయి. అనుకోకుండా బాలీవుడ్‌లో రంగప్రవేశం చేసింది. దేశవిదేశాల్లో మోడలింగ్ అనుభవం సినీ అవకాశాన్ని తెచ్చింది. విజయం రుచి చూసినా... ఏ రోజూ తనను తాను పరిశ్రమ వ్యక్తిగా భావించలేదు. ముంబయిలోని అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగానే జీవించింది. నటిగా ఎదురైన ఇబ్బందులు, సమస్యలను తనే పరిష్కరించుకునే ప్రయత్నం చేసింది.



చేతి నిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న అనూ... తన గమ్యాన్ని మార్చుకుని యోగా వైపు అడుగులు వేసింది. వెలుగుజిలుగులకు దూరంగా జీవించడం ప్రారంభించింది. అదే సమయంలో ఆమె జీవితం ఒక్కసారిగా తలకిందులైంది.


'సంతోషంగా లేని సమయం'...

అనూ అగర్వాల్ తన 'అన్‌యూజువల్: మెమోయిర్ ఆఫ్ ఎ గర్ల్ హూ కేమ్ బ్యాక్ ఫ్రమ్ డెడ్' పుస్తకంలో తన సినీ జీవితాన్ని 'సంతోషంగా లేని సమయం'గా పేర్కొంది. 'ఒక్కసారిగా వచ్చి మీదపడిన స్టార్‌డమ్, ప్రాజెక్టులు, అనాదిగా కొనసాగుతున్న మూస పద్ధతులు, బాలీవుడ్‌లోని చీకటి కోణం, లోపించిన సృజనాత్మకత... ఆర్ట్ ఆఫ్ ఫిలిమ్ మేకింగ్ నుంచి వచ్చిన నేను వీటన్నిటిలో ఇమడలేకపోయాను. నన్ను నేను తెలుసుకోవాలనే ఆలోచనతో పరిశ్రమ నుంచి బయటకు వచ్చాను. నటిగానే కాకుండా జీవితంలో నా పాత్ర ఏంటి? దాన్ని వెతుక్కొంటూ యోగా వైపు అడుగులు వేశాను. అదే నాకు జీవన విధానాన్ని నేర్పింది. ఎంతో ఉపశమనం ఇచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది అనూ. ఆడంబరాలు, పెద్ద పెద్ద కోరికలు లేకుండా విలువలతో జీవించడమే అసలైన జీవనమార్గం అంటున్న అనూ అగర్వాల్.. నేడు దేశవిదేశాల్లో శారీరక, మానసిక ఆరోగ్యంపై ఎన్నో ప్రసంగాలు ఇస్తూ, ప్రేరణ కలిగిస్తోంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/5PCqmvgతో చదవండి.







మొదటి పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు

సిద్ధు జొన్నలగడ్డ

సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలవుతోంది. చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "డీజే టిల్లు' యువతను దృష్టిలో పెట్టుకొని తీసిన సినిమా. టిల్లు పాత్రను ప్రేక్షకులు హృదయాల్లో పెట్టుకున్నారు. అందుకే సీక్వెల్ అంటే మొదట భయపడ్డాను. 'టిల్లు స్క్వేర్' కోసం మా టీం అంతా శక్తికి మించి కష్టపడింది. మొదటి



పార్ట్‌కి ఏమాత్రం తగ్గదు. ఈ సినిమాలో థ్రిల్లింగ్, షాకింగ్, సర్‌ప్రైజ్ అంశాలు చాలా ఉన్నాయి. మా నిర్మాత నాగవంశీ, త్రివిక్రమ్, చినబాబు గారికి ధన్యవాదాలు. నేనూ, అనుపమా కలసి ఉన్న పోస్టర్‌ను విడుదల చేసినప్పుడు కొందరు నెగెటివ్ కామెంట్స్ చేశారు. అమ్మాయిని అలా కామెంట్ చేయడం సరికాదు' అన్నారు. మల్లిక్‌రామ్ మాట్లాడుతూ "డీజే టిల్లు' లాగానే 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. సిద్ధుతో ఈ రెండేళ్ల ప్రయాణాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని చెప్పారు. డీజే టిల్లూకన్నా ఈ చిత్రం నాలుగురెట్లు వసూళ్లు సాధించాలని దర్శకుడు వెంకీ అట్లూరి ఆకాంక్షించారు. సిద్ధూ ఎనర్జీ లాస్ట్ ఫ్రేమ్ వరకూ ఓ రేంజ్‌లో ఉంటుంది, ఈ సినిమా కూడా సూపర్ హిట్ అవుతుందని దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ తెలిపారు. సిద్ధూ ఎనర్జీ మైండ్ బ్లోయింగ్, పార్ట్ 2 డబుల్ బొనాంజా అవుతుంది అని దర్శకుడు బాబీ చెప్పారు. చిత్రబృందం సక్సెస్ పార్టీకి సిద్ధంగా ఉండాలని నీరజ కోన కోరారు.

మా అమ్మాయని రికమెండ్ చేయలేదు




మా అమ్మాయి మాళవిక మోహనన్‌ను నేనేమీ రికమెండ్ చేయలేదు. తనకు తానే గుర్తింపు తెచ్చుకుంది. నా ప్రమేయం లేకుండా నటిగా ఆమె నిరూపించుకోవాలి. ప్రస్తుతం తను విక్రమ్‌తో నటిస్తున్న 'తంగలాన్' మూవీ మంచి గుర్తింపు తెస్తుంది" అని ప్రముఖ ఛాయాగ్రాహకుడు, హీరోయిన్ మాళవికా మోహనన్ తండ్రి కె.యు మోహనన్ చెప్పారు. ప్రస్తుతం తను సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేసిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా గురించి మాట్లాడుతూ "ఇది ఒక బ్యూటిఫుల్ మూవీ. ఒక మిడిల్ క్లాస్ వ్యక్తి తన ఫ్యామిలీ కోసం ఏం చేశాడనేది మంచి మెసేజ్‌తో చూపించాం. మంచి లవ్ స్టోరీతో పాటు మనం నిర్లక్ష్యం చేస్తున్న కుటుంబ విలువలను తిరిగి గుర్తు చేసేలా ఉంటుంది" అన్నారు.

పెద్ద విజయాన్ని సాధించాలి



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్ రెడ్డి దర్శకత్వంలో డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్‌లు నిర్మించారు. ఈ నెల 29న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సుమన్, నిర్మాత ఏ.ఎం రత్నం అతిథులుగా విచ్చేశారు. సుమన్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి" అని కోరుకున్నారు. నిర్మాత ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ "టైటిల్ కొత్తగా ఉంది" అని చెప్పారు. డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ మెప్పిస్తుంది" అని చెప్పారు. "సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది" అని నిర్మాతలు అన్నారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "డిఫెరెంట్ కాన్సెప్టుతో వస్తోన్న ఈ చిత్రం మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది" అని చెప్పారు.



రామ్‌చరణ్, కియారా అడ్వానీ జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. శంకర్ దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి జరగండి జరగండి అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. అనంత్ శ్రీరామ్ సాహిత్యానికి తమన్ స్వరాలు సమకూర్చారు. దలేర్ మెహందీ, సునిధీ చౌహాన్ ఆలపించారు.

ఒక్కటైన సిద్ధార్థ్, అదితి



హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితీరావు హైదరీల వివాహం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని రంగనాథ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం జరిగింది. తమిళనాడు నుంచి వచ్చిన పురోహితులు వివాహ తంతును జరిపించారు. వివాహ కార్యక్రమం మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు స్థానిక పూజారులను కానీ, ఆలయ సిబ్బంది, స్థానికులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. అనుమతించిన కొద్దిమంది సెల్‌ఫోన్లను కూడా తీసుకున్నారు. వివాహ కార్యక్రమం పూర్తయిన వెంటనే వనపర్తి పట్టణంలోని వాసుదేవమ్మ తోటలో విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ తోట వనపర్తి సంస్థానాధీశులది. అదితీరావు హైదరీ వనపర్తి సంస్థానాధీశుల్లో చివరిరాజుగా ఉన్న రామేశ్వర్‌రావు మనమరాలు. ఆయన కూతురు విద్యారావు సంతానం అదితి. వనపర్తి సంస్థానాధీశుల కాలంలో నిర్మించిన శ్రీరంగాపూర్ రంగనాథ స్వామి ఆలయం ఇప్పటికీ సంస్థానాధీశుల ట్రస్టు ఆధీనంలోనే ఉండడంతో పెళ్లితంతును రహస్యంగా నిర్వహించగలిగారని చెప్పవచ్చు. హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితిరావు హైదరీ కలసి 'మహాసముద్రం' సినిమాలో నటించారు. ఆ సమయంలోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. సిద్ధార్థ్, అదితి ఇద్దరికీ ఇది రెండో వివాహం. సిద్ధార్థ్ తన చిన్ననాటి స్నేహితురాలు మేఘనను 2003లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత 2007లో ఇద్దరి మధ్యలో వచ్చిన విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. అదితి 2002లో సత్యదీప్ మిశ్రాను పెళ్లి చేసుకొని, 2012లో విడిపోయారు.

– మహబూబ్‌నగర్ (ఆంధ్రజ్యోతి)





స్పోర్ట్స్

హైదరాబాద్ ● గురువారం 28 మార్చి 2024



సింధు శుభారంభం

మాడ్రిడ్: పీవీ సింధు స్పెయిన్ మాస్టర్స్ చాలెంజ్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన తొలి రౌండ్లో సింధు 21-16, 21-12తో వెన్ యూ జాంగ్ (కెనడా)ను వరుసగేముల్లో చిత్తుచేసింది. గతేడాది రన్నరప్ సింధు రెండో రౌండ్లో హువాంగ్ యూ సన్ (చైనీస్ తైపీ)తో తలపడనుంది. ఇతర సింగిల్స్ పోరులో అస్మిత చాలిహా 13-21, 11-21తో ఇంటనాన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో, సతీశ్ కుమార్ 15-21, 19-21తో హె జాంగ్ (మలేసియా) చేతిలో పరాజయం పాలయ్యారు. మిగతా భారత షట్లర్లలో మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి/సిక్కి రెడ్డి జోడీ 16-21, 22-20, 21-14తో చెన్ జి/యాంగ్ చింగ్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచి రెండోరౌండ్ చేరింది. మరో భారత జంట సతీశ్/ఆద్య ఆరంభ రౌండ్లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

గిల్‌కు రూ. 12 లక్షల జరిమానా

చెన్నై: గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు భారీ జరిమానా విధించారు. మంగళవారం చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ బౌలర్లు నిర్ణీత సమయానికి బౌలింగ్ కోటాను పూర్తి చేయలేకపోయారు. దీంతో ఐపీఎల్ నిబంధనల ప్రకారం స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ జట్టు కెప్టెన్ గిల్‌కు ఏకంగా రూ. 12 లక్షలు జరిమానా పడింది. ఈ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై 63 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. కాగా, ఈ సీజన్‌లో జరిమానా ఎదుర్కొన్న తొలి కెప్టెన్‌గా గిల్ నిలిచాడు.

ఇండో-పాక్ సిరీస్‌కు మేం సిద్ధం

మరోసారి క్రికెట్ ఆస్ట్రేలియా ఆసక్తి

న్యూఢిల్లీ: భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌కు ఆతిథ్యమిచ్చేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) మరోసారి ఆసక్తిని ప్రదర్శించింది. ఈ మేరకు ఇరుదేశాల క్రికెట్ బోర్డులు అనుమతిస్తే తమ దేశంలో ఇండో-పాక్ టెస్టు సిరీస్‌ను నిర్వహిస్తామని సీఏ ఆపరేషన్స్ మేనేజర్ పీటర్ రోచ్ బుధవారం వెల్లడించాడు. ఈ ఏడాది నవంబరు 22 నుంచి భారత్‌తో బోర్డర్-గవాస్కర్ సిరీస్ ట్రోఫీకి ఆతిథ్య ఆస్ట్రేలియా ఆతిథ్యమివ్వనుంది. అయితే, అదేనెల ఆరంభంలో ఆసీస్ స్వదేశంలో పాకిస్థాన్‌తో మూడు వన్డేలు, టీ20లు ఆడనుంది. ఇరుదేశాలు ఒకేనెలలో తమ దేశంలో పర్యటించనున్న నేపథ్యంలో పీటర్ రోచ్ ఇండో-పాక్ సిరీస్‌పై వ్యాఖ్యలు చేశాడు. 'భారత్, పాక్ పోరు అంటే విశ్వవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు వినోదాన్ని పంచుతుంది. ఇలాంటి ఆసక్తికర మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని ఎప్పుడూ వదులుకోం. మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ)లో ఇరు జట్ల మధ్య పోరు జరిగితే అది ఎప్పటికీ మరపురానిదిగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు' అని పీటర్ అన్నాడు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల కారణంగా 2012-13 నుంచి భారత్, పాక్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీలాంటి ఐసీసీ ఈవెంట్లలో మాత్రమే ఇరుజట్లు తలపడుతున్నాయి. 2022 టీ20 వరల్డ్‌కప్ సందర్భంగా ఎంసీజీలో జరిగిన భారత్, పాక్ మ్యాచ్‌కు దాదాపు లక్ష మంది అభిమానులు తరలివచ్చారు.

సెమీస్‌లో బోపన్న జోడీ

మియామి గార్డెన్స్ (యూఎస్ఏ): గతనెలలో ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గి జోరుమీదున్న రోహన్ బోపన్న వియామీ ఓపెన్‌లోనూ టైటిల్‌కు రెండడుగుల దూరంలో నిలిచాడు. మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్‌లో సెమీఫైనల్ చేరాడు. బుధవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్ బోపన్న/ఎబ్డెన్ జోడీ 3-6, 7-6(4), 10-7తో వెర్‌బీక్ (నెదర్లాండ్స్)/పాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది.

హార్దిక్‌ను గేలి చేస్తూ...



ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు ఉప్పల్‌లో చేదు అనుభవం ఎదురైంది. మ్యాచ్‌కు ముందు టాస్ నెగ్గిన తర్వాత కెప్టెన్ హార్దిక్ పేరు పిలవగానే.. స్టేడియంలోని అభిమానులంతా రోహిత్ రోహిత్ అని అరుస్తూ గేలి చేశారు. అయినా ఏమాత్రం అసహనానికి లోనవకుండా హార్దిక్ ప్రశాంతంగా మైదానంలోకి నడుచుకుంటూ వచ్చాడు. అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో ముంబై ఆడిన తొలి మ్యాచ్‌లోనూ హార్దిక్‌ను ఫ్యాన్స్ ఇలాగే గేలి చేశారు.

ఉప్పల్‌లో రన్ తుఫాన్

సన్‌రైజర్స్ 277/3

ఐపీఎల్‌లో అత్యధిక స్కోరుతో రికార్డు

క్లాసెన్, అభిషేక్, హెడ్ సంచలన ఇన్నింగ్స్

తిలక్, డేవిడ్ శ్రమ వృథా ఛేదనలో ముంబై 246/5

31 పరుగులతో హార్దిక్ సేన ఓటమి



క్లాసెన్ (34 బంతుల్లో 80 నాటౌట్)

హైదరాబాద్ ఆతిథ్య మిచ్చిన ఈ సీజన్ ఐపీఎల్ తొలి మ్యాచ్ ఫ్యాన్స్‌కు మస్తు కిక్కిచ్చింది..సొంత గ్రౌండ్‌లో రైజర్స్ బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు..ముంబై బౌలర్లకు చుక్కలు చూపారు..మరోవైపు ముంబై బ్యాటర్లు కూడా అయితే సిక్సర్ లేదంటే ఫోర్ అనేలా బంతిని బాదడంతో పరుగుల వరద పారింది..దాంతో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా హైదరాబాద్ కొత్త చరిత్ర లిఖించింది.. ఛేదనలో ముంబై 'భారీ'గానే మొదలుపెట్టినా కీలక తరుణాల్లో వికెట్లు తీసిన హైదరాబాద్ గెలుపు బోణీ కొట్టింది..

హైదరాబాద్ : చల్లని సాయంత్రం..ఆహ్లాదకర వాతావరణం..వేలాదిమంది అభిమానులతో కిక్కిరిసిన ఉప్పల్ స్టేడియం..దాంతో హైదరాబాద్ బ్యాటర్లలో ఉత్సాహం నిండింది. పైగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తమ మొదటి మ్యాచ్‌లో గెలుపు వాకిట బోల్తా పడడం వారిలో కసి పెంచింది. వచ్చిన బ్యాటర్లు వచ్చినట్టు ముంబై బౌలర్లను ఊచకోత కోశారు. దాంతో బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రైజర్స్ 31 పరుగులతో విజయం అందుకుంది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 277/3 స్కోరు చేసింది. క్లాసెన్ (34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లతో 80 నాటౌట్), అభిషేక్ శర్మ (23 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 63), ట్రావిస్ హెడ్ (24 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో 20 ఓవర్లలో 246/5కే పరిమితమైన ముంబై ఓడింది. తిలక్ వర్మ (34 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సర్లతో 64), టిమ్ డేవిడ్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42 నాటౌట్)రాణించారు. అభిషేక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

తలో చేయి వేసినా..: రికార్డు ఛేదనను ముంబై ధాటిగానే షురూ చేసింది. ఉనాద్కట్ వేసిన రెండో ఓవర్లో కిషన్ 4, రోహిత్ 6,6 కొట్టగా, భువనేశ్వర్ బౌలింగ్‌లో ఇషాన్ 4,6,6,6తో కదం తొక్కాడు. కానీ నాలుగో ఓవర్లో ఇషాన్ (34)ను షాబాజ్ అవుట్ చేయగా. కొద్దిసేపటికే రోహిత్ (26)ను కమిన్స్ పెవిలియన్ దారిపట్టించాడు. పవర్ ప్లేలో 66/2తో ముంబై రేసులోనే నిలిచింది. యువ ఆటగాళ్లు నమన్ ధిర్, తిలక్ భారీ షాట్లతో ఎదురు దాడికి దిగి హైదరాబాద్‌కు వణుకు పుట్టించారు. షాబాజ్ బౌలింగ్‌లో తిలక్ మూడు సిక్సర్లతో విజృంభించాడు. ఆపై అతడు హాఫ్ సెంచరీకి కూడా చేరాడు. ఓవర్‌కు 14 రన్‌రేట్‌తో దూకుడు మీదున్న ఈ జోడీలో..నమన్ (30)ను క్యాచవుట్ చేసిన ఉనాద్కట్ రైజర్స్‌కు కీలక బ్రేక్ ఇచ్చాడు. 15వ ఓవర్లో తిలక్ ఇన్నింగ్స్‌కు తెరదించి ముంబై జోరుకు కెప్టెన్ కమిన్స్ కళ్లెం వేశాడు. ఆపై ఉనాద్కట్, కమిన్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.

హైదరాబాద్ బ్యాటర్ల చెడుగుడు: నువ్వు ఫోర్ కొడితే..నేను సిక్సర్ దంచుతా..అనేలా సాగింది హైదరాబాద్ బ్యాటర్ల జోరు. ఒకరిని మించి మరొకరు రెచ్చిపోవడంతో ముంబై బౌలర్లు చేష్టలుడిగిపోయారు. 50, 100, 150, 200, 250..అలా చూస్తుండగానే రైజర్స్ స్కోరు కళ్లెంలేని గుర్రంలా పరుగెత్తింది. టాస్ కోల్పోయి బ్యాటింగ్ చేపట్టిన హైదరాబాద్‌కు ట్రావిస్ హెడ్ మెరుపు ఆరంభం ఇచ్చాడు. మొదటి మ్యాచ్‌లో తుది జట్టులో చోటు దక్కని కసితో ఉన్న హెడ్ తన సంచలన ఇన్నింగ్స్‌ను ఫోర్‌తో తెరదీశాడు. రెండో ఓవర్లోనే టిమ్ డేవిడ్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయాడు. దానిని సద్వినియోగం చేసుకున్న అతడు ఎంపాక వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్లో 22 పరుగులు రాబట్టాడు. ఐదో ఓవర్లో మయాంక్ (11)ను హార్దిక్ అవుట్ చేయడంతో 45 పరుగుల మొదటి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. మరోవైపు హెడ్..హార్దిక్ ఓవర్లోనే హ్యాట్రిక్ బౌండ్రీలతో దుమ్ము రేపాడు. వచ్చీ రావడంతో అభిషేక్ శర్మ కూడా సిక్సర్ బాదాడు. .కొట్జీ వేసిన ఈ ఆరో ఓవర్లో హెడ్ మరింత చెలరేగి 4,4తో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్క్ చేరాడు. ఈ నేపథ్యంలో తక్కువ బంతుల్లో అర్ధ శతకం చేసిన సన్‌రైజర్స్ బ్యాటర్‌గా వార్నర్ రికార్డును ట్రావిస్ బద్దలు గొట్టాడు. పవర్ ప్లే ముగిసే సరికి హైదరాబాద్ 81/1తో పటిష్ట స్థితిలో నిలిచింది. రైజర్స్ స్కోరు ఏడో ఓవర్లోనే సెంచరీని దాటింది. అయితే ఎనిమిదో ఓవర్లో హెడ్ సంచలన ఇన్నింగ్స్‌కు కొట్జీ ముగింపు పలకడంతో ముంబై కాస్త ఊరట చెందింది. కానీ అభిషేక్ శర్మతోపాటు మార్‌క్రమ్ కూడా విరుచుకుపడడంతో ముంబై మరోసారి బేజారెత్తింది. ఎంపాక బౌలింగ్‌లో 6,6తో 16 బంతుల్లోనే అభిషేక్ అర్ధ శతకం పూరించాడు. ఫలితంగా కొద్ది బంతుల క్రితమే హెడ్ నెలకొల్పిన రికార్డును అభిషేక్ తిరగ రాశాడు. కొద్దిసేపటికే అభిషేక్ ఇన్నింగ్స్‌కు పియూష్ తెరదించాడు. ఆపై మార్‌క్రమ్‌కు పించ్ హిట్టర్ క్లాసెన్ తోడవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. దీంతో 15వ ఓవర్లోనే హైదరాబాద్ స్కోరు డబుల్ సెంచరీ దాటింది. క్లాసెన్ 23 బంతుల్లో హాఫ్‌సెంచరీ చేశాడు.. బుమ్రా వేసిన 19వ ఓవర్లో, ములానీ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో క్లాసెన్ విజృంభించడంతో హైదరాబాద్ ఐపీఎల్‌లో రికార్డు స్కోరు నెలకొల్పింది.



హెడ్ (62)



తిలక్ వర్మ (64)



అభిషేక్ (63)

1 అతి తక్కువ బంతుల్లో (16) హాఫ్ సెంచరీ చేసిన హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్

ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోర్లు

స్కోరు	జట్టు	ఎప్పుడు	ఎవరిపై
277/3	హైదరాబాద్	2024	ముంబై
263/5	బెంగళూరు	2013	పుణె
256/5	లఖ్‌నవూ	2023	పంజాబ్
248/3	బెంగళూరు	2016	గుజరాత్
246/5	చెన్నై	2010	రాజస్థాన్
245/6	కోల్‌కతా	2018	పంజాబ్

523

రెండు జట్లు చేసిన రన్స్. ఐపీఎల్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి అత్యధిక స్కోరు ఇదే.

38

రెండు జట్లు కొట్టిన సిక్సర్లు. టీ20లో అత్యధిక సిక్సర్లు నమోదైన మ్యాచ్ కూడా ఇదే.

ఇదేం కెప్టెన్సీ..?

బౌలింగ్‌కు వచ్చిన ప్రతి బౌలర్‌నూ రైజర్స్ బ్యాటర్లు ఊచకోత కోస్తున్నా..13వ ఓవర్లో కానీ బుమ్రాకు రెండో ఓవర్ హార్దిక్ ఇవ్వక పోవడం గమనార్హం. ఓ పక్క ఇతర బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకుంటున్నా..తమ ప్రధాన బౌలర్‌ను అప్పటిదాకా బౌలింగ్‌కు దించకపోవడం విమర్శలకు తావిచ్చింది.

నేటి మ్యాచ్
రాజస్థాన్ x ఢిల్లీ
రాత్రి 7.30 గం. నుంచి

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: మయాంక్ (సి) డేవిడ్ (బి) హార్దిక్ 11, హెడ్ (సి) నమన్ (బి) కొట్జీ 62, అభిషేక్ (సి) నమన్ (బి) పీయూష్ 63, మార్‌క్రమ్ (నాటౌట్) 42, క్లాసెన్ (నాటౌట్) 80, **ఎక్స్‌ట్రాలు: 19; మొత్తం: 20 ఓవర్లలో 277/3; వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-161; **బౌలింగ్:** క్వెనా మఫాక 4-0-66-0, హార్దిక్ 4-0-46-1, బుమ్రా 4-0-36-0, కొట్జీ 4-0-57-1, పియూష్ చావ్లా 2-0-34-1, ములాని 2-0-33-0.

ముంబై: రోహిత్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 26, ఇషాన్ (సి) మార్‌క్రమ్ (బి) షాబాజ్ 34, నమన్ (సి) కమిన్స్ (బి) ఉనాద్కట్ 30, తిలక్ (సి) మయాంక్ (బి) కమిన్స్ 64, హార్దిక్ (సి) క్లాసెన్ (బి) ఉనాద్కట్ 24, టిమ్ డేవిడ్ (నాటౌట్) 42, షెపర్డ్ (నాటౌట్) 15, **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 20 ఓవర్లలో 246/5; వికెట్ల పతనం:** 1-56, 2-66, 3-150, 4-182, 5-224; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-53-0, ఉనాద్కట్ 4-0-47-2, షాబాజ్ 3-0-39-1, కమిన్స్ 4-0-35-2, ఉమ్రాన్ 1-0-15-0, మయాంక్ మార్కండే 4-0-52-0.

బిజినెస్

పదేళ్లలో రూ.5.3 లక్షల కోట్లు హాంఫట్

బ్యాంకులను దోచేస్తున్న కేటుగాళ్లు

మోసాల్లో 8వ స్థానంలో తెలంగాణ



ముంబై: ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా బ్యాంకు మోసగాళ్లు చెలరేగిపోతున్నారు. గత పదేళ్లలో (2013-2023) దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో 4,62,733 మోసాలు చోటు చేసుకున్నాయి. ఈ మోసాలతో బ్యాంకులు, ఖాతాదారులు రూ.5.3 లక్షల కోట్లు నష్టపోయారు. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా ఆర్‌బీఐ ఈ వివరాలు వెల్లడించింది. అడ్వాన్స్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు, డిజిటల్ లేదా ఇంటర్నెట్ బ్యాంకింగ్‌లో ఈ మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది.

అగ్రస్థానంలో మహారాష్ట్ర: బ్యాంకింగ్ మోసాల్లో ఎక్కువ భాగం మహారాష్ట్రలో నమోదవుతున్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. 2013-2023 మధ్య కాలంలో ఈ రాష్ట్రంలో 1.59 లక్షల బ్యాంకింగ్ మోసాలు చోటు చేసుకున్నాయి. బ్యాంకులు రూ.2.24 లక్షల కోట్లు నష్ట పోయాయి. ఎన్‌సీఆర్ ఢిల్లీ (56,560 కేసులు), హరియాణా (57,767), తమిళనాడు (38,792), ఉత్తర ప్రదేశ్ (30,135) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కర్ణాటక, గుజరాత్, తెలంగాణా వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో స్థానాల్లో ఉన్నట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఈ మూడు రాష్ట్రాల్లో గత పదేళ్లలో సగటున 8,000 నుంచి 12,000 బ్యాంకింగ్ మోసాలు నమోదయ్యాయి.

ఇలా మోసం చేస్తారు

బ్యాంకు సిబ్బందిలా ఫోజులు కొడుతూ మీ కేవైసీ అప్‌డేట్ చేసుకోండి, లేకపోతే మీ ఖాతా స్తంభించి పోతుందని ఫోన్ కాల్స్, ఎస్‌ఎంఎస్‌లు లేదా ఇ-మెయిల్స్ పంపిస్తారు. ఇది నమ్మి వారు పంపిన లింక్ ఓపెన్ చేసి కేవైసీ వివరాలు అప్‌డేట్ చేస్తే, ఖాతాదారుల ఖాతాల్లో ఉన్న మొత్తాన్ని క్షణాల్లో ఊడ్చేస్తారు. ఇలాంటి ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు, ఇ-మెయిల్స్ నమ్మొద్దని ఆర్‌బీఐ, బ్యాంకులు ఎంత మొత్తుకుంటున్నా ఇంకా అమాయకులైన కొంత మంది ఖాతాదారులు వీరి వలలో పడి ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు.

సనోఫి వ్యాక్సిన్ల పైడాక్టర్ రెడ్డీస్‌కు మార్కెటింగ్ హక్కులు

హైదరాబాద్: సనోఫి హెల్త్‌కేర్ ఇండియా తయారుచేసే వ్యాక్సిన్ల పంపిణీ కోసం ఆ కంపెనీతో ప్రత్యేక ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ప్రకటించింది. ఈ ఒప్పందం ప్రకారం చిన్నారులు, పెద్దల కోసం సనోఫి తయారుచేసే హెక్సాగ్జిమ్, పెంటాగ్జిమ్, టెట్రాగ్జిమ్, మెనాక్ట్రా, ఫ్లక్వాడ్రి, అడాసెల్, అవగ్జిమ్ 80యు బ్రాండ్లపై తమకు ప్రత్యేక హక్కులుంటాయని డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ బ్రాండ్ల ఉమ్మడి అమ్మకాల విలువ రూ.426 కోట్లు ఉంటుందని పేర్కొంది. ఈ పోర్ట్‌ఫోలియో జోడింపుతో వ్యాక్సిన్ల విభాగంలో తాము రెండో స్థానానికి చేరగలమని కంపెనీ సీఈఓ, బ్రాండెడ్ మార్కెట్స్ ఎంవీ రమణ తెలిపారు.

జీఓసీఎల్ భూమి విక్రయానికి ఒప్పందం

» విలువ రూ.3402 కోట్లు

హైదరాబాద్: హిందూజా గ్రూప్ కంపెనీ జీఓసీఎల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్‌లోకి కూకట్‌పల్లిలో 264.50 ఎకరాల భూమి వ్యూహాత్మక మానిటైజేషన్‌కు సంబంధించి స్క్వేర్‌స్పేస్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ ద్వారా జీఓసీఎల్‌కు రూ.3402 కోట్లు లభిస్తాయి. ఇందులో భాగంగానే 32 ఎకరాల భూమిని హిందూజా హెల్త్‌కేర్ లిమిటెడ్‌తో (హెచ్‌హెచ్‌ఎల్) కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నారు. 18 నెలల కాలంలో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ఈ ఉమ్మడి అభివృద్ధి ఒప్పందం పరిధిలోకి వచ్చే ఈ 32 ఎకరాల్లో 12.50 ఎకరాలను తక్షణం విక్రయిస్తారు. జీఓసీఎల్‌కు తొలి విడతగా లభించే రూ.520 కోట్లలో రూ.160 కోట్లు పైన పేర్కొన్న 12.50 ఎకరాల విక్రయం ద్వారా సమకూరుతుంది. మిగతా సొమ్ము దశలవారీగా అందుతుంది.

కొత్త ఏడాదిలో ఎంపీసీ సమావేశాలు

ముంబై: ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సారథ్యంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశాల షెడ్యూల్‌ను ఆర్‌బీఐ విడుదల చేసింది. తొలి సమావేశం ఏప్రిల్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరుగుతుంది. 5వ తేదీన తొలి ద్వైమాసిక పరపతి సమీక్షను ఆర్‌బీఐ ప్రకటిస్తుంది.

కొత్త ఏడాదిలో సమావేశాల షెడ్యూల్...

సమావేశాలు	తేదీలు
తొలి సమావేశం	ఏప్రిల్ 3-5
రెండో సమావేశం	జూన్ 5-7
మూడో సమావేశం	ఆగస్టు 6-8
నాలుగో సమావేశం	అక్టోబరు 7-9
ఐదో సమావేశం	డిసెంబరు 4-6
ఆరో సమావేశం	2025 ఫిబ్రవరి 5-7

కల్యాణి వివాదంలో కొత్త ట్విస్ట్

» గ్రూప్ ఆస్తుల్లో వాటా కోసం కోర్టుకెక్కిన చెల్లెలు సంతానం

ముంబై: దేశంలోని ప్రముఖ వ్యాపార సామ్రాజ్యాల్లో ఒకటైన కల్యాణి గ్రూప్ యాజమాన్య కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి తగాదా కొత్త మలుపు తీసుకుంది. కళ్యాణి గ్రూప్ చైర్మన్ బాబా కల్యాణి మేనల్లుడు సమీర్ హిరేమఠ్, మేనకోడలు పల్లవి అనిశ్ స్వాది.. గ్రూప్ ఆస్తుల్లో వాటా కోరుతూ పుణె జిల్లా, సెషన్ కోర్టును ఆశ్రయించారు. బాబా కల్యాణి చెల్లెలు సుగంధ హిరేమఠ్ సంతానమైన సమీర్, పల్లవి ఈనెల 20న న్యాయస్థానంలో దావా దాఖలు చేశారు. కల్యాణి గ్రూప్ హిందూ అవిభాజ్య కుటుంబానికి (హెచ్‌యూఎఫ్) చెందినదని, అందులో తమకూ వాటా ఉందన్నది వారి వాదన. తమ కుటుంబం 1994లో ఏర్పాటు చేసుకున్న సెటిల్‌మెంట్ ఒప్పందాన్ని అమలు చేయాలంటూ తన అన్న బాబా కల్యాణికి వ్యతిరేకంగా సుగంధ హిరేమఠ్ ఏడాది క్రితమే బొంబాయి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సెటిల్‌మెంట్ ఒప్పందం ప్రకారంగా కల్యాణి గ్రూప్‌లో భాగమైన ఫార్మా, బయోటెక్ కంపెనీ హికల్‌లో మెజారిటీ వాటా తన కుటుంబానికి బదిలీ చేయాలని సుగంధ డిమాండ్ చేశారు. తమ కుటుంబ స్థిర, చరాస్తుల మొత్తం విలువెంతో తమకే అవగాహన లేదని సమీర్, పల్లవి తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే భారత్ ఫోర్జ్ సహా గ్రూప్‌లోని 8 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.63,000 కోట్ల స్థాయిలో ఉండవచ్చని అంచనా. వాటితోపాటు పలు స్థిర, చరాస్తులు కూడా ఉన్నాయి. తమ ముత్తాత అన్నప్ప కల్యాణి, కుటుంబ ఉమ్మడి ఆస్తులు, నిధులనే వ్యాపార విస్తరణ కోసం ఉపయోగించారని కూడా వీరిద్దరు తమ దావాలో పేర్కొన్నారు. 1954లో అన్నప్ప కల్యాణి మరణానంతరం ఆయన కుమారుడు నీలకంఠ్ కల్యాణి (బాబా కల్యాణి, సుగంధ తండ్రి) కుటుంబ ఆస్తులకు కర్తగా వ్యవహరించారు. నీలకంఠ్ ఆరోగ్యం క్షీణించడంతో బాబా కల్యాణి 2011లో ఈ బాధ్యతలు తీసుకున్నారు. బాబా కల్యాణి అనుచిత వైఖరే తమ ఉమ్మడి కుటుంబంలో అభిప్రాయభేదాలు, కోర్టు వివాదాలకు కారణమని వారన్నారు.

మార్కెట్లో పుల్ బ్యాక్ ర్యాలీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ బుధవారం పుల్‌బ్యాక్ ర్యాలీతో లాభాల బాట పట్టింది. సెన్సెక్స్ 526.01 పాయింట్ల లాభంతో 72,996.31 వద్ద ముగియగా నిఫ్టీ 118.95 పాయింట్ల లాభంతో 22,123.65 వద్ద క్లోజయింది. బ్యాంకింగ్, ఆటో, ఎనర్జీ, ఆయిల్ కంపెనీల షేర్లు ఈ పుల్‌బ్యాక్ ర్యాలీకి దోహదం చేశాయి. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 18 షేర్లు లాభాల్లో ముగిశాయి. లాభాల స్వీకరణ అమ్మకాలతో ఎఫ్ఎంసీజీ, ఐటీ కంపెనీల షేర్లు నష్టపోయాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ భారత జీడీపీ బాగుంటుందన్న అంచనాలు, ఎఫ్‌పీఐల కొనుగోళ్లు బుధవారం పుల్‌బ్యాక్ ర్యాలీకి ప్రధానంగా దోహదం చేశాయి. వచ్చే వారం జరిగే ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ ఫలితాల కోసం మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోంది.

నేటి నుంచి టీ+0 సెటిల్‌మెంట్

» ముందుగా 25 కంపెనీల షేర్లలో...

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్‌లో గురువారం నుంచి మరో విప్లవాత్మక మార్పు చోటు చేసుకోనుంది. 25 కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్ ప్రారంభం కానుంది. అంటే ఈ కంపెనీల షేర్లలో జరిగే అమ్మకం, కొనుగోళ్ళు, నగదు చెల్లింపు అదే రోజు పూర్తవుతాయి. అయితే ఈ కంపెనీల షేర్లలో టీ+0 సెటిల్‌మెంట్ ఐచ్ఛికమని (ఆప్షనల్) సెబీ స్పష్టం చేసింది. ఈ ప్రయోగం సఫలమైతే మరిన్ని కంపెనీల షేర్లను టీ+0 సెటిల్‌మెంట్‌లోకి తీసుకు రావాలని సెబీ భావిస్తోంది.

ఐచ్ఛికంగా టీ+0 సెటిల్‌మెంట్ అనుమతించే షేర్లివే

అంబుజా సిమెంట్, అశోక్ లేలాండ్, బజాజ్ ఆటో, బ్యాంక్ ఆఫ్ బరోడా, బీపీసీఎల్, బిర్లా సాఫ్ట్, సిప్లా, కోఫోర్జ్, దివీస్ ల్యాబ్స్, హిండాల్కో ఇండస్ట్రీస్, ఇండియన్ హోటల్స్, జేఎస్‌డబ్ల్యు స్టీల్, ఎల్‌ఐసీ హౌసింగ్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, ఎంఆర్ఎఫ్, నెస్లే ఇండియా, ఎన్ఎండీసీ, ఓఎన్‌జీసీ, పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ, సంవర్థన్ మదర్సన్, ఎస్‌బీఐ, టాటా కమ్యూనికేషన్స్, ట్రెంట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వేదాంత.

ఇళ్ల ధరలు భగ్గు

7 నగరాల్లో 10-32% పెంపు

హైదరాబాద్‌లో 38% పెరిగిన అమ్మకాలు



న్యూఢిల్లీ: దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో జనవరి-మార్చి త్రైమాసికంలో ఇళ్ల ధరలు భగ్గుమన్నాయి. గత ఏడాదితో పోల్చితే వివిధ నగరాల్లో ఇళ్ల ధరలు 10 నుంచి 32 శాతం మేరకు పెరిగాయి. అయినా ఇళ్ల డిమాండు బాగా పెరిగింది. కోటిన్నర, ఆ పైబడిన ధరలో ఇళ్లకు డిమాండు అధికంగా ఉంది. రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ అనరాక్ ఈ వివరాలు ప్రకటించింది. ఆ వివరాల ప్రకారం హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు 38 శాతం పెరిగి 19,660గా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంలో 14,280 యూనిట్లు అమ్ముడుపోయాయి. ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం (ఎంఎంఆర్), పుణె, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ ఎన్‌సీఆర్, చెన్నై, కోల్కతా నగరాల్లో ప్రాపర్టీ విక్రయాలు, ధరలను అనరాక్ ట్రాక్ చేస్తుంది. ఈ ఏడు నగరాల్లో కలిపి అమ్మకాలు సగటున 14 శాతం పెరిగి 1,13,775 యూనిట్ల నుంచి 1,30,170 యూనిట్లుగా నమోదయ్యాయి. జనవరి-మార్చి త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు దశాబ్ది గరిష్ఠ స్థాయిలో జరిగాయని అనరాక్ చైర్మన్ అనుజ్ పురి చెప్పారు.

ఎస్‌బీఐ డెబిట్ కార్డు చార్జీల పెంపు

» ఏప్రిల్ 1 నుంచి అమలు

న్యూఢిల్లీ: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) డెబిట్ కార్డు వార్షిక నిర్వహణ చార్జీలను పెంచింది. బ్యాంక్ వెబ్‌సైట్ ప్రకారం.. పెరిగిన చార్జీలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. క్లాసిక్, సిల్వర్, గ్లోబల్, కాంటాక్ట్‌లెస్ డెబిట్ కార్డుల వార్షిక నిర్వహణ రుసుము రూ.125 నుంచి రూ.200కి పెరగనుంది. యువ, గోల్డ్, కాంబో డెబిట్ కార్డు, మై కార్డ్‌పై చార్జీని రూ.175 నుంచి రూ.250కి పెంచింది. ప్లాటినమ్ డెబిట్ కార్డ్ చార్జీ రూ.250 నుంచి రూ.325కు. ప్రైడ్ ప్లాటినమ్ బిజినెస్ డెబిట్ కార్డు రుసుము రూ.350 నుంచి రూ.425కు చేరుకోనుంది. ఈ వార్షిక చార్జీలన్నింటిపై 18 శాతం జీఎస్‌టీ అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. అంతేకాదు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల విభాగంలోనూ కొన్ని మార్పులు తీసుకొచ్చింది. కొన్ని విభాగాల క్రెడిట్ కార్డుల ద్వారా అద్దె చెల్లింపులకు వచ్చేనెల 1 నుంచి రివార్డు పాయింట్లు లభించబోవని బ్యాంక్ స్పష్టం చేసింది.

డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సైయెంట్ భాగస్వామ్యం

హైదరాబాద్: ఏరోస్పేస్ రంగానికి ఇన్నోవేటివ్ సొల్యూషన్లు అందించే హైదరాబాద్‌కు చెందిన సైయెంట్ జర్మనీకి కంపెనీ డాయిష్ ఎయిర్‌క్రాఫ్ట్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద 40 సీట్ల సామర్థ్యం గల డీ 328ఈసీఓ రీజినల్ టర్బోప్రాప్ విమానం వెనుక భాగం డిజైనింగ్‌లో రెండు కంపెనీలు సహకరించుకుంటాయని సైయెంట్ తెలిపింది. డార్నియర్ 328 విమానానికి అప్‌గ్రేడెడ్ వెర్షన్ కావడం వల్ల అందుకు అనుగుణంగా విమానం ప్రధాన బాడీని డిజైన్ చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,930 ▲	61,350 ▲	80,200 ▼
ముంబై	66,830 ▲	61,220 ▲	74,000 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ		విజయవాడ	400
హైదరాబాద్	375	విశాఖపట్నం	415
28వ తేదీ		వరంగల్	377
చిత్తూరు	458		
గోదావరి	400	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	గోదావరి	119
వరంగల్	120	విజయవాడ	119
కరీంనగర్	120	గుంటూరు	120
మహబూబ్‌నగర్	120	ఒంగోలు	120
కర్నూలు	121	చిత్తూరు	133
విశాఖపట్నం	117		

మెదక్ టికెట్‌ను వంద కోట్లకు అమ్ముకున్నారు

- బీఆర్‌ఎస్‌పై రఘునందన్‌రావు ఆరోపణలు
- హరీశ్ కాంగ్రెస్‌లో చేరతారంటూ జోస్యం

సంగారెడ్డి అర్బన్, మార్చి 27: మెదక్ ఎంపీ టికెట్‌ను బీఆర్‌ఎస్ వంద కోట్లకు అమ్ముకున్నదని బీజేపీ నేత రఘునందన్‌రావు ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ నుంచి పోటీచేస్తున్న రఘునందన్‌రావు సంగారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ పట్టణ, మండల, బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలతో బుధవారం సమావేశంఅయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గతంలో రూ.100 కోట్లు వెచ్చించి రింగ్‌రోడ్డు చుట్టూ పదెకరాలు కొనుగోలు చేశారన్నారు. ఆ భూములను కేసీఆర్, హరీశ్‌రావు, ఇతర ఎమ్మెల్యేలకు ఇచ్చి వెంకట్రామిరెడ్డి ఎంపీ టికెట్ కొనుగోలు చేశారని ఆరోపించారు. ఎంపీ టికెట్ ఇచ్చేందుకు వెంకట్రామిరెడ్డి తప్ప మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్‌కు నేతలే లేరా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన బీరయ్యయాదవ్, తెలంగాణ ఉద్యమం కోసం తన ఆరేళ్ల ఎమ్మెల్సీ పదవిని త్యాగం చేసిన ఆర్.సత్యనారాయణకు ఎంపీ టికెట్ ఇవ్వడం చేతగాని దద్దమ్మలు కేసీఆర్, హరీశ్‌రావు అని విమర్శించారు. మెదక్ జిల్లాపై హరీశ్‌రావు పెత్తనం మానుకోవాలని, దమ్ముంటే కరీంనగర్‌లో పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఆత్మరక్షణ కోసం హరీశ్‌రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరతారని తెలిపారు. పటాన్‌చెరులో అక్రమ మైనింగ్‌కు పాల్పడిన హరీశ్ త్వరలో జైలుకెళ్లడం ఖాయమన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే మద్దతు

- జాతీయ బీసీ దళ్, అనుబంధ సంఘాలు

హైదరాబాద్, మార్చి27(ఆంధ్రజ్యోతి): బీసీల అభివృద్ధికి సహకరించే పార్టీలకే తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దండ్రు కుమార స్వామి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలకు అండగా ఉంటున్న కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. జాతీయ బీసీ దళ్, అనుబంధ సంఘాల నేతలు బుధవారం ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా బీసీల మద్దతు కాంగ్రెస్‌కే ఉంటుందని లేఖను అందజేశారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోపే బీసీ కులాలకు 17 కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానిదేనని వారు పేర్కొన్నారు.

ముందస్తు ప్రవేశాలు చేపడుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోండి: ఏఐఎస్ఎఫ్

రాష్ట్రంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇంటర్ ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి శృతిఓజాకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్టలక్ష్మణ్ వినతి పత్రం అందజేశారు. ఇంటర్ బోర్డు నిబంధనలను పట్టించుకోకుండా కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు ప్రవేశాలు, వేసవి తరగతులను నిర్వహిస్తున్నాయని అందులో పేర్కొన్నారు.

తెలంగాణ ఆస్తి హస్తినకు ధారాదత్తం

- ముఠాగా మారి దోచుకుంటున్న సీఎం, మంత్రులు:బీఆర్‌ఎస్

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి వందరోజులైనా ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. సీఎం, మంత్రులు దొంగల ముఠాగా ఏర్పడి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. కాంగ్రెస్ నేతలు తెలంగాణ ఆస్తిని హస్తినకు ధారాదత్తం చేస్తున్నారు" అని బీఆర్‌ఎస్ నేతలు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. కాళేశ్వరంపై విచారణ, ఫోన్ ట్యాపింగ్ అంటూ కాలక్షేపం చేయడం తప్ప ప్రభుత్వం ఏమీ చేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో కరువొచ్చిందని, 170 మండలాల్లోని 20లక్షల ఎకరాల్లో పంట ఎండిపోయిందని ఆరోపించారు. ఇదే విషయాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం దృష్టికి తెస్తే వాస్తవాలు తెలుసుకోకుండా మంత్రి జూపల్లి కృష్ణారావు అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. హరీశ్‌రావు ప్రజల పక్షానే ఉంటారని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు.

పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మీడియాలో ఎందుకు మాట్లాడారు?

- బక్క జడ్సన్‌కు టీపీసీసీ షోకాజ్ నోటీసు

కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలు, కార్యక్రమాలతోపాటు సీఎం రేవంత్‌రెడ్డిని వ్యతిరేకిస్తూ మీడియాలో ప్రకటనలు చేసినందుకుగాను పార్టీ సీనియర్ నేత బక్క జడ్సన్‌కు టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఇలా విమర్శలు చేయడం పార్టీ వ్యతిరేక చర్యల కిందకు వస్తుందని, దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆ నోటీసులో పేర్కొంది. వివరణ ఇవ్వని పక్షంలో పార్టీ నిబంధనలను అనుసరించి క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నేటి నుంచి బీజేపీ సమన్వయ సమావేశాలు

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు నియోజకవర్గాలవారీగా బీజేపీ సమన్వయ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. నాలుగు రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా... చేవెళ్ల, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సెగ్మెంట్ల కేంద్ర మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహిస్తారు. మల్కాజ్‌గిరి, నల్గొండ నియోజకవర్గాలను ఎంపీ కె లక్ష్మణ్... నాగర్‌కర్నూలు, హైదరాబాద్ సెగ్మెంట్లకు పార్టీ జాతీయ సహ సంస్థాగత కార్యదర్శి శివప్రకాశ్ అదేవిధంగా పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ ఖమ్మం, జహీరాబాద్, మహబూబాబాద్, వరంగల్... రాష్ట్ర ఇన్‌చార్జీలు తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్‌లు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, భువనగిరి, మెదక్, సికింద్రాబాద్ పార్లమెంటు సెగ్మెంట్ల సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్ స్థాయిలో నిర్వహించాల్సిన ప్రచార కార్యక్రమాలపై ఈ సమావేశాల్లో చర్చిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

బిహార్, మహారాష్ట్ర బరిలో మజ్లిస్

- బిహార్‌లో 11, మహారాష్ట్రలో 5 లోక్‌సభ స్థానాల నుంచి పోటీ

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ పార్టీ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బిహార్ నుంచి కనీసం 11 స్థానాలు, మహారాష్ట్రలో 5 సీట్లలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే బిహార్ నుంచి 20 స్థానాల్లో పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాం పార్టీ కేంద్ర కార్యాలయం దారుస్సలాంకు నివేదించారు. వీరిలో పదిమందికి పైగా ముస్లిమేతర అభ్యర్థులుండడం విశేషం. పార్టీ పరిశీలకుల బృందం బిహార్‌లో పర్యటించి ప్రధానంగా దర్భంగా, భాగల్‌పూర్, కరకట్, బక్సర్, గయ, ముజఫర్‌పూర్, ఉజియార్‌పూర్‌తో పాటు సీమాంచల్‌లోని పూర్నియా, కతిహార్, అరారియా, కిషన్‌గంజ్ లోకసభ స్థానాల్లో మజ్లిస్ పార్టీకి గెలుపు అవకాశాలున్నట్టు నివేదిక సమర్పించినట్టు తెలిసింది. కిషన్‌గంజ్ నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పార్టీ బిహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాం పోటీ చేస్తారు. ఇక మహారాష్ట్రలో అయిదు లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేయడానికి మజ్లిస్ రంగం సిద్ధం చేసుకుంటోంది. ఔరంగాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఆ పార్టీ మహారాష్ట్ర అధ్యక్షుడు ఇంతియాజ్ జలీల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయనతోపాటు ఈ ఎన్నికల్లో ఉత్తర ముంబై, ధూలే, నాందేడ్, బివాండి స్థానాల నుంచి అభ్యర్థులను బరిలో దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు మహారాష్ట్ర మజ్లిస్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ అబ్దుల్ గఫార్ ఖాద్రీ ప్రకటించారు. ఇక హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేయనున్నారు. సికింద్రాబాద్‌తో పాటు ముస్లిం మైనారిటీ వర్గాల ఓట్లున్న నియోజకవర్గాల నుంచి అభ్యర్థులను పోటీకి దించాలని మొదట ప్రతిపాదించినా చివరకు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కావాలని నిర్ణయించినట్టు తెలిసింది. కర్నాటకలోనూ అయిదారు స్థానాల నుంచి పోటీ చేయడానికి ఆ రాష్ట్రంలోని మజ్లిస్ నేతలు అధిష్టానంపై ఒత్తిడి పెంచినట్టు తెలిసింది. రంజాన్ ఉపవాస దీక్షల అనంతరం కర్నాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ తదితర రాష్ట్రాల్లో పోటీ చేసే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మజ్లిస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

బీఆర్‌ఎస్ ఉనికి లేకుండా చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి

మేడ్చల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ ఉనికి లేకుండా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ సమక్షంలో బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. నగరంలోని రేవంత్‌రెడ్డి నివాసంలో వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్, కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీలకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉనికి లేకుండా చేయాలన్నారు. ప్రజాభీష్టంతో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలన పట్ల ఆకర్షితులై నేడు బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గంలో టీడీపీ నుంచి పోటీ చేసిన కృష్ణ ప్రసాద్, తెలంగాణ కమ్మసంఘం నాయకులు బి.రవి శంకర్, ఆరికెపూడి ప్రసాద్, బోడు వెంకటేశ్ యాదవ్, కుత్బుల్లాపూర్ మాజీ కార్పొరేటర్లు శాలిని, పావని రెడ్డి, రమణారెడ్డి, మాజీ ఎంపీపీ దేవేందర్ రెడ్డి, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు పార్టీలో చేరగా రేవంత్ వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

రేవంత్.. దమ్ముంటే రా!

ఇద్దరం మల్కాజిగిరి నుంచి పోటీ చేద్దాం.. సీఎం పదవిలో ఉండీ.. రేవంత్‌కు భయం

- ఆయన పిరికోడు.. సవాల్ స్వీకరించడు
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి స్వార్థపరుడు
- కవిత తన సోదరి అంటూనే.. ఆమె అరెస్ట్ అయినరోజే పార్టీ మారాడు
- పదేళ్ల నిజం బీఆర్‌ఎస్ పార్టీ.. 100రోజుల అబద్ధం కాంగ్రెస్: కేటీఆర్



మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, రంగారెడ్డి అర్బన్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): "ఇప్పటికైనా సరే.. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే సీఎం పదవికి రాజీనామా చేసి మల్కాజిగిరిలో పోటీకి రావాలి. ఆయన వస్తే మా అభ్యర్థిని బతిమాలి నేను పోటీలో నిలబడతా" ..అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు సవాల్ చేశారు. సీఎం పదవిలోఉన్నా కూడా.. రేవంత్ పోటీ చేయడానికి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. "ఆయనో పిరికోడు.. మాటలు చెప్తాడు కానీ.. సవాల్ స్వీకరించే దమ్ములేదు" అని వ్యాఖ్యానించారు. బుధవారం తెలంగాణభవన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ నేతల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్.. తన సవాల్‌పై భయంతోనే రేవంత్‌రెడ్డి ఇప్పటి దాకా మాట్లాడలేదని, మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్ బలాన్ని చూసి మౌనంగా ఉన్నారని పేర్కొన్నారు. అలాగే.. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగి నరేంద్రమోదీని 'చౌకీదార్.. చోర్ హై' అంటుంటే రేవంత్‌రెడ్డి మాత్రం మోదీని 'బడే భాయ్', అదానీని 'హమారా ఫ్రెండ్' అంటున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నేతా? లేక బీజేపీ మనిషా? రాహుల్ వైపా? లేక మోదీ వైపా? చెప్పాలని నిలదీశారు. కేజ్రీవాల్ అరెస్టును రాహుల్ గాంధీ అన్యాయం అంటున్నారని.. అదే కేసులో కవిత అరెస్టును మాత్రం రేవంత్ కరెక్టే అంటున్నారని.. ఇద్దరిలో ఎవరి అభిప్రాయం సరైనదో కాంగ్రెస్ పార్టీయే చెప్పాలన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రేవంత్ బీజేపీలోకి వెళ్తారని.. తనకు అనుకూలంగా ఉన్న 30-40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పార్టీ మారేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేసినా.. బీజేపీకి లాభం జరుగుతుందన్నారు. రేవంత్‌రెడ్డికి పాలన చేతకావట్లేదని, ఆరు గ్యారంటీలు పోయి.. ఆరు గారడీలు మొదలయ్యాయని, స్కాములు, స్కీముల, ట్యాపింగ్ పేర్లతో డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. పదేళ్ల నిజం బీఆర్‌ఎస్ అయితే.. వంద రోజుల అబద్ధం కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ గురించి ఈటల రాజేందర్ మాట్లాడుతుంటే దరిద్రంగా ఉందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు రూ.14.5 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన కేంద్ర బీజేపీ సర్కారు, ప్రధాని మోదీ.. అన్నదాతలను ఎన్నడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. కాగా.. బుధవారం కేటీఆర్‌తో భేటీలో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీమంత్రి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రంజిత్ రెడ్డి ద్రోహం..

"చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి స్వార్థపరుడు. అధికారం కోసం కాంగ్రెస్‌లో చేరారు. రాజకీయంగా ఇక్కడ ఆయనకు ఎంతో ప్రాధాన్యమిచ్చాం. అయినా బీఆర్‌ఎస్‌ను వీడి ద్రోహం చేశారు" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో బీఆర్‌ఎస్ విజయానికి కార్యాచరణ ప్రణాళికపై ఆ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెలతో బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ భేటీలో ఆయన రంజిత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. కవితను తన సోదరిగా చెప్పుకొన్న రంజిత్.. ఈడీ ఆమెను అరెస్టు చేసిన రోజే నవ్వుకుంటూ, పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారని దుయ్యబట్టారు. గతంలో మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి కూడా పార్టీ కన్నా తానే ఎక్కువనుకొని వేరే పార్టీలోకి వెళితే ఫలితం ఏమైందో అందరికీ తెలుసన్నారు. ముఖ్యమంత్రి రేవంత్, రంజిత్ రెడ్డి మిలాఖత్ అయినంత మాత్రాన.. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. సొంతంగా అభ్యర్థి లేని కాంగ్రెస్.. చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ స్థానాల్లో గెలవడం అసాధ్యమన్నారు. ఎన్నికల దృష్ట్యా చేవెళ్ల నియోజకవర్గంలో ఏప్రిల్ 13న కేసీఆర్ బహిరంగ సభ ఉంటుందని కేటీఆర్ తెలిపారు. ఆ సభకు ప్రజలను భారీగా తరలించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ధరణి సమస్యల పరిష్కారానికి బ్రేక్

- ఎన్నికలయ్యే దాకా నివేదికలు పంపొద్దని అధికారులకు కలెక్టర్ల మౌఖిక ఆదేశం
- పలు జిల్లాల్లో ఆగిన ప్రక్రియ

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ధరణి సమస్యల పరిష్కారానికి మరో సారి బ్రేక్ పడింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ధరణికి సంబంధించిన దరఖాస్తులను పక్కన పెట్టాలని రెవెన్యూ అధికారులను ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశించినట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి అయ్యేంత వరకూ వాటి జోలికి వెళ్లొద్దని, సంబంధిత నివేదికలను పంపొద్దని తహసీల్దార్లు, ఆర్డీవోలకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఎన్నికల కోడ్‌కు ధరణి సమస్యల పరిష్కారానికి సంబంధం లేనప్పటికీ కలెక్టర్లు ఈ దరఖాస్తుల జోలికి వెళ్లడం లేదు. ఒకటి, రెండు జిల్లాల కలెక్టర్లు మినహా రాష్ట్ర వ్యాప్తంగా మిగతా జిల్లాల కలెక్టర్లు ధరణి సమస్యలను పూర్తిగా పట్టించుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ దరఖాస్తులు 2.46 లక్షల వరకు ఉండగా, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 1 నుంచి ప్రభుత్వం ధరణి స్పెషల్ డ్రైవ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ డ్రైవ్‌లో దాదాపు 1.10 లక్షల దరఖాస్తులను రెవెన్యూ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశాయి. రెవెన్యూ రికార్డులను పరిశీలించాయి. అప్రూవ్ లేదా రిజెక్ట్ చేస్తూ సంబంధిత కారణాలతో సమగ్ర నివేదికలను సిద్ధం చేశాయి. అయితే, మార్చి 16న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ జారీ కావడంతో స్పెషల్ డ్రైవ్‌ను మాత్రమే ఆపివేయాలని, సాధారణ సేవలు కొనసాగించాలని సీసీఎల్ఏ నవీన్‌మిత్తల్ అదే రోజున కలెక్టర్లకు మెమో జారీ చేశారు. దీన్ని అడ్డుపెట్టుకొని కొందరు కలెక్టర్లు ధరణి అర్జీలను ముట్టుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 7న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలోనూ ధరణి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అయితే, ఈ ఆదేశాలను కొన్ని జిల్లా కలెక్టర్లు బేఖాతరు చేస్తున్నట్లు తెలుస్తోంది.



హన్మన్నా.. నీకు నేనున్నా

వీహెచ్‌కు సీఎం బుజ్జగింపు

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఆశించిన రాజ్యసభ సీటుతోపాటు ఖమ్మం లోక్‌సభ టికెట్ కూడా దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు(వీహెచ్)ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా బుజ్జగించారు. వీహెచ్‌ను తన నివాసానికి బుధవారం పిలిపించుకున్న సీఎం రేవంత్ రెడ్డి.. హన్మన్నా నీకు నేనున్నా.. అంటూ భరోసా ఇచ్చారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో సీటు కోసం, ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిత్వం కోసం వీహెచ్ తీవ్రంగా ప్రయత్నించారు. రేణుకాచౌదరి, అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సీట్లు దక్కగా.. ఖమ్మం లోక్‌సభ సీటు దక్కే పరిస్థితులు కనిపించడం లేదు. అదే సమయంలో బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన దానం నాగేందర్, రంజిత్‌రెడ్డి, పట్నం సునీతామహేందర్‌రెడ్డికు టికెట్లు దక్కడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంలో పార్టీ నిర్ణయాన్ని బహిరంగంగానే తప్పుపట్టిన వీహెచ్.. తనకు సీఎం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సీఎం రేవంత్ ఆయనను ఇంటికి పిలిపించుకున్నారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్.. వీహెచ్‌ను స్వయంగా సీఎం దగ్గరికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని వీహెచ్‌కు సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.

నేడు ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్

- ఎక్స్-అఫిషియో హోదాలో ఓటు వేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే హోరాహోరీ

మహబూబ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ గురువారం జరగనుంది. ఇప్పటికే క్యాంపులకు తరలివెళ్లిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు గురువారం నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకొని వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 1,439 మంది ఓటర్లు ఉండగా, 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 2న కౌంటింగ్ జరగనుంది. ఉత్కంఠ మధ్య జరుగుతున్న ఉప ఎన్నిక కావడంతో జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కసిరెడ్డి నారాయణరెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న ఉప ఎన్నిక షెడ్యూల్ వెలువడగా.. కాంగ్రెస్ తరఫున మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ తరఫున నవీన్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. మరో స్వతంత్ర అభ్యర్థి సుదర్శన్‌గౌడ్ కూడా బరిలో ఉన్నప్పటికీ బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే హోరాహోరీ పోరు జరగనుంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో జోష్ మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీని దక్కించుకోవడం ద్వారా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు.. బీఆర్‌ఎస్ సైతం తమ పార్టీకి ఉన్న బలంతో ఎమ్మెల్సీని గెలిపించుకోవాలని ఆశిస్తోంది. రెండు పార్టీలు ఇప్పటికే తమ ప్రజాప్రతినిధులను క్యాంపులకు తరలించాయి. స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ బలం తక్కువగానే ఉన్నప్పటికీ ఇటీవల పలువురు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు హస్తం కండువా కప్పుకొన్నారు. ఈ నేపథ్యంలో భారీగా క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.



పోలింగ్ సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి గుగులోత్

పార్టీల బలాబలాలివే....

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 2021లో ఎన్నిక జరగ్గా.. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ మాత్రమే బరిలో నిలిచింది. బలం తక్కువగా ఉండడంతో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పోటీకి దూరంగా ఉంది. దీంతో ఆ ఎన్నిక ఏకగ్రీవమైంది. అప్పట్లో మొత్తం 1445 మందికి ఓటు హక్కు ఉండగా.. బీఆర్‌ఎస్‌కు 1039, కాంగ్రెస్‌కు 241, బీజేపీ, ఇతరులకు కలిపి 165 మంది సభ్యుల బలం ఉంది. అయితే, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంతమంది స్థానిక సంస్థల సభ్యులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం స్వల్పంగా పెరిగింది. ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలయ్యే సమయానికి బీఆర్‌ఎస్‌కు 925, కాంగ్రెస్‌కు 390, బీజేపీ, ఇతర పార్టీలకు కలిపి 120 మందిపైగా సభ్యుల బలం ఉందన్న అంచనాలున్నాయి. కొంతమంది సభ్యులు మరణించడం లేదా అనర్హత వేటు వేయడం వల్ల 2021 ఓట్లకు, 2024 ఓట్లకు మధ్య కొంత వ్యత్యాసం ఏర్పడింది.

నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

కోస్గి రూరల్/కొడంగల్: ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ అఫిషియో హోదాలో తన ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు గురువారం ఆయన కొడంగల్ రానున్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని పోలింగ్ కేంద్రంలో సీఎం రేవంత్ ఓటు వేయనున్నారు. ఈ కేంద్రంలో కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, జట్పీటీసీ సభ్యులు, కొడంగల్ మునిసిపల్ కౌన్సిలర్లు కలిపి మొత్తం 56 మంది ఓటు వేయనున్నారు.

భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా కిరణ్‌కుమార్‌రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

స్థానాలను పెండింగ్‌లో ఉంచింది. తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని 14 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా ప్రకటించిన 8వ జాబితాతో కలిపి ఇప్పటివరకు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా 209 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయింది. బుధవారం సాయంత్రం ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై అభ్యర్థుల ఎంపికపై చర్చించింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్, అంబికా సోనీ తదితరులు పాల్గొని 25 సీట్లలో అభ్యర్థుల ఎంపికపై చర్చించారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న 8 సీట్లపై జరిగిన చర్చలో కాం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. కాగా పెండింగ్‌లో ఉన్న మరో నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడానికి ఈ నెల 31న సీఈసీ భేటీ కానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

సామాజిక సమీకరణాల వల్లే జాప్యం!

రాష్ట్రంలో మెజారిటీ స్థానాలు గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌కు సామాజిక సమీకరణాల దృష్ట్యా అభ్యర్థుల ఖరారు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రకటించిన నాలుగు స్థానాల్లో రెండు చోట్ల రెడ్డి సామాజికవర్గానికి, ఒకచోట బీసీకి అవకాశం కల్పించింది. ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానంలో గిరిజన మహిళకు టికెట్ కేటాయించింది. అయితే ప్రతిపక్ష బీఆర్‌ఎస్ రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో ఆరు చోట్ల బీసీలను అభ్యర్థులుగా ప్రకటించింది. బీజేపీ సైతం బీసీలకు 5 టికెట్లు ఇచ్చింది. కాంగ్రెస్ మాత్రం ఇప్పటివరకు 13 అభ్యర్థులను ప్రకటించగా మూడు స్థానాలకు మాత్రమే బీసీలను అభ్యర్థులుగా నిలిపింది. దీంతో మిగతా పార్టీలు బీసీలకు పెద్ద పీట వేయగా కాంగ్రెస్ బీసీలకు తక్కువ సీట్లు కేటాయిస్తే బీసీలు దూరమవుతారని భావిస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా, ఖమ్మం స్థానానికి బీసీ అభ్యర్థిని నిలబెట్టాలనే చర్చ కాంగ్రెస్‌లో జరుగుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. లోక్‌సభ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న అభ్యర్థులు, వారి బంధువులు టికెట్ల కోసం సీఎం రేవంత్‌కు ఆయన నివాసం యమున బ్లాక్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం విమానంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం రేవంత్ తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సీఎం రేవంత్‌ను కలిసి తన తమ్ముడు ప్రసాద్ రెడ్డికి ఖమ్మం టికెట్ కేటాయించాలని కోరినట్లు తెలిసింది. ఆదిలాబాద్ టికెట్ కోసం నరేష్‌జాదవ్ టికెట్ సీఎంకు విజ్ఞప్తిచేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఓయూ విద్యార్థి ఉద్యమనేతలలో ఒక్కరైన పున్నా కైలాష్‌నేత బీసీ, ఉద్యమకారుల కోటాలో ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ సీఈసీ భేటీ ముగిసిన అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

భువనగిరి నుంచి పోటీ చేయమని రాజగోపాల్ కోరారు: యాష్కీ

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేయమని తనను కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరినా అంగీకరించలేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ తెలిపారు. ఈ మేరకు గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో బదిలీలన్నీ కేటీఆర్ కనుసన్నల్లోనే జరిగాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వందరోజుల పాలన చూసి కేటీఆర్ భయపడి పోతున్నారని ఎద్దేవా చేశారు. మద్యం కేసును తప్పుడు కేసు అని పదేపదే చెబుతున్న కవిత ఒక్కసారి కూడా తాను నేరం చేయలేదని చెప్పడం లేదని అన్నారు.

లేఅవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు షురూ

» 2 నెలల తర్వాత సమావేశమైన బిల్డింగ్ కమిటీ

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో రెండు నెలలుగా నిలిచిపోయిన లేఅవుట్, భవన నిర్మాణ అనుమతులకు ఎట్టకేలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా అత్యంత కీలకంగా వ్యవహరించిన శివబాలకృష్ణను ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ అరెస్టు చేసిన నేపథ్యంలో అనుమతుల జారీకి బ్రేక్ పడిన సంగతి తెలిసిందే. ఆయన కొంతమందికి అనుచిత లబ్ధి చేకూర్చేలా వ్యవహరించారనే ఆధారాలు వెలుగుచూడటంతో గతంలో ఇచ్చిన అనుమతుల పత్రాల పునఃసమీక్షకు ప్రభుత్వం కొంత సమయం తీసుకుంది. ఇదే సమయంలో అన్ని రకాల ఫీజులు చెల్లించిన వారికి ఇచ్చే ప్రొసీడింగ్స్ కూడా నిలిచిపోయాయి. బ్యాంకు లోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు అసౌకర్యానికి గురయ్యారు. 2000 చదరపు మీటర్లు అంతకంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్ల ప్రతిపాదనలన్నీ నిలిపివేయాలని అధికారులు అప్పట్లో మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీంతో టీఎస్-బీపాస్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్క హెచ్ఎండీఏ పరిధిలోనే సుమారు 2 వేలకు పైగా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్లు ఓ అధికారి తెలిపారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో బుధవారం బిల్డింగ్ కమిటీ సమావేశమైంది. కాగా, శివబాలకృష్ణ అరెస్టు తరువాత గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన అనుమతులను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఏ సర్వే నంబర్లలోని భూములు కేటాయించారు.. వాటిని ఎవరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు.. వారికి, ప్రభుత్వంలోని పెద్దలకు ఉన్న సంబంధం ఏంటనే అంశాలపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ప్రకృతితో రాజకీయాలు చేస్తున్నారు

» వర్షాలు పడకుంటే కాంగ్రెస్‌పై నిందలా?: మంత్రి పొన్నం

సిద్దిపేట, మార్చి 27, ఆంధ్రజ్యోతి : బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు ప్రకృతితో కూడా రాజకీయాలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. ఆయన సిద్దిపేటలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వర్షాలు పడకపోవడానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని విమర్శించడం హాస్యాస్పదం అన్నారు. 5 ఎకరాలలోపు రైతులు అందరికీ రైతుబంధు నిధులు జమ చేశామని, మిగతావారిపైనా దృష్టి పెట్టామని వివరించారు. గత ప్రభుత్వం అన్ని శాఖలకు సంబంధించి రూ.40వేల కోట్ల పైచిలుకు నిధులను చెల్లించకుండానే కాలక్షేపం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనతో రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో విజయం సాధించగలమనే ధీమా ఏర్పడిందని తెలిపారు.

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణకు సంబంధించి కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారం చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ తెలిపింది. కొత్తగా ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం లేదనే ఆరోపణలు అర్థరహితమైనవని అధికారులు చెప్పారు. ఎక్సైజ్ కానిస్టేబుళ్ల శిక్షణ షెడ్యూల్ ఖరారైందని వారు వెల్లడించారు. మొత్తం 614 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా, 555 అభ్యర్థులు ఎంపికయ్యారు. వారికి ఫిబ్రవరి 14న నియామక ఉత్తర్వులు ఇవ్వగా ఇప్పటివరకు 397 మంది జాయినింగ్ రిపోర్టు ఇచ్చారని అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారందరికీ 3 నెలల శిక్షణ, 45 రోజుల ఫీల్డ్ శిక్షణ ఉంటుందని చెప్పారు. 120 మంది అభ్యర్థులకు ఎక్సైజ్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణనిచ్చేందుకు షెడ్యూల్ ఇప్పటికే ఖరారైందన్నారు. మిగతా అభ్యర్థులను టాస్క్ ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్, ఎక్సైజ్ స్టేషన్స్, చెక్‌పోస్టుల వద్ద ఫీల్డ్ ట్రైనింగ్‌కు పంపిస్తామన్నారు. ఏప్రిల్ 1నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు.

ఏప్రిల్ 28న గురుకుల కాలేజీల ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బీసీ గురుకులాల పరిధిలో ఉన్న 255 జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 28న పరీక్ష నిర్వహించనున్నట్టు సెక్రటరీ సైదులు తెలిపారు. ఈ పరీక్షకు ఏప్రిల్ 12 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం బీసీ గురుకులాల పరిధిలో ఉన్న 6 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలు వినహా మిగిలిన 255 కళాశాలల్లో ఉన్న 21,920 సీట్లకు ప్రవేశాలను ఇవ్వనున్నట్టు తెలిపారు. 130 బాలుర కళాశాలల్లో 11,360 సీట్లు, 125 బాలికల కళాశాలల్లో 10,560 సీట్లు ఉండగా... వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాలకు బీసీ గురుకుల వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.


ఉపాధి హామీ కూలీ రేటు పెంపు

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు దినసరి కూలీ పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈమేరకు గతంలో ఉన్న ఉపాధి వేతన రేటును రూ.300కు పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రాల వారీగా పెంచిన రోజువారి వేతన రేటును ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని సూచించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో 50 లక్షల మందికిపైగా ఉపాధి కూలీలకు ప్రయోజనం దక్కనుంది.

కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలి

» 60 ఏళ్లుగా కబ్జాలో భూమి

» రికార్డుల్లో పేరు నమోదు చేయించాలని వేడుకోలు




బచ్చన్నపేట, మార్చి 27: "అరవై ఏళ్లుగా భూమిని నమ్ముకుని బతుకుతున్నా. గతంలో పని చేసిన వీఆర్వోలు నా పేరిట రికార్డు చేయమంటే రూ.4 లక్షల లంచం అడిగారు. డబ్బులు ఇవ్వకపోవటంతో పట్టించుకోలేదు. దయచేసి నా భూమిని రికార్డులో నమోదు చేయించేలా ఇక్కడి అధికారులకు ఆదేశాలు ఇవ్వండి" అంటూ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన పాకాల పోశయ్య అనే 85 ఏళ్ల రైతు సీఎం రేవంత్‌ను వేడుకున్నారు. కొన్నె గ్రామంలో సర్వే నంబర్ 161లో నాలుగు ఎకరాలు సాగు చేసుకుంటుండగా, ఇటీవల కొంతమంది ఇది తమ భూమి అంటూ కంచె వేశారని, ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆయన వాపోయారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, లంచం ఇచ్చే స్థోమత తనకు లేదని అన్నారు. విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. మరో మారు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం ఇస్తానని పోశయ్య తెలిపారు.

సాగర్ నుంచి 5 టీఎంసీలు విడుదల చేయాలి

» కృష్ణాబోర్డుకు ఏపీ లేఖ

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): నాలుగో విడతలో తాగునీటి అవసరాలకు నాగార్జునసాగర్ నుంచి 5టీఎంసీలను విడుదల చేయాలని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)ను ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈ మేరకు కుడికాలువ నిర్వహణకుగాను డ్యామ్‌పైకి తమ అధికారులను అనుమతించేందుకు సీఆర్పీఎఫ్ అధికారులకు ఆదేశాలివ్వాలని బోర్డుకు ఏపీ సర్కారు తాజాగా లేఖ రాసింది. ఉమ్మడి ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి గత అక్టోబరులో సమావేశమైన త్రిసభ్య కమిటీ సాగర్, శ్రీశైలంల నుంచి 35టీఎంసీలు తెలంగాణకు, 45టీఎంసీలు ఏపీకి కేటాయించిన విషయం తెలిసిందే. ఆ కోటాలో భాగంగా ఏప్రిల్ నెలకు సాగర్ కుడికాలువ ద్వారా 5 టీఎంసీలను విడుదల చేయాలని కోరుతూ బోర్డుకు ఏపీ లేఖ రాసింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్ 8వ తేదీ నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున నిర్దేశిత కోటా నీళ్లు పూర్తయ్యేవరకు విడుదల చేయాలని కోరింది. సాగర్ కుడి కాలువ హెడ్‌రెగ్యులేటరీ నుంచి నీటి విడుదలకు కేఆర్ఎంబీ అధికారులను నియమించాలని పేర్కొంది.

ఫోన్ ట్యాపింగ్‌లో మరో డీసీపీ

(మొదటిపేజీ తరువాయి)

సేకరించారు. శివార్లలో దందాలను ఈ డీసీపీ చూడగా.. హైదరాబాద్‌లో రాధాకిషన్‌రావు కీలకంగా వ్యహరించారని, బ్లాక్‌మెయిల్స్ ద్వారా కోట్లమేర అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని గుర్తించినట్లు తెలిసింది.



ఎస్ఐబీలో 15 మంది పాత్రధారులు

ఎస్ఐబీలో సేవలందించిన 15 మంది అధికారులు, సిబ్బందికి ఈ కేసుతో సంబంధాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. వీరంతా ఏళ్ల తరబడి ఇంటెలిజెన్స్‌లో పాతుకుపోయినట్లు తెలుస్తోంది. కొందరైతే ఎస్పీ, డీఎస్పీ స్థాయిలో పదవీ విరమణ చేసినా.. ఓఎస్డీలుగా కొనసాగారు. ట్యాపింగ్ వ్యవహారంలో వీరు కూడా కీలక పాత్రధారులు అని తెలుస్తోంది. ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశాలు, ప్రణీత్‌రావు సూచనలతో జిల్లాల్లోని వార్‌రూమ్‌లలో మకాం వేసి.. ట్యాపింగ్ వ్యవహారాలను చక్కబెట్టారని స్పష్టమవుతోంది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన మర్నాడు ప్రణీత్‌రావు కంప్యూటర్లు, హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయగా.. వాటి శకలాలను పారవేయడంలో ఈ 15 మందిలో కొందరి సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరికీ నోటీసులు జారీ చేసి, విచారించేందుకు దర్యాప్తు అధికారులు సిద్ధమవుతున్నారు. భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావుకస్టడీకి కోర్టు అనుమతినిచ్చాక.. ఒక్కొక్కరినీ విడివిడిగా.. కలిపి.. పైన పేర్కొన్న 15 మంది ముందు కూర్చోబెట్టి ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. ఆయా జిల్లాల్లో ఈ 15 మందికి సహకరించిన ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలపైనా అధికారులు దృష్టి సారించారు.

పక్క రాష్ట్రాలనూ తాకిన ట్యాపింగ్

ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పక్క రాష్ట్రాలను కూడా తాకినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. కర్ణాటక ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ముఖ్యనేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు ఇప్పటికే తేలినా.. తాజాగా ఏపీలోనూ కొందరు నాయకులను టార్గెట్‌గా చేసుకుని, వారి ఫోన్లపై నిఘా పెట్టినట్లు ప్రాథమిక విచారణలో వెలుగులోకి వచ్చింది. ఇందుకోసం తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో తాత్కాలికంగా సర్వర్ రూమ్‌లను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనూ శివారు ప్రాంతాల్లో అడ్డా వేసి.. ట్యాపింగ్‌లు చేసినట్లు సమాచారం. అయితే.. ఏపీలో ఎవరిని టార్గెట్‌గా చేసుకున్నారు? ఏ పార్టీ వారు టార్గెట్? అనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

కస్టడీ పిటిషన్‌పై నేడు తీర్పు

భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావును పోలీస్ కస్టడీకి పంజాగుట్ట పోలీసులు నాంపల్లి న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారమే వాదనలు పూర్తయ్యాయి. బుధవారం కౌంటర్ పిటిషన్ వేయాలంటూ నిందితుల తరఫు న్యాయవాదులకు కోర్టు సూచించింది. నిందితుల తరఫు న్యాయవాదులు మరో రోజు గడువు కావాలని కోరడంతో.. న్యాయమూర్తి తీర్పును గురువారానికి వాయిదా వేశారు.

మేళ్లచెర్వులో ప్రకంపనలు..

సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులోనూ ఫోన్ ట్యాపింగ్ ప్రకంపనలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ ఓ పరిశ్రమ నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ ట్యాపింగ్‌కు కేంద్రబిందువైనట్లు ఆరోపణలున్నాయి. ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేసిన అదనపు ఎస్పీ తిరుపతన్నతోపాటు.. మరో డీఎస్పీ శ్రీనివాసనాయుడు ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. అంతకు మూడ్రోజుల ముందే వీరిద్దరూ మేళ్లచెర్వుకు చేరుకున్నారు. పరిశ్రమను వ్యతిరేకిస్తున్న స్థానికులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, స్థానిక మీడియా ప్రతినిధుల ఫోన్లను వీరు ట్యాప్ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తారనుకునే వారిని ఫోన్ ట్యాపింగ్ ద్వారా ముందుగానే గుర్తించి, రాత్రికి రాత్రే అరెస్టులు చేసినట్లు ఇప్పుడు మండలంలో చర్చ జరుగుతోంది. హైదరాబాద్ అధికారులు ఇక్కడికి ఎందుకు వచ్చారని అప్పట్లోనే స్థానిక న్యాయవాది నాగార్జున నిలదీశారు. సమాచార హక్కు చట్టం కింద అప్పటి సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్‌ను వివరాలు అడిగారు. దానికి కోదాడ డీఎస్పీ ప్రకాశ్ లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. ఎలాంటి ఆందోళన జరగకుండా హైదరాబాద్ నుంచి బందోబస్తుకు అదనపు సిబ్బందిని రప్పించినట్లు తెలిపారు. అయితే.. అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుకు, సదరు పరిశ్రమ యజమానికి ఉన్న సత్సంబంధాల కారణంగానే.. ప్రజాభిప్రాయ సేకరణ సవ్యంగా సాగిందని చూపేందుకు ట్యాపింగ్‌లకు పాల్పడ్డట్లు తెలుస్తోంది.

కామారెడ్డిలో కేసీఆర్ గెలుపు కోసం..

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చీఫ్, అప్పటి సీఎం కేసీఆర్ గజ్వేల్‌తోపాటు.. కామారెడ్డి నుంచి పోటీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత సీఎం, అప్పటి విపక్ష నేత రేవంత్‌రెడ్డి కూడా కొడంగల్‌తోపాటు.. కామారెడ్డి నుంచి అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగారు. దీంతో ఇద్దరూ కామారెడ్డి నుంచి విజయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ విజయం కోసం ప్రత్యర్థుల కదలికలను తెలుసుకునేందుకు కామారెడ్డిలోని విద్యానగర్‌లో ఫోన్ ట్యాపింగ్ గ్యాంగ్ ఓ వార్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు దర్యాప్తులో స్పష్టమైంది. ఈ వార్‌రూమ్‌కు బీఆర్ఎస్‌కు చెందిన ఓ ముఖ్యనేత ఇన్‌చార్జిగా ఉండేవారని, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ అయినట్లు సమాచారం. ఈ క్రమంలోనే.. అప్పట్లో రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి, కామారెడ్డి వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ, నిజాంసాగర్ రోడ్ ప్రాంతంలో ఓ కాంగ్రెస్ నేతకు చెందిన సంస్థలపై పోలీసులు దాడులు చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు కీలక నేతల ఫోన్లను ఇక్కడి నుంచి ట్యాప్ చేశారని సమాచారం.

పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు!

ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో.. ఓ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న భవనం కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్‌లు జరిగినట్లు పలువురు బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఆ భవనం ఓ మాజీ మంత్రి బినామీకి చెందినదని తెలుస్తోంది. అప్పట్లో విపక్ష నాయకులుగా ఉన్నవారు కూడా ఒక్కొక్కరుగా తమ ఫోన్లు ట్యాప్ అయ్యాయంటూ ఫిర్యాదు చేస్తున్నారు. కామారెడ్డిలోనూ పలువురు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదులకు సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో వీటి దర్యాప్తునకు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్) ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

టీచర్లకు ప్రత్యేక టెట్ లేనట్టే..!

» దరఖాస్తుకు సర్కారు అనుమతి అక్కర్లేదు

» అప్లికేషన్లు షురూ.. వెబ్‌సైట్‌లో సమస్యలు

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించే అవకాశం లేదని తేటతెల్లమైంది. ఈ విషయంలో టీచర్ల నుంచి వచ్చిన డిమాండ్‌ను సర్కారు పెద్దగా పట్టించుకోలేదు. దీంతో పదోన్నతులు కావాలనుకునే టీచర్లు ప్రస్తుతం టెట్‌ను రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)కు సంబంధించి బుధవారం నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. రాష్ట్రంలో టెట్ నిర్వహణ కోసం మార్చి 14న నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 10 వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మొదటి రోజైన బుధవారం కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు అభ్యర్థులు చెప్పారు. ముఖ్యంగా 2016లో జరిగిన టెట్ వివరాలు వెబ్‌సైట్‌లో కనిపించడం లేదు. అలాగే 2017 జూలై 23న జరిగిన టెట్.. 2017 డిసెంబరులో జరిగినట్టు వెబ్‌సైట్‌లో కనిపిస్తోంది. దాంతో ఈ రెండు టెట్‌లలో అర్హత సాధించిన అభ్యర్థులు ప్రస్తుతం దరఖాస్తులు చేసుకోవడంలో కొంత ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా గతంలో టెట్‌లో అర్హత సాధించినా.. మెరుగైన మార్కుల కోసం మళ్లీ టెట్‌ను రాస్తారు. ఇలాంటి అభ్యర్థులు గతంలో రాసిన టెట్ వివరాలను దరఖాస్తులో పేర్కొనాలి. ఈ నేపథ్యంలో ఆప్షన్లు సరిగా లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈ ఏడాది మే 20 నుంచి జూన్ 3 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ పద్ధతిలో టెట్ నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు టెట్ రాయడానికి ముందస్తు అనుమతి పొందాల్సిన అవసరం లేదని విద్యాశాఖ కమిషనర్ బుధవారం స్పష్టత ఇచ్చారు.

పదోన్నతులకు టెట్ తప్పనిసరి..


టీచర్లకు పదోన్నతులు కల్పించేందుకు టెట్‌లో అర్హత సాధించాలన్న నిబంధనను తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. దాంతో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) నుంచి స్కూల్ అసిస్టెంట్‌కు, స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎంగా పదోన్నతి పొందాలంటే టెట్‌లో క్వాలిఫై కావడం తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ పోస్టులకు పోటీ పడే అభ్యర్థులతో పాటు ప్రభుత్వ టీచర్లు సైతం టెట్ రాయాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, అభ్యర్థుల కోసం నిర్వహించే టెట్‌లో అర్హత సాధించడం కష్టంగా ఉండటంతో తమ కోసం ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలని కొంత కాలంగా ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కానీ ఆ అభ్యర్థనను సర్కారు పట్టించుకోలేదు.

మరింత మందికి 'విదేశీ విద్యానిధి'!

» లబ్ధిదారుల సంఖ్య పెంచాలంటూ సర్కారుకు అధికారుల ప్రతిపాదనలు

» ఎన్నికల తర్వాత నిర్ణయం..

హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల పరిధిలో అమలవుతున్న 'విదేశీ విద్యానిధి' పథకం లబ్ధిదారుల సంఖ్యను పెంచేందుకు కసరత్తు జరుగుతోంది. ఏటికేడు దరఖాస్తుదారుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిభ కల విద్యార్థులు నష్టపోకుండా మరింత మందికి ఆర్థిక సాయం అందించాలనే ఉద్దేశంతో ఆయా శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. ఈ మేరకు బీసీల్లో 3,000 మంది, ఎస్సీల్లో 500 మంది, ఎస్టీల్లో 200 మందికి అవకాశం ఇవ్వాలని ప్రతిపాదనల్లో అధికారులు పేర్కొన్నారు. అయితే ఈ ప్రతిపాదనలు సమర్పించిన తరుణంలోనే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో ఎన్నికల తర్వాత ప్రభుత్వం దీనిపై నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. విదేశాల్లో విద్యనభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులకు మెరిట్ ప్రాతిపదికన రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు 2013లో అప్పటి కాంగ్రెస్ సర్కారు ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ సర్కారు కూడా ఈ పథకాన్ని కొనసాగిస్తూనే ఆర్థిక సాయాన్ని రూ.20 లక్షలకు పెంచింది.



ఢిల్లీ అపోలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జయిన సద్గురు

న్యూఢిల్లీ, మార్చి 27: మెదడుకు అత్యవసర శస్త్రచికిత్స చేసిన అనంతరం కోలుకున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త సద్గురు జగ్గి వాసుదేవ్ ఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆస్పత్రి నుంచి బుధవారం డిశ్చార్జి అయ్యారు. కొద్ది వారాలుగా ఆయనకు తీవ్రమైన తలనొప్పి వస్తుండడంతో మార్చి 17న ఈ ఆస్పత్రిలో చేరగా అత్యవసర శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భంగా అపోలో ఆస్పత్రుల గ్రూపు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి మాట్లాడుతూ... శస్త్రచికిత్స అనంతరం సద్గురు కోలుకున్నారని వైద్యులు వెల్లడించినట్లు తెలిపారు. ఈషా ఫౌండేషన్ విడుదల చేసిన ఒక ప్రకటనలో... మార్చి 15న సద్గురుకు ఎంఆర్ఐ చేసి మెదడులో తీవ్ర రక్తస్రావం అవుతున్నట్లు గుర్తించారని వెల్లడించింది. అయినా ఆయన హాజరుకావాల్సిన కార్యక్రమాలను వాయిదా వేసుకోలేదని తెలిపింది. శక్తివంతమైన నొప్పి నివారణ మందులు వేసుకొని ఇండియా టుడే కాంక్లేవ్‌లో సెషన్‌కి కూడా హాజరయ్యారని పేర్కొంది. అనంతరం మెదడులో పలుచోట్ల రక్తస్రావంతో తీవ్రమైన తలనొప్పి రావడంతో వెంటనే అపోలో ఆస్పత్రికి తరలించగా అత్యవసరంగా శస్త్రచికిత్స చేసినట్లు వెల్లడించింది. ఆయనకు శస్త్రచికిత్స చేసిన వైద్యబృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ వినీత్ సూరి మాట్లాడుతూ... సద్గురు కోలుకున్నారని, ఆయన మెదడు, ముఖ్య అవయవాల పనితీరు సాధారణ స్థితికి చేరుకున్నట్లు చెప్పారు.

మా ఫోన్లు ట్యాప్ అయ్యాయి!!

ఎన్నికలప్పుడు కొండా మురళీ ఫోన్ ట్యాప్ చేశారు: మంత్రి కొండా సురేఖ

» హైకోర్టు జడ్జీల ఫోన్లూ ట్యాప్ చేశారు: రఘునందన్‌రావు

» బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు

» ట్యాపింగ్ కేసులో కేసీఆర్ ఏ1, కేటీఆర్ ఏ2 : మధుయాష్కీగౌడ్

» కేసీఆర్, కేటీఆర్‌కు జైలు తప్పదు : యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మా ఫోన్లు ట్యాప్ అయ్యాయి అంటూ పలువురు నేతలు బుధవారం పోలీసులను ఆశ్రయించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ ఫోన్లను ట్యాప్ చేశారని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. వరంగల్‌లో క్యాంపు కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించిన మంత్రి సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన భర్త కొండా మురళీ ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని అప్పట్లోనే తమకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ట్యాపింగ్‌లో ఎర్రబెల్లి దయాకర్‌రావు పాత్ర కూడా ఉందన్నారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరున్నా వదిలేది లేదని, చట్టప్రకారం జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు. ఇక, రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారులతోపాటు హైకోర్టు జడ్జీల ఫోన్లను కూడా గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ చేశారని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావును ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డీజీపీ రవిగుప్తాను బుధవారం కలిసిన ఆయన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడారు. దుబ్బాక, మునుగోడు ఉపఎన్నికల సమయంలో తనతోపాటు తన కుటుంబసభ్యుల ఫోన్లు ట్యాపింగ్ చేశారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలు లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరిగే ప్రసక్తే లేదని చెప్పారు. ఈ కేసులో మాజీ సీఎం కేసీఆర్, దుబ్బాక ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించిన హరీశ్‌రావు, అప్పటి కలెక్టర్‌ను నిందితులుగా చేర్చాలని డీజీపీని కోరినట్టు చెప్పారు. ట్యాపింగ్ పరికరాల కొనుగోలుకు సంబంధించి అప్పటి డీజీపీ పీఏ.. విదేశాలకు వెళ్లినట్లు తనకు సమాచారం ఉందని రఘునందన్‌రావు తెలిపారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు రాజకీయనాయకులు, మహబూబ్‌నగర్‌లోని ప్రముఖుల ఫోన్ నంబర్లు ట్యాపింగ్‌కు గురయ్యాయంటూ మహబూబ్‌నగర్, రాంనగర్ కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి బుధవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



బీఆర్ఎస్ హయాంలో మాజీ మంత్రి ఆదేశాలతో అప్పటి వన్‌టౌన్ సీఐ రాజేశ్వర్‌గౌడ్ ట్యాప్ చేసి తప్పుడు కేసులు నమోదు చేసి పలువురిని వేధింపులకు గురి చేశారని ఎస్పీకి తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1గా కేసీఆర్, ఏ2గా కేటీఆర్ ఉండే అవకాశం ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న అధికారుల విచారణ పూర్తయిన తర్వాత కేసీఆర్, కేటీఆర్‌ను కూడా విచారించే అవకాశం ఉందన్నారు. అలాగే, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్, కేటీఆర్ జైలుకు వెళ్లక తప్పదని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ వ్యవహారం బయటికి వచ్చాక.. కేటీఆర్ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. శ్రవణ్ రావు, నవీన్‌రావు ఫోన్ ట్యాపింగ్‌తో వ్యక్తులను బెదిరించి రూ.వందల కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సిట్ వేసి లోతైన దర్యాప్తు చేయాలని అభిప్రాయపడ్డారు. ప్రతి జిల్లా కేంద్రంలో పోలీసులు ఓ కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఫోన్ ట్యాపింగ్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలని కోరారు.

బ్యారేజీలపై మళ్లీ అవే ప్రశ్నలు!

అధికారులకు ప్రశ్నపత్రాలు ఇచ్చిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీ

» సీడీవోకు 47, ఈఎన్‌సీకి 25, క్వాలిటీ కంట్రోల్, ఓఅండ్ఎంకు చెరో 12 ప్రశ్నలు

» అడిగిన ప్రశ్నలే మళ్లీ ఇచ్చారంటున్న అధికారులు

» లోతైన అధ్యయనం కోసమేనంటున్న మరికొందరు



హైదరాబాద్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి కారణాలు, వాటిని రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తున్న జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిపుణుల కమిటీ.. రాష్ట్ర అధికారులకు పెద్దసంఖ్యలో ప్రశ్నలను సంధించింది. రాష్ట్రంలో పర్యటన ముగించుకొని వెళ్లే సమయంలో పలు విభాగాల అధిపతులకు ప్రశ్నపత్రాలు ఇచ్చి వెళ్లింది. సరిగ్గా పర్యటన ముగిసిన రోజే వాటికి సమాధానాలివ్వాల కోరగా.. ఈ నెల 26వ తేదీ కల్లా అందిస్తామని అధికారులు నివేదించిన విషయం తెలిసిందే. కాగా, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో)కు నిపుణుల కమిటీ ఏకంగా 47 ప్రశ్నలు వేసింది. ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ (జనరల్)కి 25 ప్రశ్నలు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ఎం)కు 12 ప్రశ్నలు, క్వాలిటీ అండ్ కంట్రోల్‌కు 12 ప్రశ్నలు, హైడ్రాలజీకి ఒక ప్రశ్నతో కూడిన ప్రశ్నపత్రాలను అందజేసింది. వీరితోపాటు బ్యారేజీల నిర్మాణంలో పాల్గొన్న విభాగాల ఉద్యోగులతోపాటు నిర్మాణ సంస్థకు కూడా నిపుణుల కమిటీ ప్రశ్నలు సంధించింది. అయితే ఇప్పటికే తమను అడిగిన ప్రశ్నలతోనే మళ్లీ ప్రశ్నావళి ఇచ్చారంటూ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రాయడానికి మరో వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రెండు దఫాలుగా రాష్ట్రంలో పర్యటించిన నిపుణుల కమిటీ.. 150 మందికి పైగా అధికారులను విచారించింది. అన్ని కోణాల్లో విచారణ జరిపి.. తిరిగి వెళ్లే సమయంలో ప్రశ్నపత్రాలను అప్పగించింది. కానీ, విచారణ సందర్భంగా బ్యారేజీ కుంగుబాటుపై ఎలక్ట్రో రెసిస్టివిటీ టెస్ట్ (ఈఆర్‌టీ)తోపాటు జియో ఫిజికల్ పరీక్షల నివేదికలు కూడా అధికారులు అందించారు. ఆ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలిస్తే వాస్తవాలన్నీ వెలుగులోకి వచ్చేవని వారు పేర్కొంటున్నారు. అయితే బ్యారేజీల కుంగుబాటుపై లోతుగా అధ్యయనం చేయడంలో భాగంగానే ఈ ప్రశ్నలు వేసి ఉంటారని కొందరు అధికారులు అంటుండగా, తాత్సారంలో భాగమేనని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు సంఘటనపై నెలరోజుల్లోగా నివేదిక ఇస్తే.. మరమ్మతులు చేసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే కోరింది. అయితే ప్రశ్నలన్నింటికీ జవాబులు ఇచ్చాకే బ్యారేజీల రక్షణకు తీసుకోవాల్సిన మధ్యంతర చర్యలను సిఫారసు చేస్తామని కమిటీ పేర్కొంది. కానీ, మేడిగడ్డ బ్యారేజీకి మే నెల నుంచే వరద ఉంటుంది. ఏటా జూలైలో వరద భారీగా ఉంటుందని, ఈలోగా రక్షణ చర్యలు తీసుకోకపోతే బ్యారేజీల్లో భారీగా నష్టాలు చోటుచేసుకుంటాయనే ఆందోళనతో ప్రభుత్వం ఉంది.

దాడులు చేయడమే మైనారిటీ డిక్లరేషనా?

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ ఆగ్రహం
- చెంగిచర్ల ఘటనలో గాయపడిన వారికి పరామర్శ
- బీజేపీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట



ఉప్పల్, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చెప్పిన మైనారిటీ డిక్లరేషన్ అంటే హిందువులపై దాడులు చేయడమేనా? మహిళలు, నిండు గర్భిణి అని కూడా చూడకుండా దాడి చేసిన వాళ్లు లౌకికవాదులా? దుండుగలను వదిలేసి, ఆత్మరక్షణ కోసం అడ్డుకున్న బాధితులపై హత్యాయత్నం కేసు నమోదు చేయడమే లౌకికవాదమా?' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తూ బాధితులకు బేడీలు వేసే దుస్థితి నెలకొందన్నారు. చెంగిచర్ల ఘటనలో గాయపడిన వారి కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. ఆయన పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో ఒక్కసారిగా బీజేపీ కార్యకర్తలు బారికేడ్ల పైనుంచి దూసుకొచ్చారు. దీంతో పోలీసులు, కార్యకర్తల మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. అనంతరం పోలీసుల ఆంక్షల మధ్య కొద్దిమంది కార్యకర్తలతో కలిసి బండి సంజయ్ బాధితుల ఇండ్ల వద్దకు వెళ్లి పరామర్శించారు. బాధితులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. హోలీ సంబురాలు జరుపుకుంటున్న వారిపై చిన్నా పెద్ద మహిళలనే తేడా లేకుండా ఓ వర్గానికి చెందిన వ్యక్తులు దాడులకు తెగబడి విధ్వంసం సృష్టిస్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారని విమర్శించారు. నిండు గర్భిణిపై సైతం రాళ్లు, కర్రలతో దాడులు చేసిన వీడియోలు పోలీసులకు కనిపిస్తున్నా చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారన్నారు. నిజాం పాలనలో మహిళలను బట్టలిప్పి బతుకమ్మ ఆడించగా, కేసీఆర్ పాలనలో రజాకార్ల పాలనను చూపించగా, ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ సమయంలో ఇందిరమ్మ పాలన ఎలా ఉండేదో చూస్తున్నామని వ్యాఖ్యానించారు. బాధితులపై దాడులు చేసిన సీఐ గోవింద్ రెడ్డి, ఎస్‌ఐ అనిల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

రాబోయే 5 రోజుల్లో

ఉష్ణోగ్రతలు 3 డిగ్రీలు పెరగొచ్చు

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్/నల్లగొండ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భానుడి భగభగలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటల నుంచే వేసవి తాపం పెరుగుతుండటంతో బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. బుధవారం అదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ జిల్లా కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. ఆయా జిల్లాల్లోని పలు మండలాల్లో అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో బుధవారం 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల మేర పెరిగే అవకాశముందని హైదరాబాద్‌లోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది. జిల్లాలవారీగా చూస్తే బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



గ్రామస్థులు పాఠశాలలో నిర్బంధించిన ఉపాధ్యాయుడు

మద్యం తాగి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు

- నిర్బంధించిన గ్రామస్థులు.. సస్పెండ్ చేసిన డీఈవో

చర్ల, మార్చి 27: విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను తీర్చిదిద్ది వారికి ఆదర్శంగా నిలవాల్సిన ఓ ఉపాధ్యాయుడు తప్పతాగి పాఠశాలకు వచ్చాడు. మద్యం మత్తులో విద్యార్థులను కొట్టాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం జీపీపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో 73 మంది విద్యార్థులు చదువుకుంటుండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఓ ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, మరో ఉపాధ్యాయుడు బి. కిషన్ మద్యం తాగి విధులకు వచ్చాడు. మద్యం మత్తులో విద్యార్థులను కొడుతుండడంతో వారు తమ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. దాంతో గ్రామస్థులు పాఠశాలకు చేరుకొని కిషన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించారు. అతడు మద్యం మత్తులో ఉండడంతో పాఠశాల లోపల ఉంచి తాళాలు వేసి, విద్యాశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు జిల్లా విద్యాశాఖకు నివేదిక పంపించారు. విధుల్లో అలసత్వం వహించిన, మద్యం తాగి పాఠశాలకు వచ్చిన కిషన్‌ను డీఈవో సస్పెండ్ చేశారని చర్ల ఎంఈవో జుంకీలాల్ తెలిపారు.

జగన్ ఇలాకాలో జనం రివర్స్

- ప్రొద్దుటూరుకు వచ్చింది 30 వేలలోపే....
- వివేకాను ఎవరు చంపారో దేవుడికే తెలుసన్న జగన్



కడప, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ జనానికి దూరంగా, పరదాల చాటున తిరిగిన ఏపీ ముఖ్యమంత్రి జగన్, ఎన్నికల వేళ 'మేమంతా సిద్ధం' అంటూ 21 రోజుల బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. బుధవారం మధ్యాహ్నం 1.45కు ఇడుపులపాయ నుంచి బస్సులో బయల్దేరి వీరన్నగట్టుపల్లె మీదుగా వేంపల్లె.. అక్కణ్నుంచీ వీఎన్‌పల్లె మీదుగా వచ్చేసరికి బస్సుయాత్రలో జనం ఖాళీ అయ్యారు. ప్రొద్దుటూరు చేరుకునేసరికి.. కాన్వాయ్‌లో వాహనాలు తప్ప జనం పెద్దగా కనబడలేదు. 6.40కి జగన్ ప్రొద్దుటూరు సభా ప్రాంగణానికి వచ్చారు. అప్పటికే జనం జంప్. జగన్ ప్రసంగం ప్రారంభించిన పది నిమిషాలకే జనాలు వెళ్లిపోవడంతో బారికేడ్లు ఖాళీ అయ్యాయి. లక్షన్నర మందితో సభ అంటూ ఆర్భాటం చేసినా.. 30 వేల మందే వచ్చినట్టు నిఘావర్గాలు చెబుతున్నాయి. కాగా.. "మా చిన్నాన్నను ఎవరు చంపారో, ఎవరు చంపించారో ఆయనకు, ఆ దేవుడికి, ఈ జిల్లా ప్రజలందరికీ తెలుసు" అని అవినాశ్ రెడ్డిన తన పక్కనే పెట్టుకుని జగన్ వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు.. "నాపై బురద జల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాల ఎవరున్నారో మీ అందరికీ కనిపిస్తూనే ఉంది." అని కూడా జగన్ వ్యాఖ్యానించారు. ఇంతటి దారుణం చేస్తూ తనను దెబ్బతీసే రాజకీయం చేస్తున్నారంటే ఇది కలియుగం కాక మరేమిటని ఆశ్చర్యపడిపోయారు. ఇంతకన్నా అన్యాయం ఎక్కడన్నా ఉంటుందా అని వాపోయారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్!

కేసీఆర్ హయాంలోని చెక్కుల్లో వందలకొద్దీ గల్లంతు

బంజారాహిల్స్, హైదరాబాద్, మార్చి 27(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ హయంలో జారీ అయిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్-సీఎంఆర్ఎఫ్) చెక్కుల్లో తీవ్ర అక్రమాలు వెలుగుచూశాయి. లబ్ధిదారుల కోసం వారి ఇంటి పేర్లతో కాకుండా.. ఆ ఇంటి పేర్లలోని పొడి అక్షరంతో చెక్కులు జారీ కావడాన్ని ఆసరాగా చేసుకొని ఓ ముఠా నిధులను దోచేసింది. లబ్ధిదారుల పేర్లతో ఉన్న ఆ చెక్కులను అవే పేర్లున్న ఇతర వ్యక్తుల బ్యాంకు ఖాతాలకు మళ్లించి స్వాహా చేసింది. ఇలా ఆ ముఠా లక్షల్లో అక్రమాలకు పాల్పడింది. ముఠాలో ఐదుగురు వ్యక్తులు ఉండగా.. వారిలో నాటి మంత్రి హరీశ్ రావు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన జోగుల నరేశ్ కుమార్, అసెంబ్లీలో అటెండర్‌గా పనిచేస్తున్న బాలగోని వెంకటేశ్ ఉన్నారు. ఈ ఐదుగురికి మరింత మంది సహకరించి ఉండొచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. అనారోగ్యం బారిన పడ్డ తన భార్య పేరుతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొని, సాయం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసిన మెదక్ జిల్లా వాస్తవ్యుడైన ఓ బడుగు జీవి, చివరికి ఇటీవల సచివాలయానికి వెళ్లి వాకబు చేయగా అప్పటికే ఆమె పేరుతో రెండు చెక్కులు జారీ అయినట్లు తేలడంతో నోరెళ్లబెట్టాడు. ఇతడి తరహాలోనే సీఎం రిలీఫ్ ఫండ్ కోసం ఎదురుచూసిన వందల మంది బాధితులకు ముఠా నిర్వాకంతో తీవ్ర అన్యాయం జరిగిపోయింది. అప్పులు చేసి మరీ చికిత్సకు లక్షల్లో వెచ్చించి.. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఓ నలభై, యాభై వేలు వస్తే కొంత ఊరట లభిస్తుందని ఎదురుచూసిన వందల సంఖ్యలో రోగుల ఆశలను ఈ అక్రమార్కులు వమ్ము చేశారు.

ఎలా వెలుగుచూసింది?

జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పీర్లతండా అబెండాకు చెందిన పి. రవి నాయక్, లలితాబాయి దంపతులు రెండేళ్ల క్రితం పొలం పనుల్లో ఉండగా లలితాబాయికి పాము కరిచింది. వెంటనే ఆమెను సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స కోసం రూ.5 లక్షల దాకా ఖర్చయింది. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం కోసం రవి నాయక్ అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. నెలలు గడిచినా అతడికి ఆర్థిక సాయం అందలేదు. ఇటీవల సచివాలయానికి వెళ్లి వాకబు చేయగా గత



జోగుల నరేశ్ కుమార్



కొర్లపాటి వంశీ

ప్రభుత్వం లలితాబాయి పేరు మీద మొత్తం రూ. 87,500 విలువ చేసే రెండు చెక్కులను విడుదల చేసినట్లు తెలిసింది. ఆ చెక్కులను హరీశ్‌రావు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసే జోగుల నరేశ్ కుమార్ తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై బాధితుడు రవి నాయక్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎన్నికల కోడ్ తర్వాతే అక్రమాలకు

దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నరేశ్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో అనేక విషయాలు వెలుగుచూశాయి. నరేశ్, బాలగోని వెంకటేశ్, ఖమ్మానికి చెందిన కొర్లపాటి వంశీ, గోదావరిఖనికి చెందిన పులిపాక ఓంకార్, స్వరూప ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా కలిసి నిరుడు అసెంబ్లీ ఎన్నికలకు కోడ్ వచ్చాక 300 సీఎంఆర్ఎఫ్ చెక్కులను దొంగిలించారు. చెక్కులపై లబ్ధిదారుల ఇంటి పేరు పొడి అక్షరంతో ఉండటాన్ని తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఉదాహరణకు.. టి. ఎల్లయ్య పేరుతో చెక్కు జారీ అయితే.. అదే పొడి అక్షరంతో ఇంటి పేరున్న ఎల్లయ్య అనే మరో వ్యక్తిని వెతికిపట్టుకొని అతడి ద్వారా చెక్కు విడిపించుకుంటారన్న మాట! ఇందుకు సదరు నకిలీ వ్యక్తి చేతిలో వెయ్యో, రెండు వేలో పెట్టి.. మిగతా సొమ్మును జేబులో వేసుకోవాలనేది ఐదుగురి ప్రణాళిక! ఇందుకు ఐదుగురు కలిసి ప్రత్యేకంగా కృష్ణానగర్‌లో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. 300 చెక్కుల్లోంచి 19 చెక్కుల ద్వారా రూ.10.5 లక్షలను తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. ఈ ప్రక్రియ అంతా ఎన్నికల కోడ్ నుంచి పోలింగ్ ముగిసేదాకా జరిగింది. అయితే మిగతా 281 చెక్కులను కాల్చి వేశారు. కొత్త ప్రభుత్వం రావడంతో దొరికిపోతామనే భయంతోనే వారు ఈ పనిచేసినట్లు తెలుస్తోంది. ఈ 300 చెక్కులే కాకుండా అంతకుముందు కూడా వీరు సీఎంఆర్ఎఫ్ చెక్కులను దొంగలించారని పోలీసులు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఎన్ని చెక్కులు గోల్‌మాల్ అయ్యాయి? ఇందులో తెర వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పైగా లబ్ధిదారులకు జారీ అయిన చెక్కులు ఇంటి పేరుతో కాకుండా పొడి అక్షరంతో సరిపెట్టడంతో ఈ చెక్కుల గోల్‌మాల్‌లో ఉన్నతాధికారుల పాత్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అప్పట్లోనే నరేశ్‌పై హరీశ్ కార్యాలయం ఫిర్యాదు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల గోల్‌మాల్ ఘటన నేపథ్యంలో హరీశ్ రావు కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. హరీశ్ వద్ద నరేశ్ పీఏగా పనిచేసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే నరేశ్, హరీశ్ రావుకు పీఏ కాదని, అతడు తాత్కాలిక పద్ధతిన కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసినట్లు కార్యాలయం పేర్కొంది. ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రిగా పదవీ కాలం పూర్తయ్యాక నిరుడు డిసెంబరు 6న మంత్రి కార్యాలయాన్ని మూసేసి సిబ్బందిని పంపించి వేసినట్లు వెల్లడించింది. ఆ రోజు నుంచి నరేశ్ అనే వ్యక్తితో హరీశ్‌రావు కార్యాలయానికి ఎటువంటి సంబంధం లేదని పేర్కొంది. అయితే మంత్రి కార్యాలయాన్ని మూసివేసే క్రమంలో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కొన్ని సీఎంఆర్ఎఫ్ చెక్కులను నరేశ్ తన వెంట తీసుకువెళ్లినట్లు తమ దృష్టికి వచ్చిందని ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై తమ కార్యాలయం స్పందించి, నరేశ్‌పై 2023 డిసెంబరు 17న నార్సింగి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, చట్ట ప్రకారం, చర్యలు తీసుకోవాలని కోరినట్లు ప్రకటనలో వెల్లడించింది. తమపై తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఆ వ్యక్తితో హరీశ్‌రావుకు గానీ, కార్యాలయానికి గానీ ఏ సంబంధం లేదని, ఒకరు చేసిన తప్పును, మొత్తం కార్యాలయానికి ఆపాదించడం బాధాకరమని ప్రకటనలో పేర్కొన్నారు.

పత్రికల కొనుగోలుకు

ప్రజాధనమా?

- ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి జీవోలు సరికాదు
- తక్షణమే ఉపసంహరించుకోండి
- ఏపీ ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పత్రికల కొనుగోలుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారంటూ న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే ఆ జీవోను నిలిపివేయాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. సీఎం జగన్ సొంత పత్రికను కొనుగోలు చేయడానికి వలంటీర్లకు నెలకు రూ.200 చొప్పున ఇచ్చేందుకు జీవో ఇచ్చారని ఉషోదయ పబ్లికేషన్స్ ఆంధ్ర హైకోర్టులో పిటిషన్ వేసింది. అయితే ప్రభుత్వానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై ఉషోదయ పబ్లికేషన్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గతేడాది ఏప్రిల్ 17న కోర్టు విచారించి.. కేసును ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది. నిరుడు జూలై నుంచి అక్కడ విచారణ జరుగుతోంది. ఈ పిటిషన్‌పై బుధవారం ఢిల్లీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పరిపక్వ ప్రజాస్వామ్యంలో ఇలాంటి జీవోలు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించింది. ప్రజాధనంతో దినపత్రికలు కొనుగోలు చేయాలని ఆదేశాలివ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి జీవోలు ఇచ్చి సర్క్యులేషన్ పెంచుకోవాలన్న ప్రయోజనం కూడా నెరవేరలేదు కదా అని వ్యాఖ్యానించింది. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ఉత్తర్వులు జారీచేయడం సరికాదని, వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని సూచించింది. కాగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి వలంటీరుకు నెలకు రూ.200 ఇవ్వడం ద్వారా సాక్షి సర్క్యులేషన్ పెరిగిందని, అందుకే ఆడిట్ నివేదిక ఇవ్వకుండా ఆపాలని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్(ఏబీసీ)ని ఆదేశించాలని కోరుతూ ఉషోదయ పబ్లికేషన్స్ ఈ నెల 13న మరో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఆ మర్నాడు హైకోర్టు విచారణ జరిపింది. ఈ నెల 27వ తేదీ వరకు ఆడిట్ నివేదిక విడుదల చేయొద్దని.. దానిని సీల్డ్ కవర్‌లో తమకు సమర్పించాలని ఆదేశించింది. దీనిపైనా బుధవారం జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. నేటికీ పిటిషనర్‌కు చెందిన దినపత్రికే సర్క్యులేషన్‌లో మొదటి స్థానంలో ఉందని ఏబీసీ తన నివేదికలో తెలిపింది. దీంతో ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని ఉషోదయ పబ్లికేషన్స్ తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. వారు అంగీకరించడంతో.. ప్రస్తుత వివరాలు బహిరంగపరిచేందుకు ఏబీసీకి కోర్టు అనుమతి ఇచ్చింది.



బాబాయ్ హత్య కేసు

నిందితుడికి టికెటా?

- ప్రజలే అర్థం చేసుకోవాలి.. రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- ప్రజాగళం సభల్లో చంద్రబాబు

పలమనేరు/పుత్తూరు/రాయచోటి, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని మార్చడానికి ఇంకా ఏడు వారాల గడువే ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. సమయం లేదని.. ఏపీని ఇప్పుడే కాపాడుకోవాలని.. లేకపోతే ఇక అది మన చేతుల్లో ఉండదని ప్రజలనుద్దేశించి అన్నారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆయన బుధవారం చిత్తూరు జిల్లా పలమనేరు, తిరుపతి జిల్లా పుత్తూరు, అన్నమయ్య జిల్లా మదనపల్లెల్లో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. మొన్నటి దాకా పరదాల చాటున పర్యటనలు సాగించిన ముసుగువీరుడు జగన్.. ఇప్పుడు మొదటిసారిగా తాడేపల్లి ప్యాలెస్ దాటి జనాల్లోకి వచ్చాడని ఎద్దేవా చేశారు. ఇడుపులపాయలో వైఎస్ సమాధి వద్ద పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించాడని.. అయితే ఆ తండ్రికి లక్ష్మణుడిలా వెన్నంటి ఉన్న తమ్ముడు వివేకాను గొడ్డలి వేటుతో హతమార్చిన కేసులో నిందితుడైన అవినాశ్‌రెడ్డికి ఎంపీ సీటు కేటాయించాడని విమర్శించారు. ఎవరిమీదైనా ఆరోపణలు వస్తే విచారణలో అవి తొలగిపోయాక టికెట్ ఇవ్వాలని.. అయితే జగన్ సొంత బాబాయి హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి లోక్‌సభ టికెట్ కేటాయించడాన్ని ప్రజలే అర్థం చేసుకోవాలన్నారు. బాబాయిని చంపినవారెవరో చెప్పి ఓట్లు అడగాలని జగన్‌ను డిమాండ్ చేశారు. "ముఖ్యమంత్రి జగన్ వట్టి బటన్లే నొక్కుతున్నాడు. బటన్ నొక్కింది ఎంత.. ఆయన బొక్కింది ఎంతో చెప్పాలి" అని చంద్రబాబు మండిపడ్డారు.

కోర్టుల్లో మౌలిక వసతులు కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)



హైకోర్టు భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

వెళ్లే వరకు వాష్‌రూంలు ఉపయోగించలేని దుస్థితి ఉండేదన్నారు. ఇప్పటికీ కొన్ని కోర్టుల్లో ఇలాంటి మౌలిక వసతులు లేవని, ఈ పరిస్థితి మారాలన్నారు. జిల్లా కోర్టుల్లోనే కాదు.. హైకోర్టుల్లో సైతం మౌలిక సదుపాయాల కొరతపై 'సుప్రీం కోర్టు సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ప్లానింగ్ నివేదిక'లో వివరించినట్లు తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో హైకోర్టు నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ-కోర్ట్స్ ప్రాజెక్టు ఫేస్ -3 లో భాగంగా జిల్లా కోర్టుల్లో 32 ఈ-సేవా కేంద్రాలనూ ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ ఎస్వీ భట్టి, హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజేఐ సీజేఐ మాట్లాడుతూ.. నూతన హైకోర్టు నిర్మాణం తెలంగాణ చరిత్రలో కీలక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. హైకోర్టు భవనం అనేది.. ఆలోచనలు, విలువలు, హక్కులు, విధులు, బాధ్యతలతో పాటు న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబించే ప్రజా వేదిక అని పేర్కొన్నారు. 1919లో ఏడో నిజాం హయాంలో నిర్మించిన ప్రస్తుత హైకోర్టు భవనం ఇండియన్ ఆర్కిటెక్చర్‌లో పేరెన్నికగన్నదని వివరించారు. ఈ హైకోర్టు నుంచి వచ్చిన ముగ్గురు గొప్ప వ్యక్తులను దాదాపు ప్రతివారం తాను తలుచుకుంటానని, జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ చిన్నప్పరెడ్డి, జస్టిస్ జీవన్‌రెడ్డిలు దేశ న్యాయవ్యవస్థకు మార్గదర్శకులు అని కొనియాడారు. అత్యంత క్లిష్ట సమయాల్లో వారు పనిచేశారని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కోర్టుల్లోనూ మెరుగైన వసతులు కల్పించాల్సిన అవసరముందన్నారు. మనం పనిచేసే వ్యవస్థ మనం గర్వపడేలా ఉండాలని, హైకోర్టుల్లో లాయర్లకూ చాంబర్లు ఉండాలని పేర్కొన్నారు. కేవలం లాయర్లు, జడ్జిలకే కాకుండా.. కోర్టులకు వచ్చే అన్ని వర్గాలకూ మౌలిక వసతులు కల్పించాల్సి ఉందన్నారు. మహిళలకు వాష్‌రూంలు, దివ్యాంగులకు ర్యాంపులు, బాలింతలకు పాలిచ్చే సౌకర్యాలు లేకపోవడం వల్ల కోర్టుల్లో తమలాంటి వారిని పట్టించుకోరనే భావన వారిలో ఏర్పడుతుందన్నారు. కొత్త హైకోర్టు భవనం ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతుందని ఆశిస్తున్నానని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా జ్యుడీషియరీలో సామాజిక మార్పు కనిపిస్తోందని, కొత్తగా చేపట్టే నియామకాల్లో 50-60 శాతం మంది మహిళలే ఉంటున్నారని తెపారు. మెడిసిన్, లా, పొలిటికల్, ఇతర అన్ని రంగాలూ యువతతో నిండిపోతున్నాయని, వారు న్యాయవ్యవస్థ నుంచి వేగంగా ఫలితాలను ఆశిస్తున్నారని, ఆ మేరకు పనితీరు ఉండాలని సూచించారు. నూతన హైకోర్టు భవనానికి భూమి అందుబాటులోకి వచ్చేలా కృషి చేసిన హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సీజేఐ అభినందనలు తెలిపారు.

కొత్త ప్రభుత్వం రాగానే భూమి లభించింది: జస్టిస్ పీఎస్ నర్సింహ

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే నూతన హైకోర్టుకు భూమి లభించిందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ పేర్కొన్నారు. న్యాయవాదులు ఎన్‌రోల్ అయిన వెంటనే వారికి నూతన చాంబర్ అప్పగించాలనేది తన కల అని పేర్కొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ.. నూతన హైకోర్టు భవన నిర్మాణాన్ని, 32 ఈ-సేవా కేంద్రాలను సీజేఐ ప్రారంభించడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. తరతరాలు నిలిచిపోయేలా నూతన హైకోర్టు భవనం ఉంటుందని పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, అదనపు అడ్వకేట్ జనరల్, బార్ కౌన్సిల్ చైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ సునీల్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, సీఎస్, డీజీపీ, రిజిస్ట్రార్ జనరల్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు.. హైకోర్టు నూతన భవన నిర్మాణ కార్యక్రమానికి ఎలాంటి అడ్డంకులు కలగకుండా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు. విశ్వవిద్యాలయం భూముల్లో హైకోర్టు భవనం వద్దంటూ వర్సిటీ విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టిన నేపథ్యంలో.. పలువురిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

శ్రీవారి సేవలో జస్టిస్ చంద్రచూడ్

తిరుమల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం రాత్రి తిరుమలలోని రచన అతిథిగృహానికి చేరుకున్న ఆయన బుధవారం ఉదయం ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి మహద్వారం వద్దకు చేరుకున్నారు. శ్రీవారి ఆలయ అర్చకులు ఆయనకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించాక అధికారులు శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, డైరీ, క్యాలెండర్, అగరబత్తులు, పంచగవ్య ఉత్పత్తులను అందజేశారు. తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రమేష్, జార్ఖండ్ మాజీ సీఎం బాబులాల్ మరాండి తదితరులు బుధవారం ఉదయం వెంకన్నను దర్శించుకున్నారు.



శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ చంద్రచూడ్ దంపతులు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● గురువారం 28 మార్చి 2024



హైదరాబాద్ ఐఐటీలో పీజీ, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీహెచ్)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీలో ఎంఏ, ఎంటెక్, ఆన్‌లైన్ ఎంటెక్, ఎం డిజైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఎం.డిజైన్ ప్రోగ్రామ్ రెగ్యులర్, ఆన్‌లైన్ విధానాల్లో ఉంది. ఎమ్మెస్సీ మెడికల్ ఫిజిక్స్ ప్రోగ్రామ్‌ను బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్-రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఫెలోషిప్ సౌకర్యం ఉంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన మేరకు గేట్/సీడ్ వ్యాలిడ్ స్కోర్ లేదా అకడమిక్ ప్రతిభ, జేఆర్ఎఫ్ అర్హత ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రాత పరీక్ష/ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. టీచింగ్ అసిస్టెంట్‌షిప్, రీసెర్చ్ అసిస్టెంట్‌షిప్ త్రూ ప్రాజెక్ట్, సెల్ఫ్ స్పాన్సర్డ్, గవర్నమెంట్ స్పాన్సర్డ్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్ ఫర్ వర్కింగ్ ప్రొఫెషనల్స్ తదితర కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

రెగ్యులర్ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, క్లయిమేట్ ఛేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, టెక్నో ఆంత్రప్రెన్యూర్‌షిప్, క్వాంటమ్ అండ్ సాలిడ్ స్టేట్ డివైసెస్, ఎనర్జీ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఈ-వేస్ట్ రిసోర్స్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, సస్టయినబుల్ ఇంజనీరింగ్

ఆన్‌లైన్ ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: ఇంటిగ్రేటెడ్ కంప్యూటేషనల్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రిక్ వెహికిల్ టెక్నాలజీ.

ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్/ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: అడిటివ్ మాన్యుఫాక్చరింగ్, మెడికల్ డిజైన్ ఇన్నోవేషన్, స్మార్ట్ మొబిలిటీ, ఆప్తాల్మిక్ ఇంజనీరింగ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ అండ్ మైక్రో సిస్టమ్స్ ప్యాకేజింగ్, మెడికల్ ఫిజిక్స్

ఆన్‌లైన్ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు: కంప్యూటేషనల్ మెకానిక్స్, కమ్యూనికేషన్స్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ సిస్టమ్స్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ, ఇండస్ట్రియల్ మెటలర్జీ, డేటా సైన్స్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ

ఎంఏ స్పెషలైజేషన్‌లు: డెవలప్‌మెంట్ స్టడీస్, హెల్త్ జెండర్ అండ్ సొసైటీ

అర్హత వివరాలు: ఎంఏ ప్రోగ్రామ్‌నకు కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎండిజైన్ ప్రోగ్రామ్‌నకు ఇంటర్ తరవాత కనీసం 55 శాతం మార్కులతో ఇంజనీరింగ్/ఆర్కిటెక్చర్/డిజైన్/ఇంటీరియర్ డిజైన్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సీడ్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ డిజైన్(ఎన్ఐడీ/సీఈపీటీ), బీఎఫ్ఏ అభ్యర్థులూ అర్హులే. పదోతరగతి ఉత్తీర్ణత తరవాత అయిదేళ్ల జీడీ ఆర్ట్ ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు, పీజీ(ఆర్ట్స్/సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్) ఉత్తీర్ణత తోపాటు ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ/ఎంబీబీఎస్/బీడీఎస్/బీఫార్మసీ/బీవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(మేథ్స్/అప్లయిడ్ మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/మెటీరియల్ సైన్స్)/ ఎంసీఏ అభ్యర్థులూ అర్హులే. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి 9 కన్నా ఎక్కువ సీజీపీఏ; నిట్, ఐఐటీ, ఐఐఐటీ సంస్థల నుంచి 8 కన్నా ఎక్కువ సీజీపీఏతో బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎమ్మెస్సీ పూర్తిచేసిన అభ్యర్థులను గేట్ స్కోర్‌నుంచి మినహాయించారు. వీరు పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు నేరుగా అప్లయ్ చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ మెడికల్ ఫిజిక్స్‌కు ప్రథమశ్రేణి మార్కులతో బీఎస్సీ(ఫిజిక్స్) ఉత్తీర్ణత తోపాటు జామ్ 2024 స్కోర్/ఇన్‌స్పయిర్ స్కాలర్‌షిప్ అర్హత ఉండాలి.

పీహెచ్‌డీ

స్పెషలైజేషన్ విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయో మెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, క్లయిమేట్ ఛేంజ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ సైన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, లిబరల్ ఆర్ట్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, సస్టయినబులిటీ

అర్హత: ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎండీ/ఎండీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంసీఏ/ఎమ్మెస్సీ/సంబంధిత మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీఈ/బీటెక్ అభ్యర్థులూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిజైన్ విభాగానికి ఎం డిజైన్/ఎంఆర్క్/ఎంఫిల్/ఎంఎఫ్ఏ/ఎంఏ/ ఎమ్మెస్సీ/నిడ్ నుంచి పీజీ డిప్లొమా ఇన్ డిజైన్ పూర్తిచేసి ఉండాలి. గేట్/సీడ్/సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/డీబీటీ జేఆర్ఎఫ్/ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఇన్‌స్పయిర్ పరీక్షల్లో అర్హత పొందినవారికి, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/ల్యాబొరేటరీల్లో పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** పీజీ ప్రోగ్రామ్‌లకు ఏప్రిల్ 8; పీహెచ్‌డీకి ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** iith.ac.in

సీడీఎఫ్‌డీలో రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్

హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ)- 'రీసెర్చ్ స్కాలర్స్ ప్రోగ్రామ్-2'లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సులో డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్, మోడరన్ బయాలజీ సంబంధిత అంశాలపై రీసెర్చ్ వర్క్ ఉంటుంది. ఇది పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. అభ్యర్థులు కోర్సు పూర్తయ్యే వరకు క్యాంపస్‌లోనే ఉండాలి. షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వీడియో కాన్ఫరెన్స్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. కోర్సులో చేరినవారికి రీజనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ(ఆర్‌సీబీ)లో పీహెచ్‌డీ చేసే అవకాశం కల్పిస్తారు.



రీసెర్చ్ విభాగాలు
- సెల్ అండ్ మాలిక్యులర్ బయాలజీ
- కంప్యూటేషనల్ బయాలజీ
- డిసీజ్ బయాలజీ
- జెనెటిక్స్
- మాలిక్యులర్ మైక్రో బయాలజీ
- ఇమ్యూనాలజీ

అర్హత వివరాలు: సైన్స్, టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎంబీబీఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి సెమిస్టర్ పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ/ ఐసీఎంఆర్/ఇన్‌స్పయిర్/జెస్ట్/యూజీసీ-ఆర్‌జీఎన్ఎఫ్ నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌నకు అర్హత పొంది ఉండాలి. జేఆర్ఎఫ్ అర్హత లేని అభ్యర్థులను ఇంటర్వ్యూకి అనుమతించరు. ఐసీఎంఆర్ నుంచి రెండేళ్ల ఫండెడ్ ప్రాజెక్ట్ స్కీమ్ కింద జేఆర్ఎఫ్ పొందినవారు, బీటెక్(బయోటెక్నాలజీ) పూర్తిచేసి డీబీటీ జేఆర్ఎఫ్ నెట్ అర్హత ఉన్నవారు, డీబీటీ-2 కేటగిరీ కింద జేఆర్ఎఫ్ నెట్ రాసినవారు, సీఎస్ఐఆర్-యూజీసీ (నెట్) ద్వారా ఎల్ఎస్ అర్హత పొందినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 24
- **ఇంటర్వ్యూకి ఎంపిక చేసిన అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** మే 10
- **ఇంటర్వ్యూలు:** మే చివరి వారంలో
- **వెబ్‌సైట్:** www.cdfd.org.in

లిటిల్ ఫ్



పేదవాడి విందు

ఒక ఊరిలో మల్లయ్య అనే పేదవాడు ఉండేవాడు. తను కూలి పని చేసుకుని బతికేవాడు. వాస్తవానికి తనకు మూడెకరాల పొలం ఉంది. పెట్టుబడి పెట్టే స్తోమత లేక ఆ పొలాన్ని అలా వదిలేసి కూలి పనులు చేసేవాడు. ఒకసారి మంచి వానలు పడ్డాయి. అప్పు చేసి విత్తులు వేశాడు. పంట కోతకు వచ్చిన సమయంలో భారీ వర్షాలతో నష్టపోయాడు. దీంతో మళ్లీ మల్లయ్యకు కూలి పనే దక్కింది.

మల్లయ్యకు ఓ స్నేహితుడు ఉండేవాడు. అతని పేరు రంగయ్య. తన మిత్రుడు అని చూడకుండా వెటకారంగా మాట్లాడేవాడు. స్నేహితుడి పేదరికాన్ని గుర్తు చేసేవాడు. దీంతో రంగయ్య తన స్నేహితుడే కాదని మల్లయ్య తీర్మానించుకున్నాడు. రాజు అనే ఓ ధనవంతుడు ఆ ఊరిలో ఉండేవారు. ఒక రోజు మాటల్లో 'రాజుగారు ఇంట్లో విందు తిన్నాను. ఎంత అద్భుతమో' అన్నాడు మల్లయ్యతో రంగయ్య. మల్లయ్య అవేమీ పట్టించుకోలేదు. రంగయ్య ఇదే విషయాన్ని ఊరంతా చాటింపు వేసినట్లు చెప్పుకున్నాడు. ఒక రోజు మళ్లీ మల్లయ్యతో చెప్పిందే చెప్పాడు. 'అదెంత పని. ఏదో గొప్పగా చెబుతున్నావు' అన్నాడు మల్లయ్య. రంగయ్య కోప్పడ్డాడు. కోపంతో ఊగిపోతే.. 'నీ చేతనయితే రాజుగారితో కలసి భోజనం చేయి' అన్నాడు. 'అదెంత పని' అన్నాడు మల్లయ్య. 'ముందు చూపించవోయ్' అన్నాడు. వెంటనే మల్లయ్య ఇలా అన్నాడు.. 'ఒకవేళ రాజుగారితో కలసి భోజనం చేస్తే ఏమి చేస్తావు?' అన్నాడు. వెంటనే 'నీకు కాడెద్దులు తీయిస్తా' అన్నాడు రంగయ్య. అంతటితో ఊరుకోకుండా 'నువ్వు ఓడిపోతే నీ మూడెకరాల భూమి నాకు రాయించు' అన్నాడు. ఇద్దరూ సవాల్ విసురుకున్నారు.

ఒకరోజు మల్లయ్య రాజుగారి దగ్గరకు వెళ్లాడు. అసలే రాజుగారు మంచివారు, భోళాశంకరుడు. అయితే కఠినంగా ఉండేవాడు. పేదవాళ్లంటే అతనికి చిరాకు. మల్లయ్య కొత్తబట్టలతో అక్కడికి వెళ్లాడు. రాజుగారి దగ్గర ఉండే సహాయకుడు వచ్చి మల్లయ్యను లోపలికి తీసుకెళ్లాడు. 'అయ్యా.. మీతో రహస్యంగా మాట్లాడాలి' అన్నాడు మల్లయ్య 'ఇది భోజనం వేళ మళ్లీ చూద్దాం' అన్నాడు రాజుగారు. 'తక్షణమే ఓ రహస్యం చెప్పాలి' అన్నాడు. రాజుగారు లోపలకు రమ్మన్నారు. 'ఏమీ లేదు.. రాజుగారు! కడ



వంత బంగారం ముద్ద, కుండలోని వజ్రాలెంత ధర చేస్తాయి?' అనడిగాడు. రాజుగారు 'ఇలా లోపలకు వచ్చేయి. భోజనం చేసిపో' అన్నాడు. ధనవంతుడైన ఆ రాజుగారు ఇలా పిలుస్తాడని కల్లో కూడా అనుకోలేదు మల్లయ్య. పక్కన ఉండేవాళ్లు ఈ ధనవంతుడు ఇతనితో భోజనం చేయడమా? అనుకున్నారు. ఆ వార్త ఊరంతా వ్యాపించింది. ఇద్దరు కలసి విందు భోజనం చేశారు. ఆ తర్వాత ఆ ధనవంతుడు వాటి దగ్గరకు తీసుకెళ్లమన్నాడు. లేకపోతే నువ్వే తెచ్చి చూపించు అన్నాడు. 'నేను కడవంత బంగారం, కుండంత వజ్రాలు ఎంత చేస్తాయి?' అనడిగాను అన్నాడు మల్లయ్య. ఆ ధనవంతుడు కోప్పడ్డాడు. 'బుద్ధిహీనుడా' అంటూ తిట్టాడు. 'నాకు రెండు ఎద్దులు ఇచ్చే నా రంగయ్యనా? లేక విందు భోజనం చేసిన మీరా?' అనడిగారు. మల్లయ్య ఇంటికి వెళ్లిపోయాడు.

రంగయ్య ఇవ్వాల్సిన జోడెద్దులను ఇచ్చాడు. అలా మల్లయ్య చేసిన విందుకు ప్రతిఫలం దక్కింది. పేదవాడైనా తెలివైనవాడు కావటం వల్ల తన మిత్రుడి అతి చేష్టలకు కళ్లెం వేశాడు.

అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్



ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ)- అండర్ గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(యూజీఏటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా పార్టిసిపేటింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ, బీబీఏ, బీహెచ్ఎం, బీసీఏ, బీకాం(ఈ-కామర్స్), బీఎస్సీ(ఐటీ), బీఎఫ్‌టీ, బీఐటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు/ప్రస్తుతం పరీక్షలు రాసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

యూజీఏటీ 2024 వివరాలు: దీనిని పీబీటీ(పేపర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 40, న్యూమరికల్ అండ్ డేటా అనాలిసిస్ నుంచి 30, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 30, జనరల్ నాలెడ్జ్ నుంచి 30 ప్రశ్నలు ఇస్తారు. బీహెచ్ఎం కోర్సుకు నిర్వహించే ఎగ్జామ్‌లో మాత్రం పైవాటితోపాటు సర్వీస్ ఆప్టిట్యూడ్ నుంచి 25, సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. వీటికి అదనంగా గంట సమయం ఇస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉన్నాయి.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు:** రూ.750
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 9న
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** జూన్ 11 నుంచి
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **యూజీఏటీ 2024 తేదీ:** జూన్ 16
- **వెబ్‌సైట్:** aima.in

ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రవేశాలు

అమరావతిలోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం-ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 163 మోడల్ స్కూల్స్‌లో అకడమిక్ మెరిట్, రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లు ఎంచుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది, బోధన ఉచితం. ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి సమాచారం కోసం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్/జిల్లా విద్యాశాఖాధికారి/మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలి.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 22
- **దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 23
- **పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల:** మే 24
- **డీఈఓ ఎంపిక చేసిన విద్యార్థుల జాబితా విడుదల:** మే 25
- **సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** మే 27
- **తరగతుల ప్రారంభం:** జూన్ 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://apms.apcfss.in

సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో అప్రెంటిస్‌లు

బిలాస్‌పూర్ డివిజన్‌లోని సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో ఒప్పంద ప్రాతిపదికన **733** అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ట్రేడులు: కార్పెంటర్, సీఓపీఏ, డ్రాఫ్ట్‌మన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రికల్(మెకానికల్), ఫిట్టర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, మెకానికల్(ఆర్ఏసీ), ఎస్ఎండబ్ల్యూ, స్టెనో(ఇంగ్లీష్), స్టెనో(హిందీ), డీజిల్ మెకానిక్, టర్నర్ వెల్డర్, వైర్‌మన్, కెమికల్ ల్యాబొరేటరీ అసిస్టెంట్, డిజిటల్ ఫొటోగ్రాఫర్.

అర్హత: పదో తరగతి, పన్నెండో తరగతి కన్నా తక్కువ లేదా సమానమైన విద్యార్హత. తదితర ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణత ఉండాలి.

వయసు: ఏప్రిల్ 12 వరకు 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: టెన్త్, ఇంటర్ మార్కుల మెరిట్‌లిస్ట్ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ **దరఖాస్తుకు చివరితేదీ:** ఏప్రిల్ 12

వెబ్‌సైట్: https://secr.indianrailways.gov.in/

ఐఐటీ తిరుపతిలో నాన్ టీచింగ్ పోస్టులు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు
1. స్టూడెంట్ కౌన్సెలర్: 1 పోస్టు
2. హిందీ ట్రాన్స్‌లేటర్: 1 పోస్టు
3. జూనియర్ నర్సింగ్ ఆఫీసర్: 1 పోస్టు
4. జూనియర్ అసిస్టెంట్: 3 పోస్టులు
5. జూనియర్ టెక్నీషియన్: 2 పోస్టులు

అర్హత: సంబంధిత పోస్టును అనుసరించి ఇంటర్, ఐటీఐ, డిప్లొమా లేదా తత్సమానం, డిగ్రీ, బీఈ, బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్), పీజీ, జనరల్ నర్సింగ్, విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: స్టూడెంట్ కౌన్సెలర్ పోస్టుకు రూ.56,100 నుంచి రూ.1,77,550. హిందీ ట్రాన్స్‌లేటర్/జూనియర్ నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు రూ.35,400 నుంచి రూ.1,12,400. జూనియర్ అసిస్టెంట్/జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు రూ.25,500 నుంచి రూ.81,100.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: గ్రూప్-1 పోస్టులకు 500. గ్రూప్-బి పోస్టులకు రూ.300. గ్రూప్-సి పోస్టులకు రూ.200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

వెబ్‌సైట్: https://www.iittp.ac.in/

జాబ్ కార్నర్

మెడికల్ స్పెషలిస్ట్‌లు

బీసీసీఎల్‌లో

కోల్‌ఇండియా లిమిటెడ్‌కు చెందిన జార్ఖండ్‌లోని భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్(బీసీసీఎల్) **37** పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు
1. సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ4)/ మెడికల్ స్పెషలిస్ట్(ఈ3)
2. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ3)

విభాగాలు: సర్జన్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్, ఆర్థోపెడిషియన్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజిస్ట్, డెర్మటాలజిస్ట్, పల్మొలజిస్ట్/ చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మొలజిస్ట్, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియాలజిస్ట్.

అర్హత: సంబంధిత విభాగాల్లో ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు 42 ఏళ్లు, మెడికల్ స్పెషలిస్ట్/ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 35 ఏళ్లు మించరాదు.

జీతం: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.70,000 - 2,00,000. మెడికల్ స్పెషలిస్ట్/ సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టుకు రూ.60,000 - 1,80,000

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: డిప్యూటీ జీఎం/ హెచ్ఓడీ(ఈఈ), భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ దగ్గర, కల్యాణ్‌భవన్, కల్యాణ్‌నగర్, ధన్‌బాద్, జార్ఖండ్.

చివరి తేదీ: ఏప్రిల్ 11 **వెబ్‌సైట్:** www.bcclweb.in/

ఎన్‌సీఎల్‌లో

ప్రభుత్వరంగ సంస్థకు చెందిన నేషనల్ కోల్ ఇండియా లిమిటెడ్ **34** పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

పోస్టులు
1. సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్
2. మెడికల్ స్పెషలిస్ట్
3. సీనియర్ మెడికల్ ఆఫీసర్

విభాగాలు: సర్జన్, జనరల్ ఫిజీషియన్/ మెడిసిన్, జీ అండ్ ఓ, అనస్థీసిస్ట్, పీడియాట్రిషియన్, సైకియాట్రిస్ట్, పాథాలజీ, డెర్మటాలజీ, పల్మొలజిస్ట్, చెస్ట్ స్పెషలిస్ట్, ఆప్తాల్మొలజిస్ట్, ఈఎన్‌టీ, రేడియాలజిస్ట్, జీడీఎంఓ, డెంటిస్ట్.

జీతం: సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టుకు రూ.70,000 - 2,00,000. మెడికల్ స్పెషలిస్ట్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు రూ.60,000 - 1,80,000

అర్హత: జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్ అండ్ పల్మనరీ మెడిసిన్. ఎంబీబీఎస్, పీజీ, బీడీఎస్ ఉత్తీర్ణత.

వయసు: పోస్టును అనుసరించి 2024 జనవరి 31 వరకు 35-42 ఏళ్లు మించరాదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 11

స్పీడ్‌పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా: ఆఫీస్ ఆఫ్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రిక్రూట్‌మెంట్ డిపార్ట్‌మెంట్, ఎన్‌సీఎల్ హెచ్‌క్యూ, సంగ్రౌలీ(మధ్యప్రదేశ్).

వెబ్‌సైట్: https://www.nclcil.in/

ఈసీఐఎల్, హైదరాబాద్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ దేశవ్యాప్తంగా ఈసీఐఎల్ ప్రాజెక్టు పనుల్లో 30 గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఏప్రిల్ 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

విభాగాల వారీగా ఖాళీలు: ఈసీఈ 5, ఈఈఈ 7, మెకానికల్ 13, సీఎస్ఈ 5.

అర్హత: సంబంధిత విభాగంలో మొదటిశ్రేణిలో ఇంజనీరింగ్ డిగ్రీ/ పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2024 ఏప్రిల్ 13 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు.

జీతం: నెలకు రూ.40,000 - 1,40,000

ఎంపిక: రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: యూఆర్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.


ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: https://www.ecil.co.in/

8 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 266

		3		5		2	6	
5		4	3			9		
9			2					
	9		8			6		3
	4						1	
3		5			7		9	
					2			7
		7			9	1		6
	3	2		1		8		

సుడోకు - 265 సమాధానం

3	1	6	5	8	7	2	4	9
7	5	8	9	2	4	6	3	1
9	4	2	6	1	3	8	7	5
5	7	3	4	6	8	9	1	2
1	6	4	7	9	2	5	8	3
8	2	9	1	3	5	7	6	4
4	9	7	8	5	1	3	2	6
2	8	5	3	4	6	1	9	7
6	3	1	2	7	9	4	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.